www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 216 | శనివారం | 26 జనవరి, 2019

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00





నిఘా నీడలో గణతంత్ర వేడుకలు

ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్, బస్టాండ్లలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మనతెలంగాణ/హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఉగ్రదాడులు జరిగే అవకాశాలున్నాయని కేంద్రం దేశవ్యాప్తంగా ఉగ్రప్రభావిత రాష్ట్రాలకు చేసిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఈక్రమంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గతంలో ఐఎస్ఐఎస్‌తో సంబంధాలున్న వారి వివరాలను ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా నిజామాబాద్, సూర్యాపేట, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో నిఘా ముమ్మరం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. సికిందరాబాద్, కాచీగూడ, వరంగల్, ఖాజీపేట్, నిజామాబాద్ రైల్వే స్టేషన్లలో ప్రత్యేక పోలీసు బలగాలు తనిఖీలు చేపట్టాయి. పలు రైల్వేస్టేషన్లు, ముఖ్యమైన ప్రదేశాలలో డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. 2,500మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని నగర కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా విజన్ సెంటర్లు

- కంటి వెలుగు స్థానంలో 600 చోట్ల శాశ్వత చికిత్సా కేంద్రాలు
- కంటి వెలుగు శిబిరాలకు త్వరలో స్వస్తి



మన తెలంగాణ/ హైదరాబాద్: 'కంటి వెలుగు' శిబిరాలు ఇక విజన్ సెంటర్లుగా మారనున్నాయి. మరి కొద్ది రోజుల్లో ముగియనున్న శిబిరాలను శాశ్వత ప్రాతిపదికన కంటిపరీక్షా కేంద్రాలుగా మార్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి విజన్ సెంటర్లుగా నామకరణం చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఆరు వందల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు విస్వసనీయ సమాచారం. వచ్చే మార్చి నెల నుంచి ఇవి పనిచేయటం ప్రారంభిస్తాయి. ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం అంధత్వ నివారణ కోసం గత ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరు నెలల పాటు నిరాటంకంగా కొనసాగించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం 828 బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అన్ని వయస్సుల వారికి కంటి పరీక్షలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు దేశ చరిత్రలోనే తొలిసారిగా తెలంగాణ సర్కారు దృష్టిలోపం పై సమరభేరి మోగించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామగ్రామాన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అన్ని వయసుల వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించింది. సుదీర్ఘంగా కొనసాగిన ఈ వైద్య శిబిరాల్లో ఇప్పటి వరకూ కోటిన్నర మందికి ప్రయోజనం చేకూరింది. దీన్ని విజయవంతం చేయటానికి అవసరమైన ఏర్పాట్లను ఆదికార యంత్రాంగం విజయవంతంగా పూర్తిచేసింది. కార్యక్రమంపై కరపత్రాలు, ఇతర ప్రచార మద్యమాల ద్వారా విస్తృతంగా పట్టణాలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ఏరోజు, ఏ శిబిరానికి వెళ్ళాలి, వెంట ఏమి తీసుకెళ్ళాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకు మందులు, కళ్లద్దాలు, పరికరాలు, పరీక్షా యంత్రాలు ఇప్పటికే జిల్లాల వారీగా సరఫరా చేశారు. గ్రామ స్థాయికి వీటిని పంపిణీ చేసే ప్రక్రియ దాదాపు పూర్తయింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను యూనిట్ గా తీసుకుని 'కంటివెలుగు' నిర్వహించేందుకు 940 మంది మెడికల్ ఆఫీసర్లు, వెయ్యి మంది ఆప్తామెట్రిస్టులు, ఎనిమిది వందలమంది సపోర్టింగు స్టాఫ్ పని చేశారు. బృందంలో ఒక వైద్యాధికారి, ఆప్టోమెట్రీ, ఇద్దరు ఏఎన్ఎం సూపర్వైజర్లు, ముగ్గురు ఆశావర్కర్లు కలుపుకుని మొత్తం ఆరు నుంచి పది మంది పనిచేశారు. కంటి పరీక్షలు చేసిన వెంటనే రోగికి అవసరమైన మందులు, రీడింగ్ గ్లాసులు, కళ్ళద్దాలు అక్కడికక్కడే అందజేశారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించుకొనేందుకు 113 బఫర్ టీములు పనిచేశాయి. ముందుగా అనుకున్న దాని ప్రకారం ఆరునెలల కాలంలో శిబిరాలు పూర్తి కావచ్చాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,223 గ్రామాల్లో శిబిరాలు పూర్తయ్యాయి. ఇది మొత్తం గ్రామాల్లో 83 శాతం. మున్సిపాలిటీల పరిధిలో 676 వార్డుల్లో కంటిపరీక్షలు పూర్తయ్యాయి. మరో 565 గ్రామాల్లో, 187 వార్డుల్లో కంటివైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం మొదలైన నాటినుంచి గురువారం వరకు 1.40 కోట్ల మందికి కంటిపరీక్షలు పూర్తిచేసారు. ఇప్పటివరకు 21 లక్షల మందికి సాధారణ కళ్లద్దాలు పంపిణీచేశారు. మరో 17 లక్షల మందికి ప్రత్యేక అద్దాలు ప్రతిపాదించారు. వీటిలో పది లక్షల కళ్లద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు, ఇతర సేవల నిమిత్తం 8,50,336 మందిని రిఫర్ చేశారు. ఇప్పటి వరకు పరీక్షలు జరిపిన వారిలో 91,00,716 మందికి ఎటువంటి కంటి సమస్యలులేవని నిర్ధారించారు. ఫిబ్రవరి చివరి నాటికి ఆరునెలల గడువు పూర్వవుతుండటంతో కంటి వైద్యం గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగించేందుకు శాశ్వత ప్రాతిపదికన కేంద్రాలను కొనసాగించాలని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా విజన్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణాల్లోని కమ్యూనిటీ సెంటర్లలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటితోపాటు వైద్య విధాన పరిషత్తు అధీనంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో శాశ్వత కంటి పరీక్షలు నిర్వహిచ నున్నారు. కంటివెలుగు కోసం కొనుగోలు చేసిన వైద్యపరికరాలను ఆయా ఆసుపత్రుల్లో ఏర్పాటుచేస్తారు. వీటితో పాటు ఆప్తమాలజిస్టులను ఆయా కేంద్రాలలో నియమించ నున్నారు. శిబిరాలు పూర్తయిన నాటికి పరీక్షలు చేయించుకోవాల్సిన వారు ఇంకా మిగిలి ఉంటే ఈ కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది.

90% ఓటింగ్ నా కల

గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్



మన తెలంగాణ/హైదరాబాద్: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వాళ్లందరూ ఓటు నమోదు చేసుకుని, ఓటింగ్‌లో పాల్గొనాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. తెలంగాణలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 90 శాతం ఓటింగ్ జరగాలనేది తన కల అని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ చక్కగా నిర్వహించారని ప్రశంసించారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వాన్ని, గవర్నర్‌ను నిందించకుండా అందరూ ఓటు వేసి, భవిష్యత్తును నిర్ణయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ఒత్తిళ్లకు లొంగకుండా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విస్తరించిన ఓటర్ హెల్ప్ లైన్ 1950ను ఆవిష్కరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అధికారులకు అవార్డులు అందజేశారు.

మాజీ సిఇసి ఓటుపై దర్యాప్తు : కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ ఒ.పి. రావత్ పేరు హైదరాబాద్ నాంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో ఉండటంపై దర్యాప్తునకు ఆదేశించామని సిఇఒ రజత్ కుమార్ తెలిపారు. మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ట్యాంపరింగ్ జరిగిందనడం పూర్తిగా అవాస్తమని, దీనిపై వివాదం అనవసరమన్నారు.

హైదరాబాద్‌లో ఓటింగ్ తగ్గడం బాధాకరం : విద్యావంతులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లో ఓటింగ్ తగ్గడం బాధాకరమని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి. నాగిరెడ్డి అన్నారు.

కాంగ్రెస్ విధానాలు ప్రమాదకరం

- ప్రజాస్వామ్య వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్
- ఎన్నికల్లో ఓటర్లు గుద్దిన గుద్దుడుకు దిమ్మతిరిగిన కాంగ్రెస్
- ఎంపి బూరనర్సయ్య గౌడ్



మనతెలంగాణ/హైదరాబాద్: ప్రపంచదేశాలు భారత ప్రజాస్వామ్యవ్యవస్థను ఆదర్శంగా తీసుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ ప్రమాదకరమైన విధానాలను అనుసరిస్తోందని టిఆర్ఎస్ మండిపడింది. ఆఫ్రికాఖండంలోని అనేక దేశాల్లో ప్రజాస్వామ్యం లేకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాంగ్రెస్ నిందిస్తోందని ఆయన ఆరోపించారు. శుక్రవారం టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో టిఆర్ఎస్‌తో పోల్చితే 15 శాతం ఓట్ల తేడాతో కాంగ్రెస్ ఓడిపోయిందని బూరనర్సయ్య గౌడ్ విమర్శించారు. భారీ ఓట్ల తేడాతో ఓడిపోయిన కాంగ్రెస్ ఈవిఎం యంత్రాల్లో అవకతవకలు జరిగాయని విషప్రచారం చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ గెలిచిన చోట ఈవిఎంలు బాగానే పని చేసి టిఆర్ఎస్ గెలిచిన నియోజకవర్గాల్లోనే తప్పుగా పనిచేశాయా అని ఆయన కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ గెలిచిన రాష్ట్రాల్లో ఈవిఎంలు ఎలా పనిచేశాయని ఆయన కాంగ్రెస్‌ను నిలదీశారు. 130 కోట్ల మంది భారతీయులు నిర్మించుకున్న అతిపెద్ద ప్రజాస్వామ్యసౌధంలో టెక్నాలజీని వినియోగించుకుని పారదర్శకంగా పోలింగ్ నిర్వహణకు ఈవిఎంలు పనిచేస్తున్నాయన్నారు. ప్రతి ఈవిఎం మిషన్ ప్రభుత్వ రంగసంస్థలోనే తయారవుతాయనే విషయం కాంగ్రెస్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కాంగ్రెస్ చేస్తున్న విషప్రచారాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బూర నర్సయ్యవిమర్శించారు. శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు గుద్దిన గుద్దుడుకు కాంగ్రెస్‌కు మతిస్థిమితం తప్పిందని విమర్శించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అసత్యప్రచారాన్ని ప్రజలంతా తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కులేదు

ఎంఎల్‌సి శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయం చేయాలని ప్రయత్నించిన రాష్ట్రకాంగ్రెస్‌కు ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదని టిఆర్ఎస్ శాసన మండలి సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలో అనేక సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ తెలంగాణ అభివృద్ధిని విస్మరించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. తెలంగాణను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటు వేస్తారనే కనీస పరిజ్ఞానం కాంగ్రెస్ నాయకులకు లేకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ అసత్య ప్రచారాలతో ప్రజలదగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నదని ఆయ అన్నారు. ఈవిఎంలను ప్రవేశపెట్టిందే ఆనాటి కాంగ్రెస్ పాలకులని శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. రెండు పర్యాయాలు దేశాన్ని పాలించిన యుపిఏ ప్రభుత్వం ఈవిఎంలను ట్యాంపరింగ్ చేసిందా అని ఆయన ప్రశ్నించారు.

పసికందులపై పశువాంఛ

ముగ్గురు నిందితులపై పోక్సో కేసు నమోదు



నిందితుడు మొహినుద్దీన్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాలలో ప్రేమ పేరుతో ఒకరిని, కారులో ఊరుచేరుస్తానని మరొకరిని, మద్యం మత్తులో రెండున్నరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసిన కామాంధులపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..ప్రేమిస్తున్నానంటూ 15 ఏళ్ల బాలికను లోబర్చుకుని లైంగిక దాడికి పాల్పడుతూ ఆమె గర్భం దాల్చేందుకు కారణమైన ఓ యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌పిఆర్ హిల్స్ సమీపంలోని బ్రహ్మశంకర్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాలిక(15) ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈక్రమంలో బోరబండలోని ఓ థియేటర్‌లో పనిచేసే బాగరోలు ప్రశాంత్ పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానంటూ నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కాగా సదరు బాలిక ఇటీవల కాలంలో గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి తండ్రులు ప్రశాంత్‌పై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద అతనిపై కేసు నమోదు చేశారు. మరో సంఘటనలో, బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న బాలిక(15) జిన్నారంలోని హాస్టల్‌లో 9వ తరగతి చదువుతోంది. సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చిన బాలిక ఈనెల 19న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21న అదే కాలనీలో ఉంటున్న శ్రీను అనే యువకుడితో కలిసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. ఊరికి వెళుతున్నానని శ్రీనుకు ఫోన్ చేయగా తాను కారులో దింపుతానని తీసుకెళ్లి శారీరకంగా లోబర్చుకున్నాడని ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాలిక నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. దీంతో శ్రీనుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో అభంశుభం తెలియని పసికందుపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడటంతో తీవ్రంగా గాయపడిన బాలికను వైద్య చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని ఖైసర్ నగర్‌లో నివాసముంటున్న మొహినుద్దీన్(34) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో తన స్నేహితులతో మద్యం సేవించి ఇంటికి వస్తుండగా తన ఇంటిపక్కనే ఆడుకుంటున్న రెండున్నరేళ్ల చిన్నారిపై కన్నేశాడు. తాగిన మైకంలో ఆ చిన్నారిని సమీపంలోని ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తీవ్రంగా రక్త స్రావమైన చిన్నారి ఏడ్చుకుంటూ ఇంటికి రాగా తల్లితండ్రులు గమనించి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మొహినుద్దీన్‌ను అరెస్టు చేశారు. బాధితురాలిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తన కూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన మొహినుద్దీన్‌ను శిక్షించాలని బాలిక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

www.manatelangana.news Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 216 | శనివారం | 26 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00








ప్రణబ్‌కు భారతరత్న

నానాజీ దేశ్‌ముఖ్, భూపేన్ హజారికాకు కూడా

రాష్ట్రం కోటాలో పద్మశ్రీలు: సిరివెన్నెల సీతారామశాస్త్రి, సునీల్ ఛెత్రి

12

5|లో రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కెసిఆర్ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు

త్వరలో అఖిలేష్ రాక

-కెసిఆర్‌తో భేటీ 5|లో


5|లో నేడు రేపు వడగండ్ల వాన

-వాతావరణ శాఖ హెచ్చరిక

బహుళత్వమే భారతబలం

లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటేసి చరిత్ర సృష్టించండి. 21వ శతాబ్దిలో ఓటర్లు అయినవారు తొలి ఓటు వేయనున్న సందర్భం ఇది

దేశ ప్రజలకు రాష్ట్రపతి రిపబ్లిక్ డే సందేశం 5|లో





పూర్ణాహుతితో యాగ సమాప్తి 5|లో

అడవిదాటిన పాలమూరు రంగారెడ్డి



తుది విడత అటవీ అనుమతి మంజూరు

- కేంద్ర అటవీ శాఖ నుంచి అందిన లేఖ
- కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు సిఎం ధన్యవాదాలు

మన తెలంగాణ/హైదరాబాద్

దక్షిణ తెలంగాణ వరదాయిని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కీలకమైన అటవీ అనుమతి లభించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలలో 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు, వెయ్యికి పైగా గ్రామాలకు తాగు నీరు అందించే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం తుది అటవీ అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి కేంద్ర అటవీ శాఖ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ శ్రవణ్ కుమార్ వర్మ శుక్రవారం నాడు లేఖ రాశారు. ప్రాజెక్టు నిర్మాణానికి నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట తరువాయి 6లో

కారు హోరు

రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో టిఆర్ఎస్ ప్రభంజనం



మలి విడతలో మొత్తం పంచాయతీలు **4130**

టిఆర్ఎస్ **2608**

మన తెలంగాణ/హైదరాబాద్

రెండో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ బలపర్చిన అభ్యర్థులే అధిక సంఖ్యలో గెలుపొందారు. 3342 పంచాయతీలకు, 26,191 వార్డులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత వార్డు తరువాయి 6లో

6000 కోట్ల రుణం



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి విడత మంజూరు

ఎఫ్‌ఆర్‌బిఎం మేరకు కేంద్రం అనుమతి

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎఫ్‌ఆర్‌బిఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) కింద రావాల్సిన మరో ఆరు వేల కోట్ల రూపాయల రుణం మంజూరైంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అనుమతి మంజూరు చేసినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారి ఒకరు తరువాయి 6లో

జాబ్స్ ట్రాప్

కొలువులు ఇప్పిస్తానని 70కోట్లకు ముంచేశాడు

- నిరుద్యోగులకు కుచ్చుటోపి
- ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం
- పోర్టల్‌తో చీటింగ్, వీడియోల్లో 1,400మంది బాధితులు
- లక్షమంది నుంచి రూ.70కోట్లు వసూలు
- 14మంది నిందితుల అరెస్ట్




మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో

ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన విస్డం ఐటి సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ సిఈఓ, 13మంది సిబ్బందిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 23 లక్షలను ఫ్రీజ్ చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ శుక్రవారం ఏర్పాటు చేసిన తరువాయి 6లో

ఉపాసనకు కెటిఆర్ ధన్యవాదాలు

దావోస్‌లో తెలంగాణ బృందానికి సహాయపడినందుకు కృతజ్ఞతలు

మన తెలంగాణ/హైదరాబాద్

దావోస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ వాణిజ్య సదస్సులో వ్యాపారవేత్త, హీరో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన సందడిచేస్తూ టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావుకు ట్వీట్ చేయగా ఆయన తరువాయి 6లో



కుంచెపోటు



ఎన్నికలకు ముందు పరేడ్ కదా శకటాలు ఇట్లాగే ఉంటాయి మరి !

నాగార్జునసాగర్‌కు వాటర్ ఏరోడ్రోమ్



న్యూఢిల్లీ: ఉడాన్ పథకం కింద 235 విమాన మార్గాలకు శుక్రవారం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 18 ఎయిర్ రూట్లలో సముద్ర విమానాలు (సీ ప్లేన్స్) ఎగురుతాయి. ఆరు వాటర్ ఏరోడ్రోమ్స్‌ను కూడా ఉడాన్ ఫ్లైట్స్‌తో అనుసంధానం చేస్తారు. ఆరు వాటర్ ఏరోడ్రోమ్‌లలో తెలంగాణలోని నాగార్జున సాగర్ ఒకటి. మిగిలిన అయిదూ గౌహతి రివర్ ఫ్రంట్ , ఉమరాన్‌గావ్ రిజర్వాయర్ (అసోం), శబర్మతి రివర్ ఫ్రంట్, శత్రుంజయ్ డామ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (గుజరాత్). ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రాంతీయ అనుసంధాన పథకం కింద ప్రస్తుతం కార్యకలాపాలు సాగించని 16 విమానాశ్రయాలను కూడా కలుపుతారని పౌరవిమానయాన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రీజినల్ ఎయిర్ కనెక్టివిటీ పథకం కింద మూడో రౌండ్ కేటాయింపుల్ని విమానయాన శాఖామంత్రి సురేష్ ప్రభు ప్రకటించారు.'235 రూట్లలో అదనంగా 63.30 లక్షల సీట్లు లభిస్తాయి. సీ ప్లేన్‌లలో తరువాయి 6లో

గ్రామీణ వైద్య బృందాల ఆవశ్యకత

సంపాదకీయం

ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చుకున్న కీలక రిపబ్లిక్ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సమయంలో ప్రజల జీవన నాణ్యతను, కాలాన్ని పెంచే ఆరోగ్యరంగంలో మనం సాధించిందేమిటి అని ప్రశ్నించుకొని సమాధానం కోసం వెతికితే అత్యంత అసంతృప్తే ఎదురవుతుంది. ప్రభుత్వాసుపత్రుల్లో సేవల అందుబాటు ఇప్పటికీ పరిమితంగా ఉండడం, రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద ప్రజలు కూడా అత్యంత ఖరీదయిన ప్రైవేటు ఆరోగ్య శాలలను ఆశ్రయించక తప్పనిసరి పరిస్థితి కొనసాగుతుండడం ఈ రంగంలో స్వతంత్ర భారతావని దయనీయ స్థితిని చాటుతున్నాయి. దేశంలో 14 లక్షల మంది వైద్యులున్నప్పటికీ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ భారతానికి సకాలంలో సరైన వైద్యం అందడం గగనంగా ఉన్నది. దేశంలోగల డాక్టర్లలో 74 శాతం మంది కేవలం 28 శాతం జనాభా ఉండే పట్టణాలు, నగరాల్లోనే ఉంటున్నారు.

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలో ఒక మహిళా సర్పంచ్‌కి బుధవారం అర్ధరాత్రి వేళ పురిటి నొప్పులు రాగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి సకాలంలో తీసుకుపోయే తక్షణ సదుపాయం కరవై దారిలోనే ప్రసవించిన ఘటన దేశంలో పల్లెల్లో వైద్య సేవలు ఎంత 'ఘనం'గా ఉన్నాయో చాటుతున్నది. గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవల కోసం రోగులను డోలీలలో ఉంచి సాటి మనుషులే మోసుకుపోయే దృశ్యాలు ఇప్పటికీ కనిపిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య, పోషకాహార లోపాలు, ప్రాథమిక స్థాయిలో శాస్త్రీయమైన వైద్యం అందించే సదుపాయాలు లేక ఎంతోమంది పేదలు అకాల మృత్యువాతపడుతున్నారు.

అత్యధిక భారత జనాభా నివసించేదే గ్రామాల్లో. అక్కడ వైద్య సేవల కొరత ఇప్పటికీ కొరకరాని కొయ్యగా మిగిలిపోవడం దేశ దుస్థితిని చాటుతున్నది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నామమాత్రంగానే మనుగడ సాగిస్తున్నాయి. తగినంత మంది వైద్యులు, ఇతర సిబ్బంది, పరికరాలు, రోగ నిర్ధారణ పరీక్షల వ్యవస్థ లేక వ్యర్థమనిపించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నవీన భారత్ @ 75 పేరుతో నీతి ఆయోగ్ రూపొందించిన వ్యూహ పత్రానికి ఎంతైనా ప్రాధాన్యమున్నది. దేశాన్ని పట్టిపీడించే పలు సమస్యలపై ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని అధ్యయన సంస్థలు, వాటి నిపుణులు లోతైన పరిశీలన చేసి సమర్పించే నివేదికలు అందులోని విలువైన సిఫార్సులు ప్రభుత్వాల బీరువాలలో చిరనిద్ర తీయడమే తప్ప అమలుకు పాత్రం కావడం అరుదు. నీతి ఆయోగ్ తాజా పత్రానికి కూడా అటువంటి గతే పట్టినా ఆశ్చర్యపోనవసరం లేదు.

గ్రామాల్లో పని చేయడానికి ఎంబిబిఎస్, ఆపై చదువుల డాక్టర్లు బొత్తిగా సిద్ధంగా లేరనేది కళ్లముందున్న సత్యం. ఈ పరిస్థితుల్లో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం చాలా కాలంగా ఎండమావిగానే రుజువు చేసుకుంటున్నది. గ్రామాల్లో సరైన సామాజిక వాతావరణం, ఇళ్లు, పిల్లలకు స్కూళ్లు, మంచి రహదారులు, ప్రయాణ సదుపాయాలు వంటి మౌలిక వసతులు లేకపోవడం వల్ల ఉన్నత వైద్య విద్య చదువుకొనే డాక్టర్లు అక్కడకు వెళ్లడం లేదు. ఆమేరకు వారి చదువుకింద ప్రభుత్వం పెడుతున్న వ్యయం నిష్ఫలమైపోతున్నది.

గతంలో ఆర్‌ఎంపి, ఎల్‌ఎంపి వైద్యులుండేవారు. స్వల్ప వ్యవధి ప్రాథమిక వైద్య సేవల కోర్సును చదివి గ్రామీణ ప్రజలకు సేవలు చేసేవారు. ఆర్‌ఎంపి వైద్యులకు సర్టిఫికెట్ కోర్సు, ఎల్‌ఎంపిలకు రెండు లేదా మూడేళ్ల కోర్సులుండేవి. చైనాలో నెలకొన్న పాదచార వైద్యుల (బేర్ ఫుట్ డాక్టర్లు) వ్యవస్థ గురించి తెలిసిందే. ఈ వైద్యులు వ్యవసాయ పొలాల్లోకి కూడా వెళ్లి గ్రామీణులకు తక్షణ ప్రాథమిక వైద్యాన్ని అందించేవారు. మన దేశంలో సరైన సలహా ఇచ్చే వారు లేక నాటు వైద్యాన్ని, కొన్ని చోట్ల పసరు చికిత్సను, భూత వైద్యాలను కూడా ఆశ్రయిస్తున్నారు. అయినదానికి, కానిదానికి మితిమించి యాంటిబయోటిక్ మాత్రలను మింగించి శరీరంలోని సహజ సిద్ధమైన రోగ నిరోధక శక్తిని హరింపచేసే అశాస్త్రీయ వైద్యానికి పేదలు బలైపోతున్నారు. అందుచేత పల్లెల్లో ఉండి పని చేయడానికి వీలుగా మూడేళ్ల ప్రాథమిక వైద్య కోర్సు చదివి, శిక్షణ పొందే ప్రత్యేక వైద్య బృందాలను తయారు చేయాలని నీతి ఆయోగ్ చేసిన సిఫార్సు ఆచరణ యోగ్యమైనది. అలాగే దేశంలోని కనీసం 40 శాతం ఆసుపత్రులను వైద్య కళాశాలలకు అనుసంధానింప చేయాలన్న నీతి ఆయోగ్ చేసిన సిఫార్సు కూడా ఆచరించదగినది. వైద్య కళాశాలలను నగరాలకు, జిల్లా కేంద్రాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం నెలకొల్పడం వల్ల ప్రయోజనం అధికంగా కలుగుతుంది.

సమగ్ర దృష్టిలేని బడుగులు



టంకశాల అశోక్
9848191767

ఆర్థికంగా వెనుకబడిన అగ్ర కులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బడుగు కులాల నాయకులు, మేధావులు కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవటం లేదు. ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమా కాదా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనదా కాదా, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తున్నదా, అగ్రకులాలకు అనుకూలమైనదా వంటి చర్చలను వారు చాలానే చేస్తున్నారు. వీటిలో అనేక ప్రశ్నలకు కోర్టు తీర్పులలో సమాధానాలు లభిస్తాయి గనుక అందులోకి వెళ్లకుండా ఇక్కడ ఇతర విషయాలు కొన్ని చూద్దాము. అట్లా ఇతర విషయాలలోకి వెళ్లటంలోని ఉద్దేశం విషయాన్ని పక్కదారి పట్టించటం కాదు. కాని సందర్భం వచ్చినపుడు చర్చలోకి ఇతర సంబంధిత విషయాలను కూడా తీసుకురావాలి. అందువల్ల మొత్తం ప్రశ్నపై మనకు సమగ్ర దృష్టి ఏర్పడుతుంది. దానితో కలిగేది ప్రయోజనమే తప్ప హాని కాదు.

ఇపుడు విషయంలోకి వెళదాము. మండల్ నివేదిక ప్రకారం బిసిలకు 27 % రిజర్వేషన్లు కేంద్ర విద్యా సంస్థలు, ఉద్యోగాలలో జరిగి 27 సంవత్సరాలు అవుతున్నది. కాని అందులో సగం కూడా అమలవటం లేదు. అర్హులైన అభ్యర్థులు లేకపోవటం అందుకు కారణమని ప్రభుత్వం చెప్తున్నది. అర్హత లంటే ఉద్యోగాలకు తగిన చదువులు, శిక్షణలు. ఈ మాట చెప్పటం ఇన్నేళ్లుగా ఎటువంటి మార్పు లేకుండా కొనసాగుతూనే ఉంది. బిసిలు మాత్రమే కాదు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి కూడా ఇంచుమించు పరిస్థితి ఇదే. బ్యాక్ లాగ్‌లు పేరుకుపోతాయి.

నిర్ణీత కాలం తర్వాత ల్యాప్స్ అయి జనరల్ కేటగిరీలోకి వెళతాయి. మరి ఈ విషయంలో బడుగుల నాయకులు, మేధావులు ఏమి చేస్తున్నట్లు? చేయవలసింది ఉంది. ఈ వర్గాలన్నింటికి చదువులు, శిక్షణలు అందుబాటులోకి తెచ్చేట్లు, వాటిని నేర్చుకునే పరిస్థితులు ఆ వర్గాలకు కల్పించేట్లు, ఆ విధంగా అర్హతలను పెంచి ఖాళీలు భర్తీ అయేట్లు చేయాలి. అది తప్ప మరొక మార్గం లేదు. ఆ పని ఈ నాయకులు, మేధావులు, సంఘాలు, సంస్థలు చేస్తున్నట్లా? పేరు కోసం నాలుగు నినాదాలు రెండు ఉపన్యాసాలు ఇవ్వటం, పత్రికలలో వ్యాసాలు రాయటం మినహా వీరు చేస్తున్నదేమిటి? అందువల్లనే సమస్య ఎక్కడిది అక్కడనే అన్నట్లు ఉండిపోయింది.

ఇటువంటిదేమీ చేయకుండా, 27 % రిజర్వేషన్లను 27 సంవత్సరాలు గడిచినా, ఒక తరం మారిపోయినా నింపుకోలేని వారు, భవిష్యత్తులోనైనా నింపుకొనగలరనే ఆశ కన్పించని వారు, మరెవరికో 10% రిజర్వేషన్ ఇస్తామంటే అభ్యంతరం చెప్పటం ఎందుకు? పైగా ఆ 10% వల్ల తమ 27%కు కలిగే నష్టమేమీ లేదు. ఈ వర్గాలు 27% కి పరిమితం కానక్కర లేదని, మిగిలిన 50% కోసం కూడా పోటీపడే అవకాశం ఉందని, అటువంటపుడు ఆ 50% నుంచి 10% తీసివేస్తే అది నష్టమే కదా అనే అభిప్రాయం ఒకటుంది. ఈ మాట వినేందుకు బాగానే ఉంటుంది. కాని వివరాలలోకి వెళ్లి చూస్తే, తమకు రిజర్వ్ అయిన 27% కోటాలోనే సగమైనా నింపుకోలేనివారు, ఓపెన్ కోటా 50% గురించి మాట్లాడటంలో సహేతుకత లేదు. ప్రతిభ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో గెలిచే వారిని అదే కేటగిరీలో తీసుకోవాలి తప్ప, రిజర్వేషన్లలోకి సర్దుబాటు చేయరాదనే నిబంధన ఎట్లానూ ఉంది. అటువంటి సర్దుబాటు జరుగుతూనే ఉన్నాయి గనుక, అటువంటి కేసులు చాలా తక్కువ గనుక, విచారించవలసిందేమీ లేదు. నిజంగా విచారించదగినది ఏమైనా ఉంటే అది తమ 27%ను నింపుకోలేక పోవటమే. ఈ మాట ఎస్‌సి, ఎస్‌టిలకు కూడా వర్తిస్తుంది.

ఇపుడు మరొక విషయం చూద్దాము. ఇటీవల వచ్చిన ఒక వార్తను బట్టి, ఎనిమిదవ తరగతి విద్యార్థులు రెండవ తరగతి పాఠాలు చదవలేకపోతున్నారు. ఇటువంటి సర్వేలు అనేక సంవత్సరాలుగా తరచు వస్తున్నాయి. ఈ సర్వేకు సంబంధించి చాలా ఉన్నాయి గాని ఉదాహరణ కోసం ఇదొక్కటి చెప్పుకుందాము. ఎనిమిదవ తరగతిలో ఉండి రెండవ తరగతి పాఠాలు చదవలేని ఈ పిల్లల సామాజిక వర్గాలు, కుటుంబ నేపథ్యాలు ఏమై ఉంటాయో వేరే చెప్పనక్కర లేదు. ఇటువంటి పిల్ల పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. చదువులు మధ్యలో మానివేసే వారు, పై చదువులకు వెళ్లినా మార్కులు సరిగా రానివారు, ఒక వేళ పాసైనా ఉద్యోగాలకు అవసరమైన శిక్షణలు పొందలేనివారు, అర్హతలు సంపాదించలేనివారు అందరూ ఈ తరగతులవారే. అటువంటి స్థితిలో అర్హులైన అభ్యర్థులు లభించక ఉద్యోగాలలో రిజర్వేషన్ కోటాలు నిండకపోవటంలో వింత లేదు. మరి ఇటువంటి విషయాలలో బడుగుల పార్టీలు, సంఘాలు, మేధావులు, నాయకులు చేస్తున్నది ఏమిటి? ఇక్కడ గమనించదగిన మాట ఒకటున్నది. గత కొంత కాలంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి మొదలుకొని యూనివర్శిటీల వరకు పాఠాలు చెప్తున్న టీచర్లలో అత్యధికులు బడుగు బలహీన వర్గాలవారే. విద్యార్థులు ఆ వర్గాల వారే. అయినప్పటికీ ఎనిమిదవ తరగతి పిల్లలు రెండవ తరగతి పాఠాలు ఎందుకు చదవలేకపోతున్నారు? సమాధానం స్పష్టం. ఈ టీచర్లు సరిగా చెప్పరు. ఆ పిల్లలకు ఏమి చేయాలో తెలియదు. తల్లిదండ్రులు నిస్సహాయులు. అటువంటపుడు వీరు ఉద్యోగాలకు తగిన అర్హతలను ఎట్లా సంపాదించగలరు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి కోటాలు ఎట్లా నిండుతాయి. ఇటువంటి విషయాల లోతులలోకి వెళ్లి బడుగుల నాయకులు, సంఘాలు, పార్టీలు ఏమీ చేయవు. ఉపయోగపడని నినాదాలు, విమర్శలు మాత్రం చేస్తుంటారు. ఇది వీరి కెరీర్‌కు పనికి వచ్చే వ్యాపకంగా మారింది. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలలో బడుగుతనం అనేది అట్లుంచి ఆర్థికంగా చూసినపుడు సంపన్నులు, మధ్యతరగతి, పేదలు అనే వారున్నారు. వీరిలో రిజర్వేషన్ కోటాలను వీలైనంతవరకైనా అనుభవిస్తున్నవారు మొదటి రెండు తరగతుల వారు. మూడవ స్థాయి వారు ఆ దరిదాపులలోనైనా లేనట్లుపైన చెప్పుకున్న 8వ తరగతి – 2వ తరగతి ఉదాహరణ బట్టి అర్థమవుతుంది. బావిలో నీళ్లున్నాయి. వాటిని తోడుకునేందుకు బొక్కెన, నింపుకునేందుకు బిందె గలవారు ఆ పని వీలైనంత వరకు చేసుకుంటూ ఇంకా ఏదో కావాలని గొడవ చేస్తున్నారు. ఇంకా ఏదో కావాలనుకోవటం దానికదే తప్పు కాదు.

కాని బొక్కెన, బిందె రెండూలేక, అసలు బావి నుంచి పదిమైళ్ల దూరంలో ఉండిపోతున్న వారి సంగతేమిటి? సామాజికంగావారు ఈ వర్గాలకు చెందిన వారే కదా? ఆర్థికంగా తమకన్న అధ్వాన్న స్థితిలో ఉన్నారు కదా? అటువంటపుడు, మొత్తం సామాజిక వర్గం పేరిట వచ్చిన రాయితీలను బొక్కెన– బిందె గలవారు వీలైనంత వరకు అనుభవిస్తూ, అవిలేని అదే సామాజికులను గాలికి వదలివేయటం సామాజిక ధర్మమవుతుందా? సామాజిక న్యాయమవుతుందా? తమ సమాజంలోని బలహీనుల న్యాయాన్ని తామే పట్టించుకోకుండా, మరెవరో ఆ పని చేయటం లేదనే ఫిర్యాదుకు విలువ ఉంటుందా? ఈ స్థితిలో గల వారికి సాధికారత ఉంటే విద్య – శిక్షణలపరమైన అవకాశాలు, తద్వారా తక్కిన సాధికారతలు లభించటం. కాని నోరున్న వారు వీరిని ఉపయోగించుకునేందుకు రాజకీయ నినాదాలు ఇస్తూ, వారిని మాత్రం అదే స్థితిలో వదలివేస్తున్నారు. కనుకనే 27 సంవత్సరాలు గడిచినా 27% కోటా నిండటం లేదు. ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్లు రాజ్యాంగం అమలుకు వచ్చిన 1950 నుంచి కూడా భర్తీ కావటం లేదు.

మరొకటి గమనించండి. రిజర్వేషన్లు 50% మించరాదని, అయితే నిర్ధారణ చేయగల గణాంక వివరాలు, అత్యవసర స్థితి ఉన్నట్లయితే అంతకు మించవచ్చునని సుప్రీంకోర్టు ఇంద్రా సాహ్నీ కేసులో తీర్పు చెప్పింది. తమిళనాడు 69% రిజర్వేషన్ల విషయంలోనూ అక్కడి హైకోర్టు అదే మాట అన్నది. గణాంక వివరాలు సర్వేలలో తేలుతాయి. మరి అటువంటి సర్వేల కోసంగాని, జన గణన సర్వేలలో భాగంగా కులాల సర్వేల కోసంగాని ఈ సంస్థలు, సంఘాలు, మేధావులు గత 27 సంవత్సరాలుగా ఖాళీ నినాదాలు ఇవ్వటం మినహా పట్టుబట్టి సాధించినది ఏమైనా ఉందా? ఈ విధంగా తమవైపు నుంచి అనేక లోపాలు, వైఫల్యాలు ఉండగా, ఇంకా చెప్పాలంటే నిజాయితీ లేనితనం ఉండగా, తాము బడుగులలోని భద్రలోక్ వలె వ్యవహరిస్తున్నారు. ఈ పటాటోపం నుంచి వచ్చిన వైఖరే 10% రిజర్వేషన్లపట్ల వ్యతిరేకత. అందువల్ల తమకు నికరంగా కలిగే నష్టం ఏమీలేనపుడు రాజ్యాంగానికి ఉల్లిపొరలను తీయ చూడటం సమంజసంకాబోదు. ఆ 10% మంది కులాలు ఏవైనా వారు పేదలుగా మగ్గిపోతున్నవారు. కాకపోతే, రూ. 8 లక్షల ఆదాయ పరిమితి వంటివి దుర్మార్గంగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించటం అవసరం.


> *మండల్ నివేదిక ప్రకారం బిసిలకు 27 % రిజర్వేషన్లు కేంద్ర విద్యా సంస్థలు, ఉద్యోగాలలో జరిగి 27 సంవత్సరాలు అవుతున్నది. కాని అందులో సగం కూడా అమలవటం లేదు. అర్హులైన అభ్యర్థులు లేకపోవటం అందుకు కారణమని ప్రభుత్వం చెప్తున్నది. అర్హత లంటే ఉద్యోగాలకు తగిన చదువులు, శిక్షణలు. ఈ మాట చెప్పటం ఇన్నేళ్లుగా ఎటువంటి మార్పు లేకుండా కొనసాగుతూనే ఉంది. బిసిలు మాత్రమే కాదు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి కూడా ఇంచుమించు పరిస్థితి ఇదే. బ్యాక్ లాగ్‌లు పేరుకుపోతాయి. నిర్ణీత కాలం తర్వాత ల్యాప్స్ అయి జనరల్ కేటగిరీలోకి వెళతాయి. మరి ఈ విషయంలో బడుగుల నాయకులు, మేధావులు ఏమి చేస్తున్నట్లు? చేయవలసింది ఉంది. ఈ వర్గాలన్నింటికి చదువులు, శిక్షణలు అందుబాటులోకి తెచ్చేట్లు, వాటిని నేర్చుకునే పరిస్థితులు ఆ వర్గాలకు కల్పించేట్లు, ఆ విధంగా అర్హతలను పెంచి ఖాళీలు భర్తీ అయేట్లు చేయాలి.*

భారత రాజ్యాంగ నిర్మాణం

భారతదేశం వలస పాలన నుండి విముక్తి పొందిన తరువాత మెరుగైన సమాజాన్ని రూపొందించే విధానంలో జాతీయోద్యమ నాయకులలో తీవ్రమైన అభిప్రాయభేదాలు ఉండేవి. చివరికి ప్రజాస్వామిక సూత్రాల ప్రకారం దేశం నడవాలని చాలామంది అంగీకరించారు. మనం నమ్మిన మౌలిక సూత్రాలను, దేశాన్ని పరిపాలించే విధానాలను ఒకే చోట అందరికీ అనుకూలంగా పొందుపరచాలని అనుకున్నారు. దాని ప్రకారమే 'భారత రాజ్యాంగం 'అనే పుస్తకం అవసరం ఏర్పడింది. భారతదేశాన్ని బ్రిటిష్ వారు దాదాపు రెండు వందల సంవత్సరాలు పరిపాలించారు. వాళ్లకు అనుగుణంగానే పరిపాలన సంస్థలను రూపొందించుకున్నారు. దేశంలో అధిక భాగం రాచరిక పాలనలో ఉండి సామాజిక, సాంస్కృతిక , వైవిధ్యాలే కాకుండా పేద , ధనిక,మధ్య, అగ్ర కులాల తేడాలు ఉండేవి. మత కల్లోలాల వల్ల కూడా విభజన కాబడి ఉన్నది. మన జాతీయోద్యమం కేవలం విదేశీ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం కాదు .అసమానతలను ,దోపిడీనీ, వివక్షలను సైతం మన సమాజం నుంచి నిర్మూలించాలనీ భావించింది. దేశంలో అక్షరాస్యత స్థాయి చాలా తక్కువగా ఉండి ,తీవ్ర పేదరికంతో ఉంది. కరువు కాటకాలతో లక్షలాది మంది చనిపోయారు. మౌలిక అవసరాలైన ఆహారధాన్యాల కోసం కూడా ఇతర దేశాలపై ఆధారపడిన పరిస్థితులు. భవిష్యత్ సమాజం కోసం ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని చేరుకోవడానికి 'రాజ్యాంగం' అవసరం ఏర్పడింది.

రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి దేశం కృషి చేయాలన్నది నాయకుల అందరి ఆలోచన. దీని ప్రకారమే ఈ దేశాన్ని ఎలా సమర్థవంతంగా పరిపాలించాలి, చట్టాలు ఎలా చేయాలి, ప్రభుత్వ ఏర్పాటు ఏవిధంగా ఉండాలి, పౌరుల పాత్ర ఎంత, చట్టం ముందు అందరూ సమానమే అయినా వారికి కొన్ని ప్రాథమిక హక్కులు ఇంకా కుల ,మత ,జాతి ,సంపద భేదం లేకుండా ఎన్నికలలో పోటీ చేసే హక్కు మొదలైనవి కల్పించడం జరిగింది. ప్రజల కోసం మెరుగైన సమాజాన్ని కావాలని కోరుతూ చేసిన పోరాటం రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చాయి. వారి కలలను నిజం చేయడానికి మన రాజ్యాంగాన్ని సామాజిక ,ఆర్థిక సమానతలు లక్ష్యంగా రూపొందించడం జరిగింది. ఇందులో భాగంగా సర్వసత్తాక, గణతంత్ర దేశంగా ఉండి స్వతంత్ర అధికారాలు కలిగిన అనేక రాష్ట్రాలు ఉంటాయి. ప్రజాస్వామ్యం వల్ల సమానత్వం, స్వేచ్ఛ పౌరులందరికీ లభిస్తుంది .ప్రపంచ శాంతి కోసం , మానవాళి అంతటి సంక్షేమం కోసం కాబట్టి దీనిని 'ఉద్దేశాల తీర్మానం' అని కూడా అన్నారు..

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య లిఖిత రాజ్యగం భారత రాజ్యాంగం. అందుకే మన రాజ్యాంగం చాలా గొప్పది అని చెప్పవచ్చు. వివిధ కులాల, మతసంస్కృతుల,వివిధ ప్రాంతాల వారు అందరూ కూడా శాంతియుతంగా జీవిస్తున్నారంటే అది రాజ్యాంగ ఫలమే. స్వాతంత్ర్యం అనంతరం 1946 జూలైలో రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిగాయి. నిజానికి ఈ రాజ్యాంగ సభలో అంబేద్కర్ లేరు. ఆ తర్వాత బాబూ రాజేంద్రప్రసాద్ చూపిన చొరవతో రాజ్యాంగ సభకు కాంగ్రెస్ ఆయనను సభ్యునిగా తీసుకోవాలని నిర్ణయించుకుంది. భారతదేశానికి ఒక దిశా నిర్దేశనం చేసే ఒక రాజ్యాంగం అవసరమని1947లో నిర్ణయించారు.అందుకూ1947 ఆగస్టు29న ఏడుగురు తో కూడిన ఒక రచన సంఘాన్ని ప్రకటించారు. ఆ రచనా సంఘానికి చైర్మన్ గా అంబేద్కర్ ను నియమించారు. ఈవిధంగా చర్చ నిమిత్తం ఏర్పడిన డ్రాఫ్టింగ్ కమిటీ . అంబేద్కర్ తో పాటుగా రచనా సంఘం లో పండిట్ వల్లభాయ్ పటేల్, కె.ఎం.మున్షీ, కృష్ణస్వామి అయ్యర్, గోపాలస్వామి అయ్యంగార్, మహమ్మద్ సాదుల్లా,డీ. పి ఖైతాన్ ఉన్నారు. ఖైతాన్ ఆకస్మికంగా మరణించడంతో అతడి స్థానంలో టి కృష్ణమాచారి ని నియమించారు. ఈ రచనా సంఘానికి సలహాదారులుగా బి నరసింహారావు గారిని నియమించారు. భారత రాజ్యాంగ నిర్మాణం కోసం 2 సంవత్సరాల 11నెలల 18 రోజులు పట్టింది. ఈ రచనా సంఘంలో అందరి కంటే ఎక్కువగా కృషి చేసినది అంబేద్కర్ అని అందరూ ఒప్పుకున్నారు.రచన కమిటీ ఏర్పాటు అయినప్పటినుండి రాజ్యాంగ రచన అనే బృహత్కార్యానికి తన సర్వశక్తులూ అంబేద్కర్ వెచ్చించారు. బాబు రాజేంద్రప్రసాద్ తన చివరి ప్రసంగంలో భారతరాజ్యాంగాన్ని ఓ..శక్తి వంతమైన ఆయుధంగా మలిచిన అంబేద్కర్ ను ఎంతగానో ప్రశంసిస్తూ అంబేద్కర్ తన అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ఒక యజ్ఞంలా కొనసాగించారని అభినందించారు.



రాజ్యాంగ సభకు 1946 జూలైలో ఎన్నికలు జరిగాయి.1947 ఆగస్టులోనే దేశ విభజనతో రాజ్యాంగ సభను కూడా విభజించారు. భారత రాజ్యాంగ సభలో 299 మంది సభ్యులు వున్నారు. ఈ సభ1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది. తొలినాళ్లలో 395 నిబంధనలు,8 షెడ్యూళ్లు ఉన్న రాజ్యాంగం తదనంతర కాలంలో 450 నిబంధనలు 12షెడ్యూళ్లుగా మారింది. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా ఏర్పాటైంది. దీని కోసం అంబేద్కర్ విదేశీ రాజ్యాంగాలలో ఉన్న అంశాలనే గాక భారతదేశానికి పనికి వచ్చే ప్రజాస్వామ్యం లౌకిక తత్వం అంశాలతో పాటు స్వేచ్ఛా, స్వాతంత్రాలు కూడా రాజ్యాంగంలో పొందుపరిచారు. వీటితోపాటు ప్రాథమికహక్కులు, ఆదేశిక సూత్రాలు మార్గదర్శకాలు గా ఉన్నాయని చేర్చడం జరిగింది. రాజ్యాంగ సభ 11 సార్లు 165 రోజులు పాటు సమావేశమైంది.ఇందులో 114 రోజులు రాజ్యాంగ రచన రాతప్రతిపై రాజ్యాంగ సభలో చర్చలు జరిగాయి.1949 నవంబర్ 26 రాజ్యాంగ సభ ఆమోదం అనేది ప్రపంచంలోనే అత్యంత విశిష్ట స్థానాన్ని సంపాదించిన రోజు. ఇంతటీ మహోన్నత కార్యశీలుడైన అంబేద్కర్ అభినందనీయుడు.

భారత రాజ్యాంగానికి1935 భారత ప్రభుత్వ చట్టం మూలాధారం అయినప్పటికీ అనేక అంశాలు ఇతర రాజ్యాంగాల నుండి కూడా గ్రహించారు. వాటిలో బ్రిటన్ నుండి 'ఏక పౌరసత్వం', 'పార్లమెంటరీ విధానం', 'స్పీకర్ పదవి', అమెరికా నుండి 'ప్రాథమిక హక్కులను', 'సుప్రీంకోర్టు', 'న్యాయ సమీక్షాధికారం', ఐర్లాండ్ నుండి 'ఆదేశిక సూత్రాలను', 'రాష్ట్రపతిఎన్నిక పద్ధతిని', 'రాజ్యసభ సభ్యుల నియామకం', రష్యా నుండి 'ప్రాథమిక విధులను'. కెనడా నుండి 'కేంద్ర రాష్ట్ర సంబంధాలు', జర్మనీ నుండి 'అత్యవసర పరిస్థితి'.

ఇలా ఇతర దేశాలరాజ్యాంగాల నుండి ఉత్తమమైన వాటిని తీసుకోవడం జరిగింది.1951లోమొదటి రాజ్యాంగ సవరణ ద్వారా9వ షెడ్యూల్ ను చేర్చడం జరిగింది.1985లో 52 సవరణ ద్వారా10వ షెడ్యూల్ ను,1992లో72,73 సవరణలలో11మరియు12షెడ్యూళ్లను చేర్చడం జరిగింది. 2011వ రకూ 97సవరణలను చేయడం జరిగింది.ఈ విధంగా సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, స్వామ్య, న్యాయ, సమానత్వ, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కలిగిన గణతంత్ర భారత రాజ్యాంగాన్ని లిఖించు కోవడం జరిగింది. రాజ్యాంగ మొదటి పేజీ అయినా రాజ్యాంగ పీఠికలో ఈ విధంగా ఉంది..'భారత దేశ ప్రజలమైన మేము భారత దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్యం,గణ తంత్ర, రాజ్యంగా నిర్మించుకోవడానికి;ఈ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని; ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం ఆరాధనలో స్వాతంత్రాన్ని; అంతస్తుల్లోనూ, అవకాశాల్లోను సమానత్వాన్ని; చేకూర్చుటకు; వారందరిలో వ్యక్తి గౌరవాన్ని జాతీయ సమైక్యతను సౌభ్రాతృత్వాన్ని; పెంపొందించడానికి;1946నవంబర్26 మన రాజ్యాంగ పరిషత్తులో ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకున్నాము.'అని ఉంది. వందల సంవత్సరాలు పరాయి పాలనలో ఉన్న మనకు మన దేశాన్ని ఏ విధంగా పరిపాలించు కోవాలో తెలియజేసే నియమ నిబంధనలను దిశా నిర్దేశాలతో రూపొందించుకున్నదే మన రాజ్యాంగం.1949 నవంబర్ 26న ఆమోదం పొందాక భారతదేశం స్వాతంత్ర గణతంత్రంగా ఆవిర్భవించేందుకు 1950 జనవరి 26 రోజున ఒక పద్ధతిగా అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ రోజును ఎందుకు గణతంత్ర దినం గా జరుపుకోవాలి అంటే దానికి ఒక చారిత్రక కారణం కూడా ఉంది.1930 భారత జాతీయ కాంగ్రెస్ 'పూర్ణ స్వరాజ్' ని ఆ రోజే ప్రకటించుకుంది. అందుకే సంపూర్ణ స్వరాజ్యమైన రాజ్యాంగం అమలు ఈ రోజునే చేయాలని నిర్ణయించారు. అందుకే ప్రతి సంవత్సరం జనవరి 26న భారత రాజ్యాంగ అమలుకు గుర్తుగా భారతీయులమైన మనం ఎంతో ఘనంగా గణతంత్ర వేడుకల్ని జరుపుకుంటున్నాం.

* గోస్కుల. శ్రీలతరమేశ్
హుజురాబాద్

ఆ రెండు ఉప ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడ్డాయి. ఈలోపు జనవరి 28వ తేదీన దేశంలో రెండు చోట్ల ఉప ఎన్నికలు జరగబోతున్నాయి. ఒకటి తమిళనాడులో. మరొకటి హర్యానాలో. తమిళనాడులోని తిరువారూర్, హర్యానాలోని జింద్ నియోజకవర్గాల్లోని ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. జనవరి 3వ తేదీ నుండి నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమై, 10వ తేదీతో ముగుస్తుంది. జనవరి 31న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. హర్యానాలో ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ ఎమ్మెల్యే హరిచంద్ మిద్ధా సెప్టెంబర్‌లో మృతి చెందడంతో జింద్ స్థానం ఖాళీ అయింది. డిఎంకె అధినేత కరుణానిధి ఆగస్ట్ 7న మృతి చెందడంతో తిరువారూర్‌లో ఉపఎన్నికలు జరపాల్సివుంది. తమిళనాడు తిరువారూర్ డిఎంకె కంచుకోట కాబట్టి అక్కడి ఉపఎన్నికపై ఎలాంటి ఉత్కంఠ లేదు.

ఈ రెండింటిలోను హర్యానా హిందీ రాష్ట్రం. ఇటీవల మూడు హిందీ రాష్ట్రాల్లో పరాభవం చవిచూసిన బిజెపి కనీసం ఈ ఉపఎన్నికలో పరువు నిలబెట్టుకునే ప్రయత్నాల్లో ఉంది. మరోవైపు కాంగ్రెస్ ఈ ఉపఎన్నిక ఎలాగైనా గెలిచి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఆత్మస్థయిర్యాన్ని దెబ్బ తీయాలని చూస్తోంది. 2014కు ముందు హర్యానాలో పది సంవత్సరాల పాటు కాంగ్రెస్ పాలించింది. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే మళ్ళీ హర్యానాలో పార్టీ బలం పుంజుకుంటుందని భావించవచ్చు. హర్యానాలో ఇండియన్ నేషనల్ లోక్ దళ్ పార్టీ భవిష్యత్తు కూడా ఈ ఉప ఎన్నికపైనే ఆధారపడి ఉంది. పార్లమెంటు ఎన్నికలే కాదు, అసెంబ్లీ ఎన్నికలు కూడా హర్యానాలో జరగవలసి ఉంది. సాధారణంగా ఒకే ఒక్క స్థానానికి జరిగే అసెంబ్లీ ఉప ఎన్నికకు అంత ప్రాముఖ్యం ఉండదు. కాని ఇప్పుడు ఈ ఉప ఎన్నికల చావో రేవో తేల్చుకునే ఎన్నికగా మారింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికలకు ముందు ఉత్తరప్రదేశ్‌లో ఉపఎన్నికలు జరిగాయి. కైరానాలో బిజెపి హిందువులు వలసపోతున్నారని ప్రచారం చేసినా గెలవలేకపోయింది. అంతకుముందు ఉత్తరప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ నియోజకవర్గం గోరక్‌పూర్ లోక్‌సభ ఉప ఎన్నికలో బిజెపి ఓడిపోయింది. ఉప ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న ఫూల్‌పూర్ ఉప ఎన్నికలోను బిజెపి ఓడిపోయింది. ఈ ఓటముల కుంగుబాటు నుంచి బయటపడాలంటే హర్యానా ఉప ఎన్నికలో గెలవడం ఎంతైనా అవసరం.

కాంగ్రెస్, బిజెపిలే కాదు, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, జన్నాయక్ జనతా పార్టీ కూడా హర్యానా బరిలో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంత బలం ఉందో కొలిచే కొలబద్దగా ఈ ఉప ఎన్నిక మారింది. నెల రోజుల క్రితమే ఇక్కడ మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి విజయఢంకా మోగించింది. జింద్ ఉప ఎన్నికలో కూడా బిజెపిని గెలిపించగలిగితే హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన బలం ప్రదర్శించినట్లవుతుంది. కాని జింద్ ఎన్నికలో విజయం అంత సులభం కూడా కాదు. 2014లో మోడీ ప్రభంజనం బలంగా ఉన్నప్పుడు కూడా జింద్ నియోజకవర్గంలో బిజెపి గెలవలేదు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ నుంచి హరిచంద్ మిద్ధా గెలిచారు. కాని ఈ సారి బిజెపి తెలివిగా వ్యవహరించింది. మరణించిన హరిచంద్ మిద్ధా కుమారుడు కిషన్ మిద్ధాకు టిక్కట్ ఇచ్చింది. వారసత్వ రాజకీయాల గురించి ప్రసంగాల్లో విమర్శించడమే తప్ప ఆచరణలో నడిచేది వారసత్వమే. ఈ నియోజకవర్గంలో జాట్ నాయకులు ఎప్పుడు గెలవలేదు. మిద్ధా జాట్ కాదు. పోటీపడుతున్న మిగిలిన నేతలంతా జాట్ కులస్థులే. ఈ లెక్కలు కూడా బిజెపి టిక్కట్ వెనుక ఉన్నాయి. ఈ ఉప ఎన్నికలను కాంగ్రెస్ కూడా చాలా సీరియస్‌గానే తీసుకుంటోంది. కాంగ్రెసు తరఫున టివి చర్చల్లో ఎప్పుడు కనిపించే నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సమాచార విభాగం అధినేత రణదీప్ సింగ్ సుర్జేవాలాను అభ్యర్థిగా దించుతోంది. బిజెపికి గట్టి పోటీ ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించుకున్నట్లు కనబడుతోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విజయాలు కాంగ్రెస్‌కు గొప్ప ధైర్యాన్నిచ్చాయి. హిందీ రాష్ట్రాల్లో దాదాపు తుడిచిపెట్టుకుపోయిందని భావించిన కాంగ్రెస్ మళ్ళీ నిలబడుతుందన్న సంకేతాలు అందాయి. అందుకే, హర్యానాలో ఒక జాతీయ స్థాయి నాయకుడిని నిలబెట్టాలని నిర్ణయించుకున్నట్లు కనబడుతోంది. ఈ నిర్ణయం రణదీప్ సింగ్ సూర్జేవాలాకు పెద్ద రిస్కు వంటిదే. కాని ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రంలో, పార్టీ నిర్మాణం చిన్నాభిన్నమైపోయిన రాష్ట్రంలో స్వయంగా ప్రియాంక గాంధీ రంగంలోకి దిగి రిస్కు తీసుకుంటున్నపుడు సూర్జేవాలా వంటి నాయకుడు హర్యానాలో రిస్కు తీసుకోవడం పెద్ద విషయమేమీ కాదు.

రణదీప్ సింగ్ సూర్జేవాలాను రంగంలోకి దింపడం అంటే బిజెపికి బలమైన పోటీ ఇవ్వడమే. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హర్యానాలోని 10 లోక్ సభ స్థానాల్లో కేవలం ఒకే ఒక్క చోట కాంగ్రెస్ గెలిచింది. ఆ తర్వాత అదే సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను కాంగ్రెస్ చావు దెబ్బలు తింది. అప్పటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయింది. 90 మంది సభ్యులున్న హర్యానా అసెంబ్లీలో బిజెపి 47 స్థానాలు గెలుచుకుంది. శిరోమణి అకాలీదళ్ ఒక స్థానం గెలుచుకుంది. ఈ రెండు పార్టీల కూటమి ఇప్పుడు అధికారంలో ఉంది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ 17 స్థానాలు గెలుచుంటే, కాంగ్రెస్ కూడా 15 స్థానాలు మాత్రమే గెలిచింది. హర్యానాలో గెలుపు కోసం కాంగ్రెస్ భూమ్యాకాశాలు ఏకం చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హూదాను రంగంలోకి దించింది. మాజీ కేంద్రమంత్రి కుమారి శైలజ వంటి వారితో కలిసి సూర్జేవాలా నామినేషన్ వేశారు. హూదాపై సిబిఐ కొత్తగా మరో కేసు పెట్టింది. ఈ నాలుగేళ్ళ కాలంలో హూదాపై ఆరోపణలు చేయడం తప్ప బిజెపి ప్రభుత్వం ఆరోపణలు రుజువు చేసింది లేదు. ఇప్పుడు సిబిఐ కొత్తగా కేసు పెట్టడంతో సిబిఐ పంజరంలో చిలకగా మారిందన్న ప్రచారం కూడా పెరగవచ్చు. అలాగే ప్రియాంక గాంధీపై దాడి చేయడానికి వాద్రాపై బిజెపి ఆరోపణలు చేస్తుంది. ఒక రాజకీయ పార్టీ ప్రతిపక్షంలో ఉంటే ఆరోపణలు చేయవచ్చు, అధికారంలో ఉన్నప్పుడు చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు రుజువు చేసి శిక్షలు పడేలా చేయాలి. హూదా విషయంలో కాని, వాద్రా విషయంలో కాని ఆరోపణలు తప్ప మరేమీ కనబడడం లేదు. కాంగ్రెస్‌కు కూడా జింద్ ఉప ఎన్నిక అంత తేలిక కాదు.రాష్ట్ర కాంగ్రెస్‌లో అసమ్మతి, విభేదాలు, గ్రూపులు ఉన్నాయి. ఇప్పటికైనా గ్రూపు రాజకీయాల నుంచి బయటపడకపోతే కాంగ్రెస్ ఇక హర్యానాలో భూస్థాపితమైనట్లే అంటున్నారు విశ్లేషకులు. వ్యక్తిగతంగా రణదీప్ సింగ్ సూర్జేవాలాకు ఈ ఉప ఎన్నిక చాలా ముఖ్యమైనది. గెలిస్తే తర్వాత హర్యానా ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఓడిపోతే రాజకీయంగా ఆయనకు చాలా నష్టం. హర్యానా కైథాల్ నుంచి ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. గతంలో హర్యానా మంత్రిగా కూడా పనిచేశాడు.

మరోవైపు ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ నుంచి గట్టి పోటీ ఉంది. చౌతాలా కుటుంబంలో కలహాల వల్ల పుట్టిన జన్నాయక్ జనతా పార్టీ కూడా రంగంలో ఉంది. చౌతాలా జాట్ కుటుంబం. సూర్జేవాలా కూడా జాట్. కాబట్టి ఈ మూడు పార్టీలు జాట్ నేతలనే రంగంలోకి దించినట్లయ్యింది. బిజెపి జాట్ కాని నాయకుడిని రంగంలోకి దించింది. కాబట్టి బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోయే ప్రమాదమే ఎక్కువగా ఉంది. చౌతాలాకు ఇది జీవన్మరణ సమస్య. హర్యానా రాజకీయాల్లో, జాతీయ రాజకీయాల్లో చౌతాలా మళ్ళీ అడుగుపెట్టాలంటే ఈ ఉప ఎన్నిక గెలవక తప్పదు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ తరపున చౌతాలా ఉమేక్ రేదూను రంగంలోకి దించారు. చౌతాలా మనుమడు దుష్యంత్ చౌతాలా జన్నాయక్ జనతా పార్టీ తరపున పోటీ పడుతున్నాడు. ఈయనకు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా హర్యానాలో విస్తరించాలని చూస్తోంది. హర్యానా జింద్ నియోజకవర్గంలో జరిగే ఒకే ఒక్క ఉప ఎన్నిక ఇప్పుడు రెండు జాతీయ పార్టీలకు మరో మూడు ప్రాంతీయ పార్టీలకు అత్యంత కీలకమైన ఎన్నికగా మారింది.

* చంద్రశేఖర్





పూర్ణాహుతితో ముగిసిన సహస్ర చండీయాగం

మన తెలంగాణ/ హైదరాబాద్ : దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ లోక కల్యాణార్థం ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ నెల 21వ తేదీన ఎర్రవల్లిలోని తన స్వంత వ్యవసాయ క్షేత్రంలో ప్రారంభించిన మహారుద్ర సహిత పురస్సర సహస్ర చండీయాగం శుక్రవారం పూర్ణాహుతితో పరిసమాప్తమైంది. జగద్గురు శృంగేరీ పీఠాధిపతి భారతీతీర్థస్వామి ఆశీస్సులతో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆధ్వర్యంలో గోపూజ, గురుపూజ తదితర యజ్ఞ యాగాదులతో ప్రారంభమైన ఈ యాగం చివరి రోజైన శుక్రవారం కెసిఆర్ దంపతులు ప్రతీ మంటపానికి వెళ్ళి పూజలు చేసిన అనంతరం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. మొత్తం ఎనిమిది మంటపాలలో జరిగిన పూర్ణాహుతితో ఐదు రోజుల సహస్ర చండీయాగం ముగిసినట్లయింది. రాజశ్యామల మంటపం, బగళాముఖి మంటపం, నవగ్రహ, ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద మంటపాలలో పూర్ణాహుతి జరిగిన తర్వాత ప్రధాన యాగశాల అయిన చండీమాత మహా మంటపంలో పూర్ణాహుతి క్రతువు ప్రారంభం అయింది. యధావిధిగా ముఖ్యమంత్రి దంపతులు శుక్రవారం ఉదయం మొదట రాజశ్యామలాదేవి మంటపంలో పూజలు నిర్వహించారు. 'నమస్తత్వమే రాజశ్యామల మాతా కీ జై' అంటూ వేద పండితుల సిన మంత్రోచ్ఛారణల మధ్య పూజలు జరిగాయి. అక్కడ రుత్విక్కులు నిర్వహిస్తున్న పూర్ణాహుతిలో ముఖ్యమంత్రి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు. బగళాముఖి దేవి మంటపంలో జరిగిన పూజల్లో వేదపండితులు 'జయ పీతాంబర ధారణి దివ్య వేదోక్త మహా నీరాజనం సమర్పయామి' అంటూ పూజలు చేశారు. నవగ్రహ మంటపంలో, మహారుద్ర మంటపంలో, చతుర్వేద మంటపాలలోనూ పూర్ణాహుతి జరిగింది. 'సహస్ర శీర్షా, పురుష సంవేద పుష్పమాం, పుష్ప మాలికాం సమర్పయామి, సౌభాగ్య ద్రవ్య సమర్పయామి' అంటూ పూర్ణాహుతి నిర్వహించారు.



పది యజ్ఞకుండాలలో పదకొండు మంది చొప్పున వేద పండితులు

సహస్ర చండీయాగంలో చివరి రోజైన శుక్రవారం ఇప్పటివరకు చేసిన పారాయణాలు, జపాలకు తద్దశాంశ హోమ తర్పణాలను వేద పండితులు నిర్వహించారు. ప్రధాన కలశాన్ని ప్రతిష్ఠించిన దేవతా మంటపం దగ్గర శారదా కల్పవృక్షాన్ని అనుసరించి అమ్మవారికి షోడశోపచార పూజ నిర్వహించారు. అనంతరం చతుష్షష్టి యోగినీ బలి, మంగళ నీరాజన సేవ నిర్వహించారు. ఆ తర్వాత మథనం ద్వారా అగ్నిప్రతిష్ఠ చేసి పది కుండాలలో ఈ అగ్నితో హోమాలను ఆరంభించారు. పది యజ్ఞ కుండాలలో ఒక్కో యజ్ఞకుండం దగ్గర ఆచార్య బ్రహ్మతో కలిపి పదకొండు మంది వేద పండితులు పాయసం, తెల్ల నువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని ఆహుతులిస్తూ హోమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత అష్టదిక్పాలక బలి, ప్రాయశ్చిత్త హోమాలను నిర్వహించారు. 700 సప్తశతి (చండీ) శ్లోకాల స్వాహాకారాలకు పాయసం, తెల్లనువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని యజ్ఞభగవానుడికి హవిస్సుగా సమర్పించారు. మహాపూర్ణాహుతిలో భాగంగా చండీయాగ మంటపంలోని అన్ని యజ్ఞకుండాల అగ్నిని ప్రధాన యజ్ఞ కుండంలోకి తీసుకువచ్చి మహా పూర్ణాహుతిని ప్రారంభించారు. యజ్ఞాచార్యుడి మంగళ ద్రవ్యాలైన పసుపు, కుంకుమ, ఖర్జూరం, వక్కలు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, జీడిపప్పు, పటికబెల్లం, బాదం, పచ్చ కర్పూరం, గంధకచూరాలు, పూలు, పండ్లు, తమలపాకులు, పట్టు చీర, మారేడుకాయలు తదితరాలను పూర్ణాహుతిలో భాగంగా యజ్ఞభగవానుడికి సమర్పించారు. తరువాత నెయ్యిని ధారగా పూర్ణాహుతి సందర్భంగా యజ్ఞభగవానుడికి సమర్పించే వసోర్ధార ప్రక్రియ సాగింది. ఇదే తరహాలో మహారుద్ర, రాజశ్యామల, బగళాముఖి, చతుర్వేద, నవగ్రహ యాగ మంటపాల్లో కూడా షోడశోపచార పూజలు చేసి, హోమాల అనంతరం పూర్ణాహుతిని నిర్వహించారు. సువాసిని పూజ, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం నిర్వహించారు.

పాయస ద్రవ్యానికి ప్రత్యేక విశేషం

యాగంలో నాలుగు రోజులు కేవలం పారాయణం, జపం మాత్రమే జరసగ్గా చివరి రోజైన శుక్రవారం చండీమాత యాగశాలలో అగ్నిస్థాపన చేసి హోమాన్ని నిర్వహించారు. చండీ సప్తశతి (700)లోని ప్రతి శ్లోకాని కీ ''జుహుయాత్ పాయసం, తిల సర్పిషా'' అంటూ నువ్వులు, నెయ్యితో పాటు తయారుచేసిన పాయసాన్ని కలిపి ఆహుతిగా సమర్పించారు. సుమారు వెయ్యి కిలోల పాయస ద్రవ్యాన్ని దీని కోసం వినియోగించారు. ఈ పాయసాన్ని బియ్యం, నెయ్యి, పాలు, బెల్లం, తేనె, యాలకులు, జీడిపప్పు, కిస్మిస్ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారుచేశారు.

సత్వర ఫలితాన్ని ఇచ్చే చండీ దేవత

''కలే చండీ విశిష్యతే'' అంటూ కలి యుగంలో త్వరగా ఫలితాన్ని ఇచ్చేది చండీ దేవత అంటూ వేద పండితులు మంత్రోచ్ఛారణ ద్వారా అమ్మవారిని ఆహ్వానించారు. దీని గురించి ఒక వేద పండితుడు వివరిస్తూ, ''అమ్మవారిని ఉపాసించి ఎంతో మంది సత్ఫలితా
లను



పొందారు. అమ్మవారితోనే ఈ సప్తశతిలో ఒక మాటను అన్నది. ఎక్కడైతే ఈ సప్తశతి పఠించబడుతుందో అక్కడ నేనుంటాను. కేవలం ఉండటమే కాదు, సదామత ద్విమోక్షామిగా ఎప్పుడూ ఆ ప్రాంతాన్ని విడిచి ఉండను అన్నది. ఆమె ఎక్కడ ఉంటే అది మణి ద్వీపం. సుభిక్షం, సస్యశ్యామలం అయి ఉంటుంది. అందువల్ల చండీ ఉపాసన ప్రాశస్త్యమైంది. కల్వకుంట్ల చంద్రశేఖర రావు దంపతులు చండీ సంబంధమైన అన్ని రకాల ఉపాసనలు చేశారు. దేశ క్షేమం, లోక సంరక్షణే ప్రధాన ధ్యేయంగా సంకల్పించి రాజశ్యామల, బగ
ళాముఖి,
నవ



గ్రహ, చతుర్వేద మహారుద్ర సహిత సహస్ర చండీ మహా యాగాన్ని చేశారు. శృంగేరీ జగద్గురులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీ మహా స్వాములవారి ఆశీస్సులను అందుకొని గత నాలుగు రోజుల నుంచి గణపతి సహస్ర మోదక హోమం, రాజశ్యామలా మహా మంత్రానుష్ఠానం, లక్ష బగళాముఖీ మహా మంత్రానుష్ఠానం, సహస్ర చండీ పారాయణాలు, మహారుద్ర మంత్రాల అనుష్ఠానాలను చేసి, దశాంశ హోమ పక్షాన్ని ఆశ్రయించారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మహోద్భుతంగా అన్ని యాగాల పూర్ణాహుతులు చేసి సహస్ర చండీ మహా యాగ పూర్ణాహుతిని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దంపతులు వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ప్రత్యక్షంగా పాల్గొని అనుగ్రహించారు'' అని వివరించారు. శృంగేరీ, జీయర్, ఉడిపి పీఠాల నుండి కూడా ప్రత్యేకంగా ప్రసాదాలు వచ్చాయి. పూర్ణాహుతి అనంతరం ముఖ్యమంత్రి కెసిఆర్ రుత్విక్కులను ఘనంగా సన్మానించారు. ఐదు రోజుల పాటు జరిగిన సహస్ర చండీయాగంలో ముఖ్యమంత్రి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే తర్వాత కెసిఆర్, అఖిలేష్ భేటీ



లక్నో: సమాజ్‌వాది పార్టీ (ఎస్పి) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ రిపబ్లిక్ దినోత్సవం తర్వాత హైదరాబాద్ వచ్చి తెలంగాణ రాష్ట్రసమితి నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుతో సమావేశమయ్యే అవకాశం ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్ని పురస్కరించుకొని, బిజెపియేతర పార్టీలను, కాంగ్రెసేతర పార్టీలను కూడగట్టుకునేందుకు గత డిసెంబర్ చివరివారంలో కెసిఆర్ ఢిల్లీ వెళ్లారు. ఆ సమయంలోనే కెసిఆర్, అఖిలేష్ సమావేశం కావలసి ఉంది. అయితే అప్పుడు అఖిలేష్ లక్నోలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలకు హాజరుకావలసి ఉన్నందున చివరి నిముషంలో వీరి సమావేశం రద్దయింది. ఆ తర్వాత జనవరి 6న సమావేశం జరగాల్సి ఉంది. కానీ ఉత్తరప్రదేశ్‌లో కీలకమైన రాజకీయ పరిణామాలు సంభవించడంతో అప్పుడు కూడా కుదరలేదు. ఆ సమయంలోనే ఎసిపి, బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్‌పి) లోక్‌సభ ఎన్నికలకు యుపిలో కలిసి పోటీచేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. తను కెసిఆర్‌ను కలిసేందుకు చాలా ఆసక్తితో ఉన్నానని ఎస్‌పి జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ చెప్పారు. అన్నిపార్టీలనూ కూడగట్టేందుకు కెసిఆర్ చేస్తున్న ప్రయత్నాల్ని ఆయన కొనియాడారు. కెసిఆర్ ప్రయత్నాన్ని అభినందిస్తూ అఖిలేష్... కెసిఆర్‌ను కలిసేందుకు హైదరాబాద్ వెడతానన్నారు. 'వీరిసమావేశం తప్పక జరుగుతుంది. కానీ తేదీ ఇంకా నిర్ణయం కాలేదు' అని ఎస్‌పి నేషనల్ సెక్రెటరీ, పార్టీ ముఖ్య ప్రతినిధి రాజేంద్ర చౌదరి చెప్పారు.

గణతంత్ర వ్యవస్థ బలపడాలి

ముఖ్యమంత్రి రిపబ్లిక్ దినోత్సవ శుభాకాంక్షలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిజమైన సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా భారత ప్రజాస్వామ్య, గణతంత్ర వ్యవస్థ బలపడాలని ఆయన ఆకాంక్షించారు. కొంత కాలంగా సమాఖ్య స్ఫూర్తి గురించి వ్యాఖ్యానిస్తున్న ముఖ్యమంత్రి ఇప్పుడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా మరింత బలపడాల్సిన ఆవశ్యకతను తన సందేశంలో పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో సహకార సమాఖ్య స్ఫూర్తి, కేంద్రానికి అన్ని రాష్ట్రాలతో ఉండే సంబంధాల గురించి వ్యాఖ్యానించిన కెసిఆర్ అన్ని రాష్ట్రాల సిఎంలు పాల్గొనే నీతి ఆయోగ్ మండలి సమావేశంలో గతేడాది సమాఖ్య స్ఫూర్తి గురించి ప్రస్తావించారు. రాష్ట్రాలకు అధికార వికేంద్రీకరణ జరగాలని, అన్ని అధికారాలను కేంద్రం తన దగ్గరే కేంద్రీకరించుకోవడం సమాఖ్య స్ఫూర్తి అనిపించుకోదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'నిజమైన సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా భారత ప్రజాస్వామ్య, గణతంత్ర వ్యవస్థ బలడాలి' అని తన సందేశంలో పేర్కొనడం గమనార్హం.

నేడు రేపు, వడగండ్ల వాన

అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

మన తెలంగాణ/హైదరాబాద్ : రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వడగండ్లతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని ప్రాంతీయ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. హిందూ మహాసముద్రం దానిని ఆనుకొని ఉన్న దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రస్తుతం అల్పపీడనం కొనసాగుతోందని, దీనికి అనుబంధంగా 3.1 కి.మీల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రభావంతో శని, ఆదివారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షంతో పాటు వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు హెచ్చరించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో గడచిన రెండు రోజుల్లో పలుచోట్ల వడగండ్ల వాన కురిసింది. అయితే ఢిల్లీలోని కేంద్ర వాతావరణ కేంద్ర అధికారులు వాతావరణంలోని మార్పులను, వడగండ్లవాన కురిసే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరికలు ఇవ్వకపోవడంపై ఢిల్లీ నగర మున్సిపల్ అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఉదయం పదకొండు గంటల సమయంలో సైతం చిమ్మ చీకట్లు అలుముకుని వర్షంతో పాటు వడగండ్ల వాన కురిసింది.

బహుళత్వమే భారతబలం

లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓట్లేసి చరిత్ర సృష్టించండి • దేశ ప్రజలకు రాష్ట్రపతి రిపబ్లిక్ డే సందేశం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశ పౌరులందరూ పవిత్రకార్యంగా భావించి ఓటింగ్‌లో పాల్గొనాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు.70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది రాబేయే ఎన్నికలు 21వ శతాబ్దపు భారత దేశాన్ని తీర్చిదిద్దే విశిష్ట అవకాశంగా భావించాలని అన్నారు. ఎన్నికలు అంటే కేవలం రాజకీయ ప్రక్రియ కాదని, అది ఉమ్మడి విజ్ఞత,ఉమ్మడి కార్యాచరణ అని, ప్రజాస్వామిక స్ఫూర్తి, ఆదర్శాలు ప్రాతిపదికగా రానున్న 17వ లోక్‌సభ కొలువుతీరాలని ఆకాంక్షించారు. 21వ శతాబ్దంలో జన్మించిన వారు తొలిసారిగా ఓటు వేసే అవకాశం పొందనున్న ఈ ఎన్నికల్లో మీరు ఎవరికి ఓటు వేశారు, ఎవరిని ఎన్నుకుంటారనేది ముఖ్యం కాదని, ఓటు వేయడమే ముఖ్యమని ఆయన అన్నారు. దేశంలో మహిళలు, రైతులు సాధికారికత సాధిస్తున్నారని, డిజిటల్ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కోవింద్ పేర్కొన్నారు. జాతీయ వనరులపై అందరికీ హక్కులున్నాయనే విషయాన్ని గుర్తు చేశారు. నేటి మన నిర్ణయాలే రేపటి భారత భవిష్యత్తుకు మార్గదర్శకాలవుతాయని అన్నారు. ఈ సారి గణతంత్ర దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ ఏడాది అక్టోబర్‌లో జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతిని జరుపుకోబోతున్నామని అన్నారు. ఈ ఉత్సవాల ద్వారాగాంధీజీ ఆలోచనలను, ఆయన సిద్ధాంతాలను యావత్ ప్రపంచం అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు.

దేశంలో అన్ని ఇళ్లను విద్యుదీకరించడం శుభ పరిణామమన్నారు. పది శాతం రిజర్వేషన్ల ద్వారా అగ్రవర్ణాల్లోని పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. భారత్ ఎన్నో రంగాల్లో గొప్ప ప్రయాణం సాగించింది. అయితే మనం పూడ్చవలసిన చాలా సమస్యలు ఇంకా ఉన్నా యి. చాలా మంది కన్నీళ్లను తుడవాల్సి ఉందన్నారు. అత్యాధునిక సందాయకత ఎన్నడూ లేనంతగా మనల్ని ఏకం చేస్తోంది. భారత్ చాలా ఐక్యంగా ఉందని రాష్ట్రపతి తన సందేశంలో అన్నారు.



దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసాతో రాష్ట్రపతి కోవింద్ భేటీ

ఫిబ్రవరి మూడో వారంలో ఓటాన్ అకౌంట్

బడ్జెట్ ప్రసంగం వివరాలు పంపాలని ఆర్థిక శాఖ ఆదేశాలు



మనతెలంగాణ/హైదరాబాద్: వచ్చే నెల మూడో వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. ఈ మేరకు అవసరమైన అంచనాలను పూర్తి చేయాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. అందులో భాగంగానే బడ్జెట్ ప్రసంగంలో ఆయా శాఖల వారీగా ప్రస్తావించాల్సిన ముఖ్యమైన అంశాలను పంపివ్వాలని ఆర్థిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖలకు లేఖద్వారా కోరింది. ముఖ్యమైన పథకాలు, ప్రభుత్వ విధానాలు, ఇచ్చిన హామీలు వాటి నేరవేర్చడం, భారీ, మధ్య, చిన్న నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం, పెరిగిన ఆయకట్టు వంటి వాటిపై క్లుప్త సమాచారం పంపాలని కోరింది. అలాగే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమానికి చేస్తున్న అభివృద్ధి ఫలాలు, ఖర్చు చేసిన మొత్తం వంటి వాటిని కూడా హైలెట్ చేసే విధంగా సమాచారం పంపాలంది. ఫిబ్రవరి మొదటి వారంలోగా ఈ వివరాలు పంపాలని కోరినట్లు తెలిసింది.

నదుల పునరుజ్జీవంపై నెలాఖరుకల్లా నివేదికను సిద్ధం చేయాలి: సిఎస్



మన తెలంగాణ / హైదరాబాద్ : నదుల పునరుజ్జీవంపై ఈ నెలాఖరు నాటికి నివేదికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి శుక్రవారం ఆదేశించారు. నివేదికలో ఎన్‌జిటి ఉత్తర్వులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, పార్కుల ఏర్పాటు తదితర అంశాలన్నింటిని నివేదికలో పొందుపర్చాలని ఆయన సూచించారు. నదుల పునరుజ్జీవంపై జాతీయ పర్యావ రణ ఇంజనీరింగ్ పరిశోధన సంస్థ (ఎన్ఇఇఆర్ఐ) రూపొందించిన ముసాయిదా నివేదికపై సిఎస్ సంబంధిత అధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ ఎన్‌జిటి ఉత్తర్వులకు ముందే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు నాణ్యమైన జీవనాన్ని అందించడానికి తీసుకున్న చర్యలను కూడా నివేదికలో పొందుపర్చాలని వివరించారు. రాష్ట్రంలోని ఎనిమిది నదులలో పర్యావరణ కాలుష్యం ఏ మేరకుందో గుర్తించి ఎస్‌టిపిల ఏర్పాటుకు ప్రతిపాదించారని తెలిపారు. ఎన్ఇఇఆర్ఐ రూపొందించిన నివేదికపై ముఖ్యాంశాలతో కూడిన సారాంశ పత్రాన్ని రూపొందించాలన్నారు. ఇందులో పరిశ్రమలు, సివరేజి, జనాభాతో పాటు భూగర్భ జలాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నదుల పునరుజ్జీవం తీసుకోవాల్సిన చర్యలు, నిధులు, ఎస్‌టిపిల నిర్మాణం, టెక్నాలజీ తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. మూడేళ్లకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, కాలుష్య నియంత్రణ బోర్డు కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, టిఎస్ఐఐసి ఎండి వెంకట నర్సింహారెడ్డి, ఇపిటిఆర్ఐ డిజి కల్యాణచక్రవర్తి, జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ హరిచందన, ఇఎన్‌సి మురళీధర్‌రావు పాల్గొన్నారు.

ఉపాసనకు కెటిఆర్ ధన్యవాదాలు

(మూడవ పేజీ తరువాయి)

స్పందించారు. దావోస్‌లో తెలంగాణ బృందానికి సహాయపడినందుకు ఉపాసనకు కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు. దావోస్ అంతర్జాతీయ వాణిజ్య సదస్సులో ఏర్పాటు చేసిన ఇన్‌వెస్ట్ తెలంగాణ కార్యక్రమాన్ని ఉపాసన ప్రమోట్ చేశారు. ప్రపంచంలో నివాస యోగ్యమైన మూడుప్రాంతాల్లో తెలంగాణ ఒకటనీ,ఇండియాస్టార్ క్యాపిటల్, ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అనువైన ప్రదేశం తెలంగాణ అంటూ ఉపాసన ప్రమోట్ చేసి కెటిఆర్‌కు ట్వీట్ చేశారు. అలాగే గతంలో దివ్యాంగుల వసతిగృహాన్ని సందర్శించి నూతన భవనం కావాలని ఉపాసన కెటిఆర్‌కు ట్వీట్ చేశారు. అయితే కెటిఆర్ ఆ ట్వీట్‌కు స్పందించి పాఠశాలభవనం మంజూరు చేసి వసతిగృహానికి డిసెంబర్‌వరకు సమయం ఉందన్నారు. ప్రస్తుతం దావోస్‌లో ఉపాసన ఇన్‌వెస్ట్ తెలంగాణ ప్రోగ్రాంను ప్రమోట్ చేసి కెటిఆర్‌కు ట్విట్ చేశారు. ఉపాసన దావోస్ వాణిజ్యసదస్సులో చేసిన జాబ్‌ను ప్రశంసిస్తూ కెటిఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ఏరోడ్రోమ్

(మూడవ పేజీ తరువాయి)

లక్ష సీట్లు లభ్యమవుతాయి. అలాగే, గౌహతి నుంచి ఢాకా వరకూ స్పైస్ జెట్ సంస్థ ఉడాన్ కింద ఇంటర్నేషనల్ ఫ్లైట్స్‌ను ఆపరేట్ చేస్తుంది' అని సురేష్ ప్రభు వివరించారు.స్పైస్ జెట్, ఇండిగో, జెట్ ఎయిర్ వేస్, ఎయిరిండియా అనుబంధ సంస్థ ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్, టర్బో ఏవియేషన్ సంస్థలు థర్డ్ రౌండ్ రూట్స్‌ను దక్కించుకున్నాయి. 11 ఆపరేటింగ్ కంపెనీలు చేసి 73 ప్రతిపాదనల్ని విమానయాన మంత్రిత్వశాఖ ఆమోదించింది.

కారు హోరు

(మూడవ పేజీ తరువాయి)

సభ్యులకు పోటీ చేసిన వారి ఓట్లను లెక్కించగా, తరవాత సర్పంచ్ అభ్యర్థులకు పోలైన ఓట్లను లెక్కించారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు అందిన సమాచారం మేరకు ఏకగ్రీవాలతో కలిపి టిఆర్‌ఎస్ 2608 పంచాయతీలను కైవసం చేసుకున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ 833 స్థానాల్లో విజయం సాధించింది. బిజెపి 37, టిడిపి 39, సిపిఎం 24, సిపిఐ 12, ఇతరులు 560 చోట్ల గెలుపొందారు. మొదటి విడతతో కలిపితే టిఆర్‌ఎస్ 5237 పంచాయతీల్లో టిఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. రెండో విడతలో అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో 163 చోట్ల టిఆర్‌ఎస్ గెలుపొందింది. మొత్తం 4137 పంచాయతీలకు రెండో విడతలో నోటిఫికేషన్ ఇవ్వగా 788 సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా ఐదింటిలో నామినేషన్లు దాఖలు కాలేదు. అలాగే 94 వార్డులకు నామినేషన్లు రాలేదు. 10,317 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 793 పంచాయతీలకు, 26,191 వార్డులకు ఎన్నికలు నిర్వహించలేదు. మలివిడతలో సర్పంచ్ పదవికి 10,668 మంది, వార్డు మెంబర్‌కు 63,480 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.

ప్రశాంతంగా పోలింగ్..

రెండో విడత పంచాయతీ పోరు ప్రశాంతంగా ముగిసింది. మొదటి విడతలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. రెండో విడత పంచాయతీల పరిధిలో మొత్తం 42,79,277 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 37,76,797 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో 88.26 శాతం ఓటింగ్ నమోదైంది. మొదటి విడతతో చూస్తే 3 శాతం అధికంగా ఓటింగ్ నమోదు కావడం విశేషం. ఓటేసిన వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషులు 18,67,898 మంది, మహిళలు 19,08,889 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 10 మంది వినియోగించుకున్నారు. అత్యధికంగా యదాద్రి భువనగిరి జిల్లాలో 93.71 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తరువాత స్థానాల్లో సూర్యాపేట 92.82 శాతం, సిద్ధిపేట 92.34 శాతం, నల్లగొండలో 92.01 శాతం, మెదక్ 92.52 శాతం, మహబూబాబాద్‌లో 90.17 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా చూస్తే 10 జిల్లాల్లో 90 శాతం కంటే ఎక్కువగా, 20 జిల్లాల్లో 80 శాతం కంటే పోలింగ్ నమోదైంది. ఇక 13 జిల్లాల్లో మహిళా ఓట్ల శాతమే ఎక్కువగా ఉంది.

అడవిదాటిన పాలమూరు రంగారెడ్డి

(మూడవ పేజీ తరువాయి)

అటవీ డివిజన్‌లో ఉన్న 205.4811 హెక్టార్ల భూమిని సాగునీటి శాఖకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి 2017 మే నెలలో లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ పరిశీలించి 2018 ఏప్రిల్‌లో మొదటి దశ అటవీ అనుమతిని మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం విధించిన అన్ని విధివిధానాలను, రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేసిన కారణంగా కేంద్ర పర్యావరణ అటవీశాఖ శుక్రవారం నాడు ప్రాజెక్టుకు తుది అటవీ అనుమతిని మంజూరు చేసింది.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో నిర్మాణం అవుతున్న మొదటి స్టేజ్ పంపుహౌజ్, నార్లాపూర్ వద్ద అంజనగిరి జలాశయం నిర్మాణం, నార్లాపూర్ అంజనగిరి, ఏదుల వీరాంజనేయ జలాశయం మధ్య టన్నెల్ తవ్వకానికి అటవీ భూముల బదిలీ తప్పనిసరిగా మారింది. ఈ అనుమతితో 204.48 హెక్టార్ల అటవీ భూమి పాలమూరు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఆధీనంలోకి రానుంది. ప్రాజెక్టు పనుల పురోగతికి ఈ అనుమతి దోహదం చేయనుంది. పర్యావరణ అనుమతికి సంబంధించి ఇప్పటికే స్టేజ్ 1 అనుమతి పొందిన సంగతి తెలిసిందే. తుది పర్యావరణ అనుమతి కోసం పర్యావరణ ప్రభావంపై నివేదికను సాగునీటి శాఖ తయారు చేస్తున్నది. త్వరలోనే ఈ నివేదికను కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖకు సమర్పించనుంది. అటవీ పర్యావరణ అనుమతి లేకుండా ప్రాజెక్టు పనులను కొనసాగిస్తున్నారని, ఈ పనులను వెంటనే ఆపాలని గతంలో ఎన్‌జిటిలో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర ప్రభుత్వం కేవలం తాగునీటి సరఫరా కోసం మాత్రమే పనులను చేపట్టిందని, పర్యావరణ, అటవీ అనుమతులు పొందిన తర్వాతనే సాగునీటి పనులు చేపడుతుందని ఎన్‌జిటికి హామీనిచ్చి పనులు కొనసాగిస్తున్నది. ఈ కేసుల నేపథ్యంలో అటవీ అనుమతి కీలకమైన ముందడుగుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ దఫాలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రభుత్వం ప్రాధాన్యత ప్రాజెక్టుగా పరిగణించి పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ నెల 7వ తేదీన సాగునీటి శాఖ అధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సహస్ర చండీ యాగం తుది రోజు కార్యక్రమాల్లో ఉన్న సిఎం కెసిఆర్‌కు అటవీ అనుమతుల సమాచారం రావడంతో హర్షం వెలిబుచ్చారు. కేంద్ర అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కృషిలో పాలుపంచుకున్న నీటిపారుదల శాఖ అధికారులను కూడా సిఎం అభినందించారు.

ఆర్‌టిసి ఆర్థిక పరిపుష్టికి చొరవ చూపాలి

ఆదాయం పెంచిన అధికారులను అభినందించిన ఎండి

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్‌టిసిని ఆర్థికంగా పరిపుష్టి చేయడం కోసం సంస్థలో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందిని మొదలుకొని ఉన్నతాధికారుల ప్రతి ఒక్కరూ ప్రత్యేక చొరవ చూపాలని తెలంగాణ ఆర్‌టిసి ఇంఛార్జీ ఎండి సునీల్‌శర్మ విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా సంస్థకు సమకూరే ఆదాయ మార్గాలను కిందిస్థాయి సిబ్బంది కూడా తమ పైస్థాయి అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎవరి స్థాయిలో వారు తమ వంతు మార్గాలను అధికారులకు వివరిస్తే వాటిపై సమగ్రంగా చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంటుందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొమురయ్య (అపరేషన్స్) అధ్యక్షతన శుక్రవారం బస్‌భవన్‌లో డివిజనల్ మేనేజర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థను లాభాల బాటలో నడిపించిన ఒక రీజనల్ మేనేజర్, ఇద్దరు డివిజనల్ మేనేజర్లతో పాటు పన్నెండు మంది డిపో మేనేజర్లను ఎండి ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం ఈడి కొమురయ్య చేతుల మీదుగా ప్రశంస పత్రాలను వారు అందుకున్నారు. ఇం దుకు సంబంధించిన వివరాలు: వరంగల్ రిజియన్ రీజనల్ మేనేజర్ సూర్యకిరణ్, తన రీజియన్‌కు రూ.7.40కోట్ల ఆదాయాన్ని సమకూర్చారు.

885 మందికి రాష్ట్రపతి పోలీసు పతకాలు

సిఆర్‌పిఎఫ్‌కు రెండు కీర్తిచక్ర, ఒక శౌర్యచక్ర మెడల్స్



కానిస్టేబుల్ ప్రదీప్‌కుమార్ పండా



కానిస్టేబుల్ రాజేంద్ర కుమార్ నైనా

న్యూఢిల్లీ: ఈ ఏడాది రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 885 మంది పోలీసులకు శౌర్యపతకాలు, పోలీసు సేవా పతకాలను ప్రకటించారు. ముగ్గురు పోలీసులకు రాష్ట్రపతి శౌర్యపతకాలు,146 మందికి అత్యుత్తమ సేవలందించినందుకు పోలీసు సేవా పతకాలు, మరో 632 మందికి ప్రతిభావంత సేవలందించినందుకు పోలీసు పతకాలను ప్రకటించారు. ఈ రోజు ప్రకటించిన మూడు శౌర్యపతకాలు కూడా సిఆర్‌పిఎఫ్ జవాన్లకే లభించాయి. కశ్మీర్‌లోని అవంతిపోరాలో 2017లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భారీ ఆయుధాలు కలిగిఉన్న ఉగ్రవాదులను ఎదుర్కోవడంలో మొక్కవోని ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు సిఆర్‌పిఎఫ్ జవాన్లకు కీర్తిచక్ర పురస్కారాలు ప్రకటించగా, వారి కమాండర్‌కు శౌర్యచక్ర ప్రకటించారు. 2017 డిసెంబర్ 30న ముగ్గురు సాయుధ మిలిటెంట్లు అవంతిపోరాలోని సిఆర్‌పిఎఫ్ శిబిరంపై దాడి చేసినప్పుడు సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుళ్లు ప్రదీప్‌కుమార్ పండా, రాజేంద్ర కుమార్ నైనాలు వారితో పోరాటం జరపడంలో మొక్కవోని ధైర్య సాహసాలు ప్రదర్శించారు. దాదాపు 36 గంటల పాటు సాగిన ఈ పోరులో ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. తెల్లవారు జామున మిలిటెంట్లు జరిపిన ఈ దాడిలో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన మరో అయిదుగురు జవాన్లు కూడా ప్రాణాలు కోల్పోయారు.

కాగా ముగ్గురు మిలిటెంట్లను సిఆర్‌పిఎఫ్ జవార్లు మట్టుబెట్టారు. పండా, నైనాలకు మరణానంతరం కీర్తిచక్ర పురస్కారాలు ప్రకటించగా, వారి కమాండర్ అసిస్టెంట్ కమాండెంట్ జిలే సింగ్‌కు శౌర్యచక్ర ప్రకటించారు. కాగా, ఈ ఏడాది ప్రకటించిన రాష్ట్రపతి పోలీ సు పతకాల్లో 41 పతకాలు పొందిన సిఆర్‌పిఎఫ్ కేంద్ర పోలీసు, పారా మిలిటరీ బలగాల్లో అత్యధిక పతకాలు పొందిన విభాగంగా నిలిచింది. కాగా కశ్మీర్‌లో లష్కరే తోయిబా కమాండర్ అబు దుజానాను హతమార్చిన భద్రతా దళాల బృందంలో పాలుపంచుకున్న ఇండో–టిబెటన్ సరిహద్దు దళం(ఐటిబిపి) అసిస్టెంట్ కమాండర్ అనురాగ్ ఠాకూర్‌కు కూడా రాష్ట్రపతి శౌర్యచక్ర పురస్కారం లభించింది. ఐటిబిపికి చెందిన మరో 15 మంది జవాన్లకు కూడా రాష్ట్రపతి పోలీసు పతకాలు లభించాయి. రాష్ట్రపతి శౌర్యపతకాలు పొందిన 146 మందిలో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన వారు 41 మంది ఉండగా, 26 మంది ఒడిశా పోలీసు, 25 మంది జమ్మూ, కశ్మీర్ పోలీ సు, 14 మంది చత్తీస్‌గఢ్ పోలీసు, 13 మంది మేఘాలయ, పదిమంది యుపి, 8 మంది బిఎస్‌ఎఫ్, నలుగురు ఢిల్లీ, ముగ్గురు జార్ఖండ్ పోలీసుకు చెందిన వారుండగా, అస్సాం రైఫిల్స్, ఐటిబిపిలకు చెందిన వారు ఒక్కొక్కరున్నారు.

ఇసి అవార్డును అందుకున్న శైలజ

- దివ్యాంగులు ఓటింగ్‌లో పాల్గొనేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- శాసనసభ ఎన్నికల సందర్భంగా విస్తృత సౌకర్యాల కల్పన



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ సంచాలకురాలు బి.శైలజ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రత్యేక అవార్డును శుక్రవారం అందుకున్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి సునీల్ అరోరా చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన శాసన సభ ఎన్నికల్లో దివ్యాంగులను ఓటరుగా నమోదు చేయడంతో పాటు ఓటింగ్ ప్రక్రియలో సులువుగా పాల్గొనేందుకు ప్రత్యేక సౌకర్యాలను ఆమె కల్పించారు. ఈ అంశాలను పరిగణనలో కి తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం శైలజకు ప్రత్యేక అవార్డును ప్రకటించిన సంగతి తెలిసిందే. దివ్యాంగుల సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగిన అమెకు ఎన్నికల సంఘంలో డిప్యూటి సిఇఓగా బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల క్రతువులో వికలాంగులు పాల్గొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దివ్యాంగులతో పాటు వారి సంక్షేమం కోసం పనిచేసే సంఘాలు, సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకున్న ఆమె ఆయా అంశాలను ఎన్నికల సంఘానికి అందించింది. ఆమె సలహాలు, సూచనల అమలుకు ఎన్నికల సంఘం అంగీకరించడంతో పాటు పూర్తిస్థాయిలో సహకారాన్ని అందించింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు అవసరమైన డేటా, సాఫ్ట్‌వేర్‌ను సదరు సంస్థ నుంచి స్వీకరించి వారి అవసరాలకు తగిన రీతిలో మార్పులు చేర్పులు చేసి అమలు చేయించింది. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఎన్నికల్లో దివ్యాంగులు భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా 4.57 లక్షల మంది నూతనంగా ఓటర్లుగా నమోదు చేయించారు. ఓటింగ్‌లో పాల్గొనేలా వారిని చైతన్యవంతం చేసేందుకు ర్యాలీలు, ప్రదర్శ నలు, సమావేశాలు, సదస్సులను నిర్వహించారు.14,997 ఎపిక్ కార్డులను బ్రెయిలీ లిపిలో తయారు చేయించి అందించిన ఆమె ఈవిఎంలతో పాటు వివిప్యాట్‌లతో దివ్యాంగులకు అవసరమైన సామగ్రిని కూడా పోలింగ్ స్టేషన్లలో అందుబాటులోకి తీసుకువచ్చారు. పోలింగ్ రోజున ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క దివ్యాంగుడిని స్టేషన్‌కు చేర్చేలా పోలీసు సిబ్బందితో పాటు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు శిక్షణ అందించారు. పోలింగ్ స్టేషన్ అధికారులకు సైతం దీనిపై అవగాహన కలిగేలా చర్యలు తీసుకున్నారు.

6000 కోట్ల రుణం

(మూడవ పేజీ తరువాయి)

తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌లో 3.5% మేరకు ఎఫ్‌ఆర్‌బిఎం కింద రాష్ట్రానికి రూ. 24 వేల కోట్ల రుణం తీసుకునే అర్హత లభించింది. ఆ ప్రకారం ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవ తీసుకుని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని స్వయంగా కలిసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అర్హత పొందిన రుణంలో మూడు వంతులను మొదటి త్రైమాసికంలోనే అందజేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన జైట్లీ రిజర్వుబ్యాంకు అధికారులతోనూ మాట్లాడి మొదటి త్రైమాసికంలోనే రూ. 18 వేల మేర రుణం విడుదలయ్యేందుకు వీలు కల్పించారు. ప్రత్యేక అవసరం రీత్యా రాష్ట్రం కోరిన వెంటనే జైట్లీ సానుకూలంగా స్పందించడం పట్ల టిఆర్‌ఎస్ ఎంపిలు కృతజ్ఞతలు తెలిపారు. ఇక మిగిలిన ఒక వంతుగా రూ. 6000 కోట్ల మేరకు రుణం పొందడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అనుమతి మంజూరుచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం వచ్చేసినందున ఈ నెల చివరికల్లా రూ. 6000 కోట్ల మేర రుణం తీసుకోడానికి తెలంగాణ ప్రభుత్వానికి వీలు కలిగింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అర్హత కలిగిన మొత్తం రూ. 24 వేల కోట్లను సమకూర్చుకున్నట్లయింది.

రిజర్వుబ్యాంకు నుంచి మరో రెండు వేల కోట్ల రుణం :

రిజర్వుబ్యాంకు నుంచి ఇరవై ఏళ్ళలో తీర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలను రుణంగా తీసుకోనుంది. వచ్చే మంగళవారం జరిగే వేలంలో ఈ మేరకు రుణం లభించనుంది. తెలంగాణతో పాటు మరో పది రాష్ట్రాలు కలిసి మొత్తం రూ. 12,500 కోట్ల మేరకు రుణం కావాల్సిందిగా రిజర్వుబ్యాంకుకు విజ్ఞప్తి చేశాయి. ఇప్పటికే రిజర్వుబ్యాంకు నుంచి రూ. 12,750 కోట్లను తీసుకోగా ఇప్పుడు మరో రూ. 2000 కోట్లను సమకూర్చుకుంటోంది. దీనికి తోడు దేవాదుల, సీతారామ, తుపాకులగూడెం ప్రాజెక్టుల కోసం రూ. 10 వేల కోట్లను తీసుకుంది. ఇప్పుడు ఎఫ్‌ఆర్‌బిఎం ద్వారా రూ. ఆరు వేల కోట్లు మంజూరు కావడం విశేషంవిశేషం.

అట్టహాసంగా 'అక్షర' వార్షికోత్సవం

విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడలలో శిక్షణ కల్పించాలి : భారత ఫుట్‌బాల్ ప్లేయర్ బైచుంగ్ భూటియా





మన తెలంగాణ/చర్లపల్లి :అక్షర ఇంటర్ నేషనల్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు విద్యతో పాటు ఉత్తమ విలువలు, క్రీడలను నేర్పిస్తున్నరని భారత ఫుట్‌బాల్ ప్లేయర్ బైచుంగ్ భూటియా అన్నారు.అక్షర ఇంటర్ నేషనల్ స్కూల్ ఏఎస్‌రావునగర్ బ్రాంచ్ 3వ వార్షికోత్సవాన్ని రాప్సోడి 2019 పేరిట శుక్రవారం పాఠశాల అవరణలో అట్టహసంగా నిర్వహించారు. అక్షర ఇంటర్‌నేషనల్ పాఠశాలల గ్రూప్ చైర్మన్ జగన్ మోహన్‌రావు, సిఈఓ మదన్ మోహన్‌రావు, రామారావు, సరితరావులతో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బైచుంగ్ భూటియా మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం క్రీడలకు ప్రాధాన్యత కల్పించడం సంతోషంగా ఉందని అన్నారు. క్రీడలతో విద్యార్థులలో మంచి శారీరధారుడ్యంతో పాటు విద్యార్థుల మధ్య స్నేహం పెంపొందుతుందని అన్నారు. మదన్‌మోహన్‌రావు మట్లాడుతూ మా పాఠశాలలో చదివిన విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుకు సాగేలా తయారు చేస్తున్నామని అన్నారు. విదేశాల నుంచి వచ్చిన అతిథులు మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థులు ఒక గంట పాటు వివిధ క్రీడలలో పాల్గొంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు అతిథులు చైర్మన్, సిఈఓతో కలిసి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నౌహీరా భవనం లీజు రద్దు

మన తెలంగాణ/హైదరాబాద్ : వసతుల లేనికారణంగా, అవినీతి అక్రమాల ఆరోపణలు కారణంగా నౌహీరా భవనాన్ని మహ్మద్ ఆజాం ఆలీ, ట్రస్టు సభ్యులు రద్దు చేసుకున్నారు. ట్రస్టు చైర్మన్ మహ్మద్ ఆజాం ఆలీ ట్రస్టు సభ్యులు, నిరుపేద ప్రజల వైద్య సేవలం కోసం మెడికల్ ల్యాబ్ కోసం 2014లో నౌహీరాకు చెందిన భవనాన్ని లీజుకు తీసుకున్నారు. ఈక్రమంలో 9 గదులు కలిగిన భవనానికి రూ. 6 లక్షలు అడ్వాన్స్, నెలకు రూ.30వేల అద్దె చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే ల్యాబ్ నిర్వహణకు ఏమాత్రం సౌకర్యవంతంగా లేకపోవడంతో కొద్ది నెలలకే ఆ భవనంలో నుంచి ల్యాబ్‌ను ఇతర ప్రాంతానికి మార్చారు. అయినప్పటికీ కొన్ని నెలల పాటు అద్దె చెల్లించి ఆపై 2017 జనవరి నెలలో లీజు అగ్రిమెంట్ రద్దు చేసుకున్నారు. ఒక వైపు ట్రస్టుకు అద్దెకిచ్చినట్లు రికార్డులో చూపించిన నౌహీరా కార్పొరేషన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ల్లో రూ.5 కోట్ల రుణం తీసుకుంది. బ్యాంకులకు తిరిగి అప్పులు చెల్లించని కారణంగా ఆ భవనాన్ని బ్యాంకులు స్వాధీనం చేసుకున్నాయి. హీరోగోల్డ్ యజమానురాలు నౌహీరా షేక్ తన ఆస్తులను కాపాడుకోవడం కోసం మహ్మద్ ఆజాం ఆలీకి లీజుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హీరాగోల్డ్ అక్రమాలను ముందే గుర్తించిన మహ్మద్ ఆజాం ఆలీ వాటిని అప్పట్లోనే లీజును రద్దు చేసుకున్నారని పోలీసు వర్గాలు వివరిస్తున్నాయి.

జాబ్స్ ట్రాప్

(మూడవ పేజీ తరువాయి)

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన కొల్లా అజయ్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తర్వాత కొద్ది రోజులు ఉద్యోగం చేసిన తర్వాత దానికి రాజీనామా చేసి 2009లో విస్డం ఐటి సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైటెక్ సిటీ, మాదాపూర్‌లో ఏర్పాటు చేశాడు. 2011, ఫిబ్రవరిలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించి ఇండియా, గల్ఫ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రెండు వెబ్ సైట్లు ఏర్పాటు చేశాడు. ఇండియాలోని వారి కోసం విస్డంజాబ్‌ఇండియా.కామ్, గల్ఫ్‌లోని నిరుద్యోగులకు విస్డమ్‌జాబ్‌గల్ఫ్.కామ్ ఏర్పాటు చేశాడు. తాము చాలా కంపెనీలతో ఎంఓయూ చేసుకున్నామని వాటిలో ఉద్యోగాలు ఇప్పించడంతో పాటు రెజ్యూమ్ ప్రిపేర్, ఫార్వర్డ్, హైలైట్ తదితర సేవలు అందిస్తామని చెబుతారు. ఈ సేవలు కావాల్సిన వారు వెబ్ సైట్‌లో వివరాలు పొందుపర్చాలని కోరుతారు. వివరాలు నమోదు చేసుకున్న వారికి సేవలు అందించేందుకు కన్జుమర్ సేల్స్ డివిజన్, ఇండియా, గల్ఫ్ పేరుతో రెండు డివిజన్లు ఏర్పాటు చేశారు. కొందరు ఉద్యోగులను నియమించుకుని డివిజన్లకు హెడ్స్‌గా నియమించారు. వీరికి సాయంగా మరికొందరు ఉద్యోగులను నియమించాడు. నిరుద్యోగులను ఎలా ఆకట్టుకోవాలి, ఎలా ట్రాప్ చేయాలనే దానిపై వారికి శిక్షణ ఇప్పించాడు. ఇండియాలో,మిడిల్ ఈస్ట్‌లో ఉద్యోగాలు ఉన్నాయని వెబ్‌సైట్‌లో పేర్కొంటారు. రెజ్యూమ్‌ను అప్‌లోడ్ చేసిన వారికి ఫోన్లు చేసి మీ రెజ్యూమ్ బాగుందని మీకు తప్పని సరిగా ఉద్యోగం వస్తుందని ఫోన్ చేసి ట్రాప్ చేస్తారు. రెజ్యూమ్ ఫార్వర్డ్ చేసేందుకు 150 డాలర్లు చెల్లించాలని ఒత్తిడి చేస్తారు. డబ్బులు చెల్లించిన తర్వాత ఐదు రోజులకు ఫోన్ చేసి మీకు ఇంటర్వ్యూ ఉందని యూఏఈకి చెందిన రావన్ జనరల్ పెట్రోలియం కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ఇంటర్వ్యూ చేస్తారని చెబుతారు. కాల్‌ను మేనేజర్ ఏంజెలా బోస్‌కు కనెక్ట్ చేస్తున్నామని చెబుతారు. ఆమె ఫోన్‌లోనే ఇంటర్వ్యూ పూర్తి చేసి సీనియర్ ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికయ్యావని చెబుతారు. తర్వాత రావణ్ జనరల్ పెట్రోలియం కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని సర్టిఫికేట్ల వెరిఫికేషన్, డాక్యుమెంట్ల కోసం సెక్యూరిటీ డిపాజిట్ కింది 525 డాలర్లు చెల్లించాలని చెబుతారు. డబ్బులు చెల్లించిన తర్వాత కమ్యూనికేషన్ మొత్తం ఆపి వేస్తారు. ఫోన్ చేసినా, వచ్చి ఆఫీస్‌లో కలిసినా కూడా వారు స్పందించడం మానివేస్తారు. చింతల్‌కు చెందిన ఏడుకొండలు విస్డమ్‌వెబ్‌సైట్‌లో రెజ్యూమ్ అప్‌లోడ్ చేశాడు. పై విధంగా ఫోన్‌లో ఇంటర్వ్యూ చేసిన తర్వాత ఉద్యోగానికి ఎంపికయ్యావని చెప్పారు. పైవిధంగా దశల వారీగా రూ. 50వేలు కట్టిన తర్వాత మళ్లీ 165 డాలర్లు కట్టాలని చెప్పడంతో కంపెనీపై అనుమానం వచ్చి సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం మొత్తం బయటపడింది. సంస్థ సిఈఓ అజయ్ కొల్ల, సయిద్ మజహర్, రోహిత్, బస్వరాజ్ నాయకొడి, గోపినాథ్ సూరెడ్డి, రాజేష్, శుభం కుమార్ సింగ్, సామ్రాట్ పండుగుల, నిఖిత జైన్, మాధురి వీపురి, కార్తిక్ కుమార్, శమికాంత్ కన్‌కమనేని, రవికిరణ్, శ్రీకాంత్ గటోజును పోలీసులు అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో డిసిపి క్రైం జానకి శర్మిళ, సైబర్ క్రైం ఎసిపి శ్రీనివాస్ కుమార్, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాల్ సెంటర్ ఏర్పాటు...

అజయ్ కొల్లం కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 240మంది టెలీకాలర్లను నియమించుకుని వారి ద్వారా ఫోన్లు చేయిస్తున్నాడు. ఇండియాలో 3,59,450, గల్ఫ్‌లో 1,74,000ఉద్యోగాలు ఉన్నాయని వెబ్‌సైట్లో పేర్కొన్నారు. వీటిని నమ్మి దాదాపుగా ప్రపంచ వ్యాప్తంగా 25లక్షల మంది నమోదు చేసుకోగా, లక్షమంది నుంచి రూ.70 కోట్లు వసూలు చేశారు. వెబ్‌సైట్లలో వివరాలు పొందుపర్చిన వారికి ఫోన్లు చేసి డబ్బులు కట్టేవరకు వెంటపడతారు. ప్యాకేజ్‌లు కూడా ఉన్నాయని చెబుతారు. ఒక్కోదానికి ఒకరేటు చెప్పి డబ్బులు వసూలు చేస్తారు. డబ్బులు కట్టిన తర్వాత స్పందించడం మానివేస్తారు. వీరి బాధితులు 26దేశాల్లో ఉన్నారు.

గల్ఫ్‌లోని పేరున్న కంపెనీలు తమతో ఎంఓయూ కుదుర్చుకున్నాయని అక్కడి వారిని నమ్మిస్తారు. నిజానికి వీరు మిడిల్ ఈస్ట్ కంపెనీలతో ఎలాంటి ఎంఓయూ కుదుర్చుకోలేదు. తెలంగాణ, ఎపి, గుజరాత్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిసా, పంజాబ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, కేరళ, రాజస్థాన్, ఢిల్లీ, గోవా రాష్ట్రాలకు చెందిన వారిని ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారు. విదేశాలకు చెందిన 1,400మంది బాధితుల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేశారు.

నకిలీ ఇంటర్వ్యూలు...

డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నామని సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి తెలుసు. పక్కపక్కనే ఆఫీస్‌లో ఉంటారు. వేరే దేశం నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పి మాట్లాడుతారు. దీని కోసం నిఖితా జైన్, మాధురి వీపూరిలను సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించారు. ఏంజిలా బోస్‌గా నిఖితా జైన్, జెస్సీ పేరు చెప్పి మాధురి మాట్లాడి మోసం చేస్తున్నారు. మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులమని చెప్పి మాదాపూర్‌లోని ఆఫీస్‌లో పక్కపక్కనే కూర్చుని ఫోన్‌లో నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాగా మాట్లాడి డబ్బులు కట్టించిన వారికి భారీ మొత్తంలో ఇంటెన్సీవ్‌లు ఇవ్వడంతో వీరు చాలామందిని బోల్తా కొట్టించి డబ్బులు కట్టించారు.

యువత నమ్మవద్దు: సిపి

నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇస్తామని చెబితే నమ్మవద్దని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ అన్నారు.

మొదట ఏపి..తర్వాత తెలంగాణ

గణతంత్ర వేడుకల్లో పాల్గొననున్న గవర్నర్

10.45 నిమిషాలకు పరేడ్ మైదానంలో..



మనతెలంగాణ /హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ శనివారం జరిగే గణతంత్ర వేడుకల్లో ముందుగా ఏపిలో పాల్గొననున్నారు. అనంతరం ఆయన తెలంగాణలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. శుక్రవారం మధ్యాహ్నం గవర్నర్ అమరావతికి చేరుకున్నారు. అక్కడ జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొన్నారు. 26వ తేదీ ఉదయం 8.45 నిమిషాలకు అమరావతిలో జరిగే గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొంటారు. అక్కడ జెండా వందనం స్వీకరిస్తారు. అక్కడి నుంచి 9.25 నిమిషాలకు బయలుదేరి 10.15 నిమిషాలకు ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. 10.45 నిమిషాలకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర దినోత్సవంలో పాల్గొంటారు.

కూటమి నాయకుల రాళ్లదాడి

టీఆర్ఎస్ మద్ధతిచ్చిన సర్పంచ్ జగన్ గెలుపును తట్టుకోలేక రాళ్లు, కారంపొడితో దాడులు, 10మందికి గాయాలు

మన తెలంగాణ / నారాయణఖేడ్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోగా అధికంగా ప్రజలు నిర్ణయించిన అభ్యర్థులు గెలుపు విజయాలపై ఉండగా గెలుపోటములు సహజమే అయినప్పటికీ టిఆర్ఎస్ గెలుపును జీర్ణించుకోలేని మహా కూటమి నాయకులు రాళ్లదాడికి పాల్పడ్డారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం నిజాంపేట్‌లో టిఆర్ఎస్ పార్టీ మద్ధతుదారుడైన జగన్‌చారి 806 ఓట్లతో గెలిచాడు. వార్డు మెంబర్లు 14కు గాను 8మంది టిఆర్ఎస్ నాయకులు గెలిచారు. ఇలాంటి విజయాన్ని జీర్ణించుకోని మహాకూటమి నాయకులు రాళ్లు, ఇసుక, కారంపొడితో దాడికి దిగి 10మందిని గాయపర్చినట్లు టీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గాయపడిన వారిలో ప్రవీణ్‌రెడ్డి, రాములు, రమేష్, మల్లయ్య, కిరణ్‌కుమార్‌తోపాటు మరో 5మంది గాయాలకు గురయ్యారని తెలిపారు. పాఠశాలలో శనివారం ఎన్నికలు నిర్వహించగా గెలిచిన సర్పంచ్ జగన్‌తో పాటు వార్డు మెంబర్లు, పలువురు నాయకులు కాలినడకన వెళ్తుండగా అదే అదును చూసిన కూటమి నాయకులు గ్రామంలోని జాల బాలయ్య ఇంటి సమీపంలోకి రాగానే చాటునుంచి రాళ్లు, కారంపొడితో దాడులు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఉద్రిక్తతను అదుపుచేశారు. ఈ విషయమై నారాయణఖేడ్ ఎస్ఐ సందీప్‌ను ఫోన్‌లో వివరణ కోరగా గ్రామంలో గొడవలు జరిగిన కారణంగా పోలీస్ పికెటింగ్ కొనసాగుతుందని, ఎన్నికల దృష్ట్యా 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు.

ఓటమి భారంతో ఆత్మహత్యాయత్నం

పరిస్థితి విషమం



మన తెలంగాణ /గుడిహత్నూర్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్ తండా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓడిపోయిన పవర్ కళాబాయి అనే అభ్యర్థిని ఓటమి భారంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం ఎన్నికలను కౌంటింగ్ ప్రారంభమైన అనంతరం జాదవ్ సులోచనాబాయి అనే మహిళ సర్పంచ్‌గా గెలుపొందింది. దీనిని అవమానంగా భావించిన పవర్ కళాబాయి ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. ఇది గమనించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. సర్పంచ్ ఎన్నికలలో ఆమె రెండవసారి ఓడిపోవడంతో మానసికంగా కుంగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి

12మందిపై కేసు నమోదు

మన తెలంగాణ / టేకులపల్లి : మండల కేంద్రంలో శుక్రవారం టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడిజరిగింది. మూడొవ విడత గ్రామ పంచాయతీ ప్రచారంలో భాగంగా టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామం లో ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ప్రచారంలో పాల్గొన్నారు.ఈ క్రమంలో ఆమెను గ్రామస్తులు అడ్డుకున్నారు . అందుకు నిరసనగా కాంగ్రెస్ కార్యకర్తలు టేకులపల్లి మండలంలోని టిఆర్ఎస్ పా ర్టీ కార్యాలయంపై దాడి చేశారు. ఈ సంఘటన స్థలానికి సిఐ నాగరాజు, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు చేరుకోని దాడి చేసిన 12 మంది పై కేసు నమోదు చేశారు.

గోలెంలో పడి చిన్నారి మృతి



మన తెలంగాణ/సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజినగర్‌లో గుణాకర్ (5)అనే బాలుడు నీటిగొలెంలో పడి మరణించిన సంఘటన ఆ ప్రాంతవాసులను కలిచివేసింది. సంఘటనకు సంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా కేబుల్ కన్షన్లు ఇస్తూ జీవనం సాగిస్తున్న అనుముల రవీందర్ సంధ్య దంపతులకు ఇద్దరు సంతానం కూతురు జ్యోత్స్న(7), కుమారుడు గుణాకర్(5) స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించడంతో పిల్లలు బడికి వెళ్లలేదు. తల్లి ఇంట్లో పనిచేసుకుంటుండగా అక్కా తమ్ముడు ఇంటి ముందర ఆడుకుంటున్నారు. చేతులకి మట్టి పూసుకున్న తమ్ముడు గోళెం వద్దకు వెళ్లి తల మునిగే లోతు మాత్రమే ఉన్న నీళ్లను అందుకోవడానికి లోపలికి తొంగి చూసి అందులోనే పడిపోయాడు. కాళ్లు పైకి, తల నీళ్లలో మునగడంతో ఊపిరాడక చనిపోయాడు. అక్క ఆడుకుంటూ తమ్ముడు గోళెంలో దాచుకున్నాడని పట్టించుకోలేదు. కొద్ది సేపటి తర్వాత పోయి కదిలించి కేకలు వేయడంతో తల్లి ఇంట్లోనుండి వచ్చి బాలుడిని చూసే సరికి అప్పటికే చనిపోయి ఉండడంతో లబోదిబో మంటూ రోధించింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి తల్లీ పిల్లల రోధన చూసి కంటతడి పెట్టారు.

ఓట్ల గల్లంతుపై చర్యలు తీసుకున్నారా?



మనతెలంగాణ /హైదరాబాద్: ఓట్ల గల్లంతుపై ఇప్పటివరకు ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ ఎన్నికల కమిటీ చైర్మన్ మర్రిశశిధర్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఎన్నికల కమిషన్‌ను తప్పుబట్టారు. 22 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని స్వయంగా ఎన్నికల కమిషన్ అంగీకరించినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని శశిధర్ రెడ్డి ప్రశ్నించారు. 2017లో ఆధార్ అనుసంధానం పేరుతో తొలగించిన లక్షల ఓట్లను సరిచేశారని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థను కూడా ఎన్నికల సంఘం తప్పుదోవపట్టిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాలకంటే మద్యం దుకాణాలే అధికంగా ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి. హనుమంతారావు ఆరోపించారు. హైవేల్లోని మద్యం పర్మిట్ రూమ్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒకవైపు ప్రజలకు మద్యం తాగిస్తూ మరోవైపు కేసులు నమోదు చేస్తోందన్నారు. పర్మిట్ రూమ్‌లను ఎత్తివేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆయన సూచించారు.

శబ్ధకాలుష్యంలోనూ హైదరాబాద్

- వచ్చే ఏడాది పెరగనున్న పిఎం 10, పిఎం 2.5 తీవ్రత
- అధ్యయనంలో తేల్చిన ఈపిటిఆర్ఐ



మనతెలంగాణ /హైదరాబాద్ : అధికంగా వాయు, శబ్ద కాలుష్యం నమోదవుతున్న నగరాలను చూసుకుంటే మొదటి స్థానంలో చెన్నై ఉండగా, రెండో స్థానంలో హైదరాబాద్, మూడో స్థానంలో ముంబై ఉన్నాయి. అత్యధికంగా హైదరాబాద్‌లో ఈ కాలుష్యం నమోదవుతున్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చూసుకుంటే వాయు, శబ్ద కాలుష్యం అధికంగా పరిశ్రమలు ఉన్న చోటే కాకుండా మిగతా చోట్ల కూడా ఇది ఎక్కువగా ఉన్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. వాయు కాలుష్యం ఎక్కువగా విజృంభిస్తుండడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నట్టు పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. సూక్ష్మ ధూళికణాలు (పీఎం 10), అతి సూక్ష్మ ధూళికణాలు (పీఎం 2.5) విరుచుకు పడుతున్నాయి. పీఎం 10 గత నాలుగేళ్లలో జూబ్లీహిల్స్‌లో 47 మైక్రోగ్రాములు (ఎంజీలు) కాగా ఎంజీబీఎస్ వద్ద 32, రాజేంద్రనగర్‌లో 31, జీడిమెట్లలో 26, బాలానగర్‌లో 12, ఉప్పల్‌లో 16, మాదాపూర్‌లో 20, కేబిఆర్ పార్కు వద్ద 10, లంగర్‌హౌస్ 11, ప్యారడైజ్ వద్ద 8 గ్రాములు పెరిగింది. అత్యంత ప్రమాదకరమైన అతి సూక్ష్మ ధూళికణాలు (పిఎం 2.5) తీవ్రత 2016తో పోలిస్తే 2017లో అధిక శాతం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. బాలానగర్‌లో 49 ఎంజీల నుంచి 59 ఎంజీలకు, ఉప్పల్‌లో 42 నుంచి 51 ఎంజీలకు, చార్మినార్‌లో 48 నుంచి 60 ఎంజీలకు, జీడిమెట్లలో 48 నుంచి 59 ఎంజీలకు, సనత్‌నగర్‌లో 43 నుంచి 56 ఎంజీలకు పెరిగింది.



జూబ్లీహిల్స్, తార్నాకలో శబ్ధకాలుష్యం

వచ్చే ఏడాది పీఎం 10, పీఎం 2.5 తీవ్రత భారీగా పెరగవచ్చని ఈపీటిఆర్ఐ తన అధ్యయనంలో తేల్చింది. 2006లో పీఎం 10, 29,599 టన్నులు ఉండగా 2020 నాటికి 43,550 టన్నులు వెలువడే అవకాశముందని ఈపీటిఆర్ఐ అంచనావేస్తుంది. 2006లో పీఎం 2.5, 11,380 టన్నులు వెలువడగా వచ్చే ఏడాది నాటికి 18,142 టన్నులకు చేరుతుందని లెక్కకట్టింది. పంజాగుట్ట, జూపార్క్, హెచ్‌సీయూ, సనత్‌నగర్, ప్యారడైజ్, ఆబిడ్స్, అమీర్‌పేట, కూకట్‌పల్లి, బాలానగర్, చార్మినార్ తదితర రద్దీ ప్రాంతాల్లో నేరుగా రక్తంలో కలిసే కార్బన్ మోనాక్సైడ్ నైట్రోజన్ ఆక్సైడ్ల తీవ్రత రోజురోజుకి పెరుగుతున్నదని అధికారులు పేర్కొంటున్నారు. నివాసిత, వాణిజ్య, సున్నిత ప్రాంతాలతో పోలిస్తే పారిశ్రామిక ప్రాంతాల్లోను శబ్ధకాలుష్యం నిర్దేశిత పరిమితుల కంటే తక్కువగా నమోదవుతుండగా, జూబ్లీహిల్స్, తార్నాక, ఆబిడ్స్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో శబ్ధకాలుష్యం ఎక్కువగా ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

ఆ రెండు రోజుల్లో తగ్గిన కాలుష్యం

సంక్రాంతికి హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రజలు వెళ్లిపోవడంతో రెండు రోజుల పాటు కాలుష్యం తగ్గిపోయిందని పిసిబీ లెక్కలు తేల్చాయి. మాములు రోజుల కంటే ఈ రెండు రోజుల్లో సగానికి పైగా కాలుష్యం తగ్గినట్టు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఈ పండుగకు 30 లక్షల మంది హైదరాబాద్ విడిచి సొంత ఊర్లకు వెళ్లగా, వ్యక్తిగత వాహనాలు వాడే వారి సంఖ్య సగానికి పైగా తగ్గిపోయినట్టు అధికారులు పేర్కొంటున్నారు. నగరంలో ప్రతిరోజు 50 లక్షల వాహనాలు రోడ్లపై తిరిగితే ఆ రెండు రోజులు మాత్రం కేవలం 25 లక్షల వాహనాలు రోడ్లపైకి వచ్చాయని అధికారులు పేర్కొంటున్నారు. మామూలు రోజుల్లో ధూళి కాలుష్యం ఘనపు మీటరు గాలిలో (మైక్రోగ్రాముల్లో) చూసుకుంటే 14, 15వ తేదీల్లో తక్కువగా నమోదయ్యిం ది. బాలానగర్‌లో మామూలు రోజులై తే 128గా నమోదయి తే సంక్రాంతి రోజు 68గా నమోదయ్యింది. చాలాచోట్ల సగానికి పైగా కాలుష్య తీవ్రత తగ్గినట్టు అధికారులు పేర్కొంటున్నారు.

నిర్దేశిత పరిమితులు ఇలా...

సంస్థ	పిఎం10	పిఎం2.5
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి	60	40
ప్రపంచ ఆరోగ్య సంస్థ	20	10

(వార్షిక సగటు ఘనపు మీటరు గాలిలో మైక్రోగ్రాముల్లో)

ఆకుపచ్చని రాష్ట్రంగా మార్చడమే కెసిఆర్ లక్ష్యం

- రాజకీయాల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలి : హరీశ్‌రావు

మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి : ప్రపంచంలోనే ఇతర దేశాలతో పోల్చితే భారతీయులకే కష్టపడే మనస్తత్వం ఎక్కువగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యాపక, నెహ్రూ యువకేంద్ర బృందాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ యూత్ పార్లమెంటరీ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లోకి రావడానికి యువత ఆసక్తి చూపలన్నారు. వాతావరణంలో నెలకొన్న కాలుష్యం కారణంగా అడవులు రోజు రోజుకు అంతరించి పోతున్నాయని అన్నారు. సిఎం కెసిఆర్ దూరదృష్టితో ఆలోచించి వాతావరణ సమతుల్యం కోసం ప్రయత్నాలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రాన్ని ఆకుపచ్చగా మార్చడానికి హరితహార కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. దేశంలో అన్నం పెట్టే రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వవు కానీ కోట్ల రూపాయలు ఎగగొట్టే ఆస్తిపరులకు, ఆర్థిక నేరగాళ్లకు రుణాలు ఇస్తున్నాయని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ఏ ఒక్క టెర్రరిజం సంఘటన ఎక్కడ జరగలేదన్నారు. రాష్ట్రంలో టెర్రరిస్టుల అణచివేతకు పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి నిఘా సారించటం జరిగిందన్నారు. క్రీడా రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేసి క్రీడకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని అన్నారు.యావత్ దేశంలోనే నేషనల్ యూత్ పార్లమెంటరీ ఫెస్టివల్ సెమినార్లు నిర్వహించాలని దీంతో యువతలో ఎంతో అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు కెమ్మెసారం ప్రవీణ్‌కుమార్, బర్ల మల్లికార్జున్, చిప్ప ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు ఉన్నారు.



విద్యుత్ షాక్‌తోనే పెద్దపులి హతం

24 గంటల్లో కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్



మనతెలంగాణ /మంచిర్యాల ప్రతినిధి: పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు పోలీసుల సాయంతో కేవలం 24 గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి రామన్‌కాలనీలో స్వాధీనం చేసుకున్న పులి చర్మం కేసును ఆరాతీయగా వేటగాళ్లు అమర్చిన విద్యుత్ షాక్‌తోనే పక్షం రోజుల క్రితం మృతి చెందిందని అధికారులు వెల్లడించారు. అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు పెద్దపులి తగిలి మృత్యువాత పడగా వెంటనే దాని చర్మాన్ని,గోళ్లను తీసి కళేబరాన్ని జైపూర్ మండలం శివారం అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టినట్లుగా శుక్రవారం పోలీసు, అటవీశాఖ అధికారులు కనుగొన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థప్రతినిధిలు, మంచిర్యాల అటవీ శాఖ అధికారులు మందమర్రిలోని రామన్‌కాలనీలో రెండు రోజుల పాటు రెక్కీ నిర్వహించి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పులి చర్మం కొనుగోలు కోసం మందమర్రిలోని ఐలవేణి లింగయ్య ఇంటికి వెళ్లి నిందితులతో బేరం కుదుర్చుకుంటున్న సమయంలో అటవీ అధికారులు దాడులు చేసి, నిందితులను పట్టుకోవడమే కాకుండా పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. అటవీ అధికారులు ఈ కేసును వెంటనే రామగుండం పోలీసులకు అప్పగించగా కమీషనర్ వి. సత్యనారాయణ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిఐ తన సిబ్బందితో రంగంలోకి దిగి 9 మంది నిందితులను అరెస్టు చేయడమే కాకుండా వారు అందించిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టిన పెద్దపులి కళేబరాన్ని గుర్తించారు. చర్మం తీయడంతో పాటు పులి గోళ్లు కూడా తీసుకున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఈమేరకు రామగుండం పోలీస్ కమీషనర్ సత్యనారాయణ శుక్రవారం రాత్రి శివ్వారం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈకేసులో 9 మంది నిందితులను అరెస్టు చేయగా ఇందులో జైపూర్ మండలం శివ్వారం గ్రామానికి చెందిన దండవేణి సాయిలు, తోకల మల్లయ్య, తోకల బుచ్చిరాజం, పెద్దపల్లి జిల్లా మంథెని గ్రామానికి చెందిన బీచపల్లి కొమురయ్య, మందమర్రికి చెందిన ఐలవేణి అంజయ్యతో పాటు ఐలవేణి సాగర్, పాలకుర్తి మండలం రామరావుపల్లికి చెందిన మేకల నర్సయ్య,పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని తిలక్‌నగర్‌కు చెందిన పూర్ణచందర్,మంచిర్యాలకు చెందిన నర్సింగోజుల రవిందర్‌లు ఉన్నారని పేర్కొన్నారు. 24 గంటల్లోనే కేసులు చేదించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులను అభినందించారు.వన్యప్రాణుల సంరక్షణ కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన మేరకు నిందితుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని, అవసరమైతే వారిపై పిడియాక్టు పెట్టడానికి రంగం సిద్దం చేశామన్నారు. ఇప్పటికే వేటగాళ్లకు కలప స్మగ్లర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని రామగుండం కమీషనర్ సత్యనారాయణ అన్నారు.

వెలిసిన మావోయిస్టుల పోస్టర్లు



మనతెలంగాణ /చర్ల : మండలంలోని ఆర్ కొత్తగుడెం, చర్ల, లక్ష్మి కాలని, తదితర గ్రామాల్లో గురువారం రాత్రి తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో మావోయిస్టుల పోస్టర్లు వెలిశాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల చేతిలో వంచనకి గురవుతున్న, పీడిత ప్రజలు, విద్యార్థులకు అండగా నిలిచిన మేధవులు, రచయితలపై అర్బన్ నక్సల్స్ గా ముద్రలు వేసి అక్రమ ఆరెస్టులు చేసి జైలో బంధిచడాన్ని తీవ్రంగా ఖండించాలని, వారి విడుదలకై పోరాడాలని దేశాన్ని ఫాసిజం బారి నుండి కాపాడుకోవాలని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక సమాధన్ వ్యూహాత్మక దాడులకి వ్యతిరేకంగా జనవరి 31 తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయ్యలని పోస్టరులలో పేర్కొన్నారు.

నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో జోరుగా పోలింగ్


మన తెలంగాణ /భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి జిల్లా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన వాజేడు, నూగూరు మండలాల్లో ముమ్మరంగా పోలింగ్ జరిగింది. ప్రజలు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని వరుసల్లో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ రెండు మండలాల్లో ఊహించిన దానికన్నా అధికంగా 88శాతం ఓట్లు పోలయ్యాయి. గత కొద్ది రోజులుగా ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్న మావోయిస్టులు ఎన్నికల బహిష్కరనకు పిలుపునిచ్చారు. దీనికి తోడు పలు చోట్ల హింసాత్మక సంఘటనలకు పాల్పడడంతో పాటు ఎన్నికలు బహిష్కరించాలని బ్యానర్లు కట్టి ప్రచారం నిర్వహించారు. ఎన్నికలను బహిష్కరించాలని కోరుతూ గురువారం నూగూరు మండలంలో మావోయిస్టులు జెసిబిని కాల్చివేసారు. ఇన్ని సంఘటనలు జరుగుతున్నప్పటికి ఆ ప్రాంత ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఎం.మధుసూదన్‌రెడ్డి (పిపిఎం)



ఎస్.చంద్రశేఖరరెడ్డి సంగారెడ్డి ఎస్‌పి



ఉదయ్‌కుమార్ అడిషనల్ ఎస్‌పి భద్రాద్రి కొత్తగూడెం



ఇ.రామచంద్రారెడ్డి రాచకొండ డిసిపి


వి. సూర్యచంద్రరావు డిఎస్‌పి


ఖాజామొయినుద్దీన్ ఎస్ఐ సివిల్ హైదరాబాద్


ముక్తార్ ఆలీ ఎస్ఐ సివిల్ వరంగల్


రాంప్రకాష్ 15వ బెటాలియన్ కమాండో


ఎస్ ఎం. పాషా ఎస్ఐ వరంగల్

రాష్ట్రానికి పోలీసు పతకాల పంట

- ఎసిబి ఎఎస్‌పి ఎం.మధుసూదన్‌రెడ్డికి పిపిఎం అవార్డు
- రాష్ట్రవ్యాప్తంగా పలు విభాగాల్లో 18 అవార్డులు

మన తెలంగాణ /హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసుశాఖ, జైళ్లశాఖకు చెందిన 18 మంది అధికారులు ప్రెసిడెంట్ పోలీసు మెడల్ (పిపిఎం), ఇండియన్ పోలీసు మెడల్(ఐపిఎం) అవార్డులకు ఎంపికయ్యారు. ముఖ్యంగా రాష్ట్ర ఎసిబి విభాగంలో అడిషనల్ ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న ఎం.మధుసూదన్‌రెడ్డి, మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బిమల్‌కుమార్‌లు పిపిఎం అవార్డుకు ఎంపికయ్యారు. పోలీసుశాఖలో 1989లో ఎస్ఐగా ఎంపికైన ఎం.మధుసూదన్‌రెడ్డి విధినిర్వహణలో తనదైన శైలితో ప్రదర్శిస్తూ పిపిఎం అవార్డు దక్కించుకున్నారు. ఇదిలావుండగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 74 మంది ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ సాధించగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారులు ఆ అవార్డును దక్కించుకున్నారు. దేశంలో 632 ఐపిఎం అవార్డులకు ఎంపిక కాగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 13 మంది పోలీసు అధికారులకు ఐపిఎం అవార్డులు దక్కాయి. రాష్ట్ర పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు అవార్డులు దక్కాయి. వీరిలో ఎస్.చంద్రశేఖరరెడ్డి సంగారెడ్డి ఎస్‌పి, ఎం నారాయణ సిఐడి ఎస్‌పి,ఎస్.ఫ్రాన్సీస్ అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్, వి. సూర్యచంద్రరావు డిఎస్‌పి, సిఐడి, బి.రాం ప్రకాశ్ 15 బెటాలియన్ కమాండర్, ఇ.రామచంద్రారెడ్డి రాచకొండ డిసిపి, డి.ఉదయ్‌కుమార్ అడిషనల్ ఎస్‌పి భద్రాద్రి కొత్తగూడెం, ఎస్.ప్రభాకర్‌రావు సిఐడి డిఎస్‌పి, ఖాజామోయినుద్దీన్ ఎస్ఐ (ఇంటెలిజెన్స్). సయ్యద్ మక్బుల్ పాషా (ఎస్ఐ, సిఎస్‌బి వరంగల్), మహ్మద్ ఆలీఖాన్ ముక్తర్(ఏఆర్ ఎస్ఐ, సివిల్ సెల్ ఇంటెలిజెన్స్), జి.ఎల్ నర్సింహరావు (హెచ్‌సి, ఎస్ఐబి ఇంటెలిజెన్స్), మహ్మద్ అజీజుద్దీన్ (పి.సి వరంగల్ ఎసిబి)లు ఐపిఎం అవార్డులకు ఎంపికయ్యారు. అలాగే రాష్ట్రంలోని వివిధ జైళ్లలో ఖైదీలలో పరివర్తన విషయంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన ముగ్గురు చీఫ్ వార్డర్‌లకు పరివర్తన సేవా పతకం దక్కింది. అదే విధంగా కేంద్ర సర్వీసుల్లో ఉంటూ తెలంగాణ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న మరికొందరికి ఉత్తమ సేవా అవార్డులు లభించాయి. బిఎస్ఎఫ్, సిబిఐ, ఎన్‌సిఆర్‌బి, ఎస్ఎస్‌బి, సిఆర్‌పిఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌పిజి, సిఐఎస్ఎఫ్, ఎన్‌హెచ్ఆర్‌సి, ఐటిబిపి, ఎన్ఐఎ, ఎన్ఎస్‌జి తదితర విభాగాలలో అత్యుత్తమ సేవలందించిన అధికారులకు అవార్డులు దక్కాయి.

రైల్వే ఆర్‌పిఎఫ్ విభాగం : దేశావ్యాప్తంగా రైల్వే ఆర్‌పిఎఫ్(రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్) విభాగంలో 15 మంది అధికారులకు ఇండియన్ పోలీస్ మెడల్‌కు అర్హులయ్యారు. అలాగే ఒకరు ప్రెసిడెంట్ పోలీసు మెడల్ కు ఎంపికయ్యారు. కాగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరికి ఇండయన్ పోలీస్ మెడల్ దక్కింది. సౌత్ సెంట్రల్ రైల్వేలో అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.మురళీ కృష్ణ, ఇన్స్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.వీరన్నలు ఇండియన్ పోలీస్ మోడల్ సాధించారు.

జైళ్లశాఖ : దేశ వ్యాప్తంగా వివిధ జైళ్లలో ఖైదీలలో పరివర్తనకు శ్రమించిన ఉత్తమ ఉద్యోగులకు పరివర్తనా సేవా పతకానికి 37 మందిని ఎంపికచేశారు. అందులో తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్, నల్గొండ, చర్లపల్లిలో చీఫ్ హెడ్‌వార్డర్‌గా పనిచేస్తున్న ముగ్గురికి పరివర్తన సేవా పతకం అవార్డులు దక్కాయి. వీరిలో మహబూబాబాద్ సబ్‌జైల్‌లోని చీఫ్ హెడ్‌వార్డర్ ఎస్.వెంకటేశ్వర్లు, నల్గొండ జిల్లా జైలులో పనిచేస్తున్న జి.ముఖ్తేశ్వర్, చర్లపల్లి సెంట్రల్ జైల్‌లో చీఫ్ హెడ్‌వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ఖాజా పాషాలు సేవా పతకం అవార్డులకు ఎంపికయ్యారు.

ఈమధ్య కాలంలో కొన్ని సినిమాల్లో నేను సెకండ్ హీరోగా నటిస్తున్న సమయంలో నా హృదయం బద్దలయినట్లుగా అనిపించేది. అప్పుడు మౌనంగా ఆ ఆవేదనను అనుభవించేవాడిని. సినిమా ఇండస్ట్రీలో ఎలా రాణిస్తున్నామనేది చూస్తారే తప్ప ఎంత కష్టపడి వచ్చాడు, ఎవరి వారసుడు అనే విషయాలను పట్టించుకోరు.

-బాలీవుడ్ హీరో అభిషేక్ బచ్చన్

సినిమా

ఆ యంగ్ డైరెక్టర్‌తో బన్నీ సినిమా?


అల్లు అర్జున్

అల్లు అర్జున్ సినిమా 'నా పేరు సూర్య' విడుదలై దాదాపు ఎనిమిది నెలలు అవుతున్నా ఇంకా తన కొత్త సినిమాను ప్రారంభించలేదు ఈ స్టైలిష్ స్టార్. ఇంత గ్యాప్ తీసుకొని మరీ త్రివిక్రమ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి కారణం బన్నీ కథల ఎంపికలో మరింత జాగ్రత్త వహించడమే. ఈమధ్య అతను చేసిన సినిమాలు ప్రేక్షకులను సరిగా మెప్పించలేకపోవడంతో అల్లు అర్జున్ తన భవిష్యత్తు ప్రాజెక్టుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటున్నారు. త్రివిక్రమ్ సినిమా ఫైనల్ అయినా అతను మాత్రం కొత్త కథలు వింటూనే ఉన్నారని తెలిసింది. ఇటీవల యువ దర్శకుడు సుజిత్ ఈ స్టైలిష్ స్టార్‌కు ఒక ఆసక్తికరమైన కథను వినిపించాడట. ఈ కథ నచ్చడంతో దానిని పూర్తిస్థాయి స్క్రిప్ట్‌గా తీర్చిదిద్దమని బన్నీ ఈ యువ దర్శకుడికి సూచించారట. సుజిత్ ప్రస్తుతం ప్రభాస్‌తో 'సాహో' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ వారు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. యువి క్రియేషన్స్ వారే సుజిత్, అల్లు అర్జున్ సినిమాను సెట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారట. బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇస్తే గీతా ఆర్ట్స్‌తో కలిసి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారట. ఇక త్రివిక్రమ్‌అల్లు అర్జున్ సినిమా ప్రస్తుతం జోరుగా ప్రీ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. ఈ సినిమా పూర్తయ్యే లోపు సుజిత్ కూడా 'సాహో' సినిమాను పూర్తిచేస్తాడు. అంతా సవ్యంగా జరిగితే 'సాహో' తర్వాత సుజిత్‌బన్నీ సినిమా పట్టాలెక్కుతుంది.


దిల్‌రాజు, తమన్నా, అనిల్ రావిపూడి

100 కోట్ల క్లబ్‌లో 'ఎఫ్ 2'

సీనియర్ స్టార్ వెంకటేష్, యంగ్‌స్టార్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎఫ్ 2'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ చిత్రం రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "సంక్రాంతి పండుగ కానుకగా విడుదలైన 'ఎఫ్ 2' చిత్రానికి ప్రేక్షకులు ఘన విజయాన్ని అందించారు. రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతున్న మా చిత్రం 100 కోట్ల గ్రాస్ మైలురాయిని అందుకోవడం ఆనందంగా ఉంది. 13 రోజుల్లోనే ఈ ఘనత సాధించింది 'ఎఫ్ 2' చిత్రం. షేర్‌గా లెక్కిస్తే ఇప్పటివరకు ఈ చిత్రానికి 68 కోట్లు వచ్చాయి. ఇక 100 కోట్ల గ్రాస్‌ను దాటిన సందర్భంగా సినిమా ఆడుతున్న థియేటర్లకు ప్రత్యేక షీల్డులను అందజేస్తాం"అని అన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ "సంక్రాంతి సీజన్‌లో విడుదలైన 'ఎఫ్ 2' చిత్రం ప్రేక్షకుల ఆదరాభిమానాలతో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. 100 కోట్ల గ్రాస్‌ను దాటిన మా చిత్రం ఇంకా మంచి కలెక్షన్లతో థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా సినిమాలో అదనంగా ఐదు కామెడీ సీన్లను జత చేస్తున్నాం"అని తెలిపారు. తమన్నా మాట్లాడుతూ "నా కెరీర్‌లో 'ఎఫ్ 2' స్పెషల్ మూవీగా నిలిచింది. ఈ ఫ్యామిలీ, కామెడీ ఎంటర్‌టైనర్‌కు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నందుకు సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.


నయనతార

సానుకూలంగా స్పందించింది

లేడీ సూపర్‌స్టార్ నయనతార సినిమా ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటుందని సినీ ఇండస్ట్రీలో ఎప్పటినుండో టాక్ ఉంది. ముఖ్యంగా ఆమె తెలుగు సినిమాల ప్రమోషన్స్ కార్యక్రమాలను అస్సలు పట్టించుకోదు. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో కలిసి నయనతార 'సైరా' చిత్రంలో నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం దసరా పండుగ కానుకగా విడుదల కానుంది. అయితే ఈ చిత్ర నిర్మాత రామ్‌చరణ్ ఇటీవల నయనతారతో మాట్లాడి 'సైరా' ప్రమోషన్స్ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారట. ఇందుకు నయన్ మొదట ఒప్పుకోలేదట. కానీ చరణ్ అభ్యర్థించే సరికి ఆమె సానుకూలంగా స్పందించిందని తెలిసింది. మరి చరణ్ కోరికను మన్నించి నయనతార 'సైరా' ప్రమోషన్స్‌కు వస్తుందో లేదో చూడాలి. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా రూపుదిద్దుకుంటోంది.

అమిత్ త్రివేది సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, తమన్నా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.


కియారా అద్వానీ

పూర్తిగా వ్యతిరేకంగా ఉండే పాత్రలో...

టాలీవుడ్ సూపర్ హిట్ మూవీ 'అర్జున్ రెడ్డి' చిత్రాన్ని బాలీవుడ్‌లో 'కబీర్ సింగ్' టైటిల్‌తో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. విజయ్ దేవరకొండ పోషించిన అర్జున్ రెడ్డి పాత్రను బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పోషిస్తుండగా షాలిని పాండే పోషించిన ప్రీతి పాత్రను హాట్ బ్యూటీ కియారా అద్వానీ పోషిస్తోంది. తెలుగులో 'అర్జున్ రెడ్డి'ని తెరకెక్కించిన దర్శకుడు సందీప్ వంగ హిందీ రీమేక్‌ను కూడా తెరకెక్కిస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇప్పటివరకు అల్ట్రా మోడ్రన్ లుక్‌లో చాలా హాట్‌గా కనిపించి మురిపించిన కియారా తొలిసారి ఈ చిత్రం కోసం చాలా కామ్‌గోయింగ్ క్యారెక్టర్ చేస్తోంది. 'అర్జున్‌రెడ్డి'లోని ప్రీతి పాత్ర చాలా సైలెంట్‌గా కనిపిస్తుంది. అదేవిధంగా 'కబీర్ సింగ్'లో కూడా ఈ పాత్రను తెరకెక్కిస్తున్నారట. ఈ విషయం గురించి హీరోయిన్ కియారా అద్వానీ మాట్లాడుతూ "నిజ జీవితంలో నేను ఎప్పుడూ అల్లరి చేస్తూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటాను. కానీ ఈ సినిమాలో మాత్రం పూర్తిగా వ్యతిరేకంగా ఉండే పాత్రను చేస్తున్నా. ప్రీతి పాత్ర చాలా సైలెంట్‌గా ఉంటుంది. నాలాంటి అమ్మాయి ఇటువంటి పాత్రలో నటించడం కాస్త ఇబ్బందే. అయినా కూడా దర్శకుడు నాతో ఈ పాత్రను చక్కగా చేయిస్తున్నాడు"అని పేర్కొంది.


తేజ, కాజల్, శ్రీనివాస్

నేడే 'సీత' ఫస్ట్‌లుక్

తేజ దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'సీత'. వీరిద్దరు తొలిసారి కలిసి పనిచేస్తున్న ఈ చిత్రం టైటిల్ లోగో, ఫస్ట్‌లుక్‌ను శనివారం ఉదయం 11 గంటలకు విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్‌కు జోడీగా కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరు కలిసి నటిస్తున్న రెండో చిత్రమిది. విభిన్న కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. కొద్ది రోజుల్లోనే సినిమా చిత్రీకరణ పూర్తికానుంది. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని సమకూరుస్తున్న ఈ చిత్రానికి సిర్షా రే సినిమాటోగ్రాఫర్‌గా చేస్తున్నారు. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.


'మిస్టర్ మజ్ను' సక్సెస్ సెలబ్రేషన్స్‌లో భాగంగా కేక్ కట్ చేస్తున్న నిర్మాత బివిఎస్‌ఎన్ ప్రసాద్. చిత్రంలో హీరో అఖిల్, హీరోయిన్ నిధి అగర్వాల్, దర్శకుడు వెంకీ అట్లూరి, సంగీత దర్శకుడు థమన్.

సూపర్‌స్టార్ దంపతులకు 'తెలుగు సినిమా గ్రంథం' అంకితం

తెలుగు సినిమా లెజెండ్స్ దాసరి నారాయణరావు, డి.రామానాయుడు, డి.వి.ఎస్.రాజు సలహాదారులుగా, ప్రోత్సాహకులుగా ఏర్పడిన 'ఫిలిం అనలిటికల్ అండ్ అసోసియేషన్' (ఫాస్), డా.కె.ధర్మారావు రచయితగా వెలువరించిన '86 సంవత్సరాల తెలుగు సినిమా' గ్రంథాన్ని సూపర్‌స్టార్ కృష్ణ, శ్రీమతి విజయనిర్మల దంపతులకు అంకితం చేశారు. హైదరాబాద్‌లోని కృష్ణ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శకులు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ "తెలుగు సినిమాకు సంబంధించిన విశిష్ట సమాచారంతో, చక్కటి ఫొటోలతో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇది ఖచ్చితంగా తెలుగు చిత్ర పరిశ్రమకు ఒక ఎన్‌సైక్లోపీడియాగా ఉపయోగపడుతుంది"అని అన్నారు. ఇటువంటి గొప్ప గ్రంథాన్ని తమకు అంకితం చేసినందుకు కృష్ణ, విజయనిర్మలలు రచయితను అభినందించారు. నరేష్ మాట్లాడుతూ తెలుగు సినిమా 86 సంవత్సరాల చరిత్రను ధర్మారావు చక్కగా విశదీకరించి ఈ గ్రంథాన్ని రాశారని తెలిపారు. రచయిత ధర్మారావు మాట్లాడుతూ 86 వసంతాల తెలుగు సినిమాను ఒక పుస్తకంగా తీసుకురావడం జరిగిందని చెప్పారు.


'తెలుగు సినిమా గ్రంథం'ను సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మలకు అంకితం చేస్తున్న డా.కె.ధర్మారావు. చిత్రంలో రేలంగి నరసింహారావు, నరేష్ తదితరులు.

ఈ కార్యక్రమంలో నటి రాధ ప్రశాంతి, వంశీ రామరాజు, ప్రసాదరావు, కొదాల బసవరావు తదితరులు పాల్గొన్నారు.

నీ జాతి ఏంటి? నీ ఇంటి పేరు ఏంటి?



సల్మాన్ ఖాన్

బ్లాక్‌బస్టర్ మూవీ 'టైగర్ జిందా హై' ఫేం అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో సల్మాన్‌ఖాన్ నటిస్తున్న చిత్రం 'భారత్'. ఈ ఏడాది రంజాన్ పండుగ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్ విడుదలైంది. ఈ టీజర్‌లో సల్మాన్ తన డైలాగ్స్‌తో ఆకట్టుకుంటున్నారు. "చాలా మంది నన్ను అడుగుతుంటారు. నీ జాతి ఏంటి? నీ ఇంటి పేరు ఏంటి? నీది ఏ ధర్మం ఏది? అని... అలాంటి వాళ్లందరికీ నేను చిన్న స్మైల్ ఇచ్చి... ఇలా అంటాను. మా నాన్న నాకు 'భారత్' అని దేశం పేరు పెట్టారు. అలాంటి గొప్ప పేరు ముందు జాతి, ధర్మం, ఇంటి పేరు వంటివి తగిలించి నా పేరుకు, ఈ దేశానికి ఉన్న గౌరవాన్ని తగ్గించలేను" అంటూ అదిరిపోయే డైలాగ్స్ చెప్పారు సల్మాన్. ఇందులో ఈ బాలీవుడ్ స్టార్ ఓ నేవీ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. అతని లుక్ కూడా ఆకట్టుకుంటోంది. ఈ టీజర్‌లో సల్మాన్ భాయ్ బైక్ రైడింగ్‌తో అదరగొట్టేశారు. భాయ్‌లోని రకరకాల కోణాల్ని ఈ టీజర్ ఆవిష్కరించింది. 'టైగర్ జిందా హై' వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన అబ్బాస్ అలీ జఫర్ ఈసారి కూడా అలాంటి ఓ దేశభక్తి చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ఈ టీజర్ చూస్తే అర్థమవుతోంది. అయితే ఈ చిత్రం కూడా ఆ స్థాయి విజయాన్ని అందుకుంటుందా, లేదా అన్నది చూడాల్సిందే. ఈ చిత్రంలో అందాల భామలు కత్రినాకైఫ్, దిశా పటానీ, సోనాలి కులకర్ణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హాట్ బ్యూటీ నోరా ఫతేహి ఓ గెస్ట్ రోల్ చేస్తోంది. రీల్ లైఫ్ ప్రొడక్షన్స్, ఎస్‌కెఎఫ్ ప్రొడక్షన్స్‌తో కలిసి టీ సిరీస్ భూషణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.


నీహారిక, రాహుల్ విజయ్

ఫీల్‌గుడ్‌గా... రిఫ్రెషింగ్‌గా

నిహారిక కొణిదెల, రాహుల్ విజయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న 'సూర్యకాంతం' చిత్రం మార్చి 29న విడుదల కానుంది. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ప్రణీత్ బ్రమండపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. వరుణ్‌తేజ్ చేతుల మీదుగా ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన రాగా... శుక్రవారం విడుదలైన టీజర్ ఫీల్‌గుడ్‌గా, రిఫ్రెషింగ్‌గా ఉందంటూ ప్రశంసలు వస్తున్నాయి. శివాజీ రాజా, సుహాసిని, సత్య ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మార్క్ కె.రాబిన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. అమెరికాలో ఫిలిం డిస్ట్రిబ్యూషన్‌లో అగ్రగామి సంస్థ అయిన నిర్వాణ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వరుణ్‌తేజ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: హరిజ్ ప్రసాద్, ఎడిటర్: రవితేజ గిరిజాల, సాహిత్యం: కృష్ణకాంత్, ఆర్ట్: అవినాష్ కొల్ల.

ట్రెడిషనల్ లుక్‌లో కవ్విస్తోంది


రష్మిక మందన

తెలుగులో తన తొలి సినిమా 'ఛలో' హిట్‌తో యూత్‌లో మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న యంగ్ బ్యూటీ రష్మిక మందన్న. ఆతర్వాత విజయ్ దేవరకొండ చిత్రం 'గీత గోవిందం'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. తెలుగులో చాలా తక్కువ సమయంలో ఎక్కువ పాపులారిటీని సంపాదించిన నవతరం నాయికగా రష్మిక మందన్న పేరు మార్మోగిపోతోంది. ఈ భామ ప్రస్తుతం సోషల్ మీడియాలో తన ఫొటోలతో సందడి చేస్తోంది. తాజాగా ట్రెడిషనల్ లుక్‌లో కవ్విస్తున్న ఈ బ్యూటీ ఫొటో సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అవుతోంది. ఎల్లో కలర్ జాకెట్, గ్రీన్ కలర్ లెహంగాపై తెల్లటి ఓణీ ధరించిన రష్మిక చిరునవ్వులు చిందిస్తూ మైమరపిస్తోంది. ఇక ఈ బ్యూటీ కెరీర్ గ్రాఫ్ పరిశీలిస్తే ఈ ఏడాది వరుసగా నాలుగు సినిమాల్లో ఆమె నటిస్తోంది. 'గీత గోవిందం' తర్వాత హీరో విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్న 'డియర్ కామ్రేడ్' సినిమా షూటింగ్ ఇప్పటికే ఎక్కువ శాతం పూర్తయింది. నితిన్‌కు జోడీగా ఆమె నటించే 'భీష్మ' త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. దీంతో పాటు కన్నడ సినిమాలు పొగరు, యజమాన చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి




విశాఖపట్నంలో అకౌస్టిక్స్ టెస్టింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సిఎండి ఉదయభాస్కర్

అకౌస్టిక్ టాంక్ టెస్ట్ కేంద్రం ప్రారంభం

మన తెలంగాణ / హైదరాబాద్ : భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ విశాఖపట్నంలో అకౌస్టిక్ టాంక్ టెస్ట్ కేంద్రాన్ని ఆ సంస్థ సిఎండి ఉదయభాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. సముద్రగర్భంలో వాడే టోర్పెడోలు, మైన్లు, డెకాయ్‌లు, సోసోబయో తదితర ఆయుధాలకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని, దేశంలోనే ఉత్తమమైన సేవలందించేదిగా తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు. మన నావికా అవసరాలకు సముద్రగర్భంలో వాడే ఆయుధాలకు విశాఖపట్నం కేంద్రంగా ఉందని, అలాంటివాటిని పరీక్షించడానికి ఇప్పుడు ప్రారంభించిన కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఒక్కో సముద్రం లోపలి పరిస్థితులు, వాతావరణానికి అనుగుణంగా ఆయుధాలను తయారుచేయాల్సి ఉంటుందని, వాటిని అధ్యయనం చేసి తయారుచేసిన తర్వాత పరీక్షించడానికి నూతన కేంద్రం దోహదపడుతుందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా భారత ఆయుధ శక్తి మరింత ఇనుమడించినట్లయిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ నంద గోపన్, బిడిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ ప్రేమనాయగం, టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌పి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిబిఐ సాహసోపేత ధోరణిని వదులుకోవాలి




న్యూఢిల్లీ : వీడియోకాన్ రుణం కేసులో సిబిఐ తీరుపై కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ స్పందించారు. దర్యాప్తు సంస్థ సిబిఐ సాహసోపేత దోరణిని వదులుకోవాలని, బుల్ కంటిపైనే దృష్టిని కేంద్రీకరించాలని జైట్లీ ట్విట్టర్ ద్వారా వ్యాఖ్యలు చేశారు. చందా కొచ్చర్‌పై కేసు నమోదు చేసిన తర్వాత బ్యాంకింగ్ దిగ్గజం కెవి కామత్‌ను ప్రశ్నించనున్నారనే వార్తల నేపథ్యంలో జైట్లీ ఈవిధంగా స్పందించడం గమనార్హం. ప్రస్తుతం జైట్లీ క్యాన్సర్ చికిత్స నిమిత్తం అమెరికాలో ఉన్న విషయం తెలిసిందే. అలాగే దివాలా చట్టంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల జైట్లీ హర్షం వ్యక్తం చేశారు.



శుక్రవారం ముంబైలో బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ బయట బుల్ విగ్రహంతో ఫొటోలకు పోజు ఇస్తున్న మారిషస్ ప్రధానమంత్రి ప్రవింద్ జుగ్నౌత్‌తో(కుడి) పాటు బిఎస్‌ఇ చైర్మన్ ఎస్.రవి, బిఎస్‌ఇ ఎండి, సిఇఒ ఆశిష్ చౌహాన్

ఎఎం నాయక్‌కు పద్మవిభూషణ్



- ఎల్ అండ్ టి అధినేతకు అత్యుత్తమ పురస్కారం
- ఎండిహెచ్ వ్యవస్థాపకుడు ఎండి గులాటికి పద్మభూషణ్
- అడాబ్ సిఇఒ శంతను నారాయణ్‌కు పద్మశ్రీ





న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఈ పురస్కారాల్లో దిగ్గజ వ్యాపారవేత్త, ఎల్ అండ్ టి గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అనిల్ మణిబాయ్ నాయక్, ఎండిహెచ్ వ్యవస్థాపకుడు మహాశయ్ ధరమ్‌పాల్ గులాటి, భారత సంతతికి చెందిన అమెరికా వ్యాపారవేత్త, అడాబ్ సిఇఒ శంతను నారాయణ్, ఇంకా అమెరికాకు చెందిన జాన్ చాంబర్స్ ఉన్నారు. వీరిలో ఎల్ అండ్ టి గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అనిల్ మణిబాయ్ నాయక్‌కు అత్యుత్తమ 'పద్మ విభూషణ్' అవార్డు వరించింది. అలాగే 'పద్మ భూషణ్' అవార్డు వరించిన వ్యాపార దిగ్గజాల్లో మసాలా బ్రాండ్ ఎండిహెచ్ వ్యవస్థాపకుడు మహాశయ్ ధరమ్‌పాల్ గులాటి, ఇంకా అమెరికాకు చెందిన జాన్ చాంబర్స్ ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన అడాబ్ సిఇఒ శంతను నారాయణ్‌ను 'పద్మశ్రీ' అవార్డు వరించింది. కాగా వివిధ రంగాల్లో విశిష్ట సేవ లందించిన వారికి కేంద్రం ఈ అవార్డులను శుక్రవారం సాయంత్రం ప్రకటించడం జరిగింది. ఇందులో భాగంగా నలుగురికి పద్మ విభూషణ్, 14 పద్మ భూషణ్, 94 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న వరించింది. ఆయనతో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు నానాజీ దేశ్‌ముఖ్, ప్రముఖ సంగీత విద్వాంసుడు భూపేన్ హజారికాలకు మరణానంతరం భారతరత్న పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. పద్మ విభూషణ్ పొందిన వారిలో ఇస్మాయిల్ ఒమర్ గులే, అనిల్‌కుమార్ మణిబాయ్, బల్వంత్ మెరేశ్వర్ పురందరే, టీజెన్ బాయ్‌లు ఉన్నారు. మలయాళ నటుడు మోహన్ లాల్‌ను, ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణ్‌లను పద్మ భూషణ్ వరించింది.

నిరాశపర్చిన మారుతీ

క్యూ3లో 17 శాతం క్షీణించిన లాభం



న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా(ఎంఎస్‌ఐఎల్) మూడో త్రైమాసిక ఫలితాల్లో నిరాశపర్చింది. కంపెనీ నికర లాభం 17.26 శాతం క్షీణించింది. సంస్థ లాభం రూ.1,489 కోట్లుగా ఉంది. గతేడాది సంస్థ లాభం రూ.1800 కోట్లుగా ఉంది. విశ్లేషకుల అంచనాలను కంపెనీ అందుకోలేకపోయింది. ఆదాయం మాత్రం చాలా నామామాత్రంగా 2 శాతమే పెరిగి రూ.19,668 కోట్లను నమోదు చేసింది. నిర్వహణ లాభం(ఇబిటా) 36 శాతం పడిపోయి రూ. 1930 కోట్లకు పరిమితమైంది. మార్జిన్లు 15.7 శాతం నుంచి 9.8 శాతానికి బలహీనపడ్డాయి. కమోడిటీల ధరలు పెరగడం, ఫారెక్స్ నష్టాలు, మార్కెటింగ్ వ్యయాలు వంటి అంశాలు తమ లాభాలను దెబ్బతీసినట్లు కంపెనీ మార్కెట్ సమాచారంలో వెల్లడించింది. ఈ ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు దాదాపు 8 శాతం కుప్పకూలి 52 వారాల కనిష్టాన్ని నమోదు చేసింది.

ఎల్ అండ్ టి అదుర్స్

క్యూ3లో సంస్థ లాభం 37 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : ఇంజినీరింగ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి) శుక్రవారం డిసెంబర్ ముగింపు నాటి మూడో త్రైమాసిక ఫలితాల్లో నికర లాభం 37 శాతం వృద్ధిని సాధించింది. సంస్థ నికర లాభం రూ.2,042 కోట్లు నమోదు చేయగా, గతేడాది ఇదే సమయంలో లాభం రూ.1,490 కోట్లుగా ఉంది. కంపెనీ ఆదాయం 24 శాతం పెరిగింది. ఆదాయం గతేడాదిలో రూ.28,747 కోట్లు ఉండగా, ప్రస్తుతం ఇది రూ.35,709 కోట్లకు పెరిగింది. సేవల వ్యాపారాల్లో మంచి పనితీరుతో పాటు ప్రాజెక్టు వ్యాపారాల్లో పటిష్టమైన వద్ధి వెరసి ఈ త్రైమాసికంలో రెవెన్యూనూ పెంచేందుకు దోహదం చేసిందని కంపెనీ తెలిపింది. కంపెనీ ఫలితాల నేపథ్యంలో ఎల్ అండ్ టి షేరు విలువ అర శాతం పతనమై రూ.1,288 వద్ద ముగిసింది.

నీరవ్ రూ.100 కోట్ల బంగ్లా కూల్చివేత



రాయ్‌గడ్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వేల కోట్ల మోసం కేసులో నిందితుడు నీరవ్ మోడీకి చెందిన రూ.100 కోట్ల బంగ్లాను మహారాష్ట్ర అధికారులు కూల్చివేశారు. సముద్ర తీరంలో ఉండే ఈ బంగ్లాను అక్రమమైనదని అధికారులు గుర్తించారు. నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.14 వేల కోట్ల రుణాన్ని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే. నీరవ్‌కు చెందిన మహారాష్ట్రలోని ఆలీబాగ్ సముద్రతీరంలో నిర్మించిన నివాస భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూల్చివేశారు. రూ.100 కోట్ల వ్యయంతో 33 వేల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మితమైంది. ఈ విలాస భవనం అనేక హైప్రొఫైల్ విందులకు వేదికగా నిలిచింది. ఈ భవనాన్ని చట్ట నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, తీర ప్రాంత నిర్మాణ నిబంధనలను అతిక్రమించారని రాయ్‌గఢ్ కలెక్టర్ సూర్యవంశి చెప్పారు. ముంబై నగరానికి 90 కి.మీ దూరంలోని కిహిం బీచ్ సమీపంలో నిర్మితమైన ఈ భవనంతో పాటు మరో 58 కట్టడాలను అక్రమ నిర్మాణాలుగా అధికారులు గుర్తించి చర్యలు చేపట్టారు.

'ఆటోమొబైల్, మీడియా' ఎఫెక్ట్

169 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్



ముంబై: మళ్లీ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆఖరి సమయంలో డీలాపడ్డాయి. మీడియా, ఆటోమొబైల్ రంగ షేర్లలో అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ప్రారంభం నుంచి లాభాలతో సాగుతున్న సూచీలు ఆఖరి సమయంలో చతికిలబడ్డాయి. కొనుగోళ్ల అండతో ఈ ఉదయం మార్కెట్లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 250 పాయింట్లకు పైగా, నిఫ్టీ 10,900 పాయింట్ల వద్ద ట్రేడ్ అయ్యాయి. యస్ బ్యాంక్, రిలయన్స్ లాంటి షేర్లు రాణించడంతో తొలి సెషన్‌లో సూచీలు జోరుగా సాగాయి. అయితే ఆ తర్వాత మారుతి సుజుకీ, జి ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీ వంటి భారీ షేర్ల కౌంటర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో అప్పటిదాకా ఉన్న జోరుమీద ఉన్న సూచీలు చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 169 పాయింట్లు నష్టపోయి 36,025 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 69 పాయింట్ల నష్టంతో 10,780 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.19గా కొనసాగుతోంది. ఎన్‌ఎస్‌ఇలో భారతీ ఇన్‌ఫ్రాటెల్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, యస్ బ్యాంక్, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పంగా లాభపడ్డాయి. జిఎంటర్‌టైన్‌మెంట్ షేరు భారీ స్థాయిలో 31 శాతం నష్టపోయింది. మారుతి సుజుకీ షేర్లు కూడా 8 శాతం నష్టపోయాయి. ఇతర హీరోమోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు కూడా పతనమయ్యాయి.

భారీగా పతనమైన జి గ్రూప్ షేర్లు

జి ఎంటర్‌టైన్మెంట్ షేరు స్టాక్‌మార్కెట్లో దారుణంగా పతనమైంది. దీని ప్రమోటర్ సంస్థ ఎస్సెస్ గ్రూప్.. డీమానిటైజేషన్ తర్వాత మనీ లాండరింగ్ పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో జి షేర్లు అతలాకుతలమయ్యాయి. శుక్రవారం ఎస్సెల్ గ్రూప్‌నకు చెందిన జి ఎంటర్‌టైన్మెంట్, జి మీడియా, డిష్ టీవీ షేర్లు భారీగా నష్టపోయాయి. దీంతో జీ గ్రూప్ దాదాపు రూ.14 వేల కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది. ఈ వార్తల నేపథ్యంలో జీ ఎంటర్‌టైన్మెంట్ షేరు ఎన్‌ఎస్‌ఇలో 33.50 శాతం క్షీణించి రూ.288.30 కనిష్టాన్ని చేరుకుంది. చివరకు 31శాతం(రూ.134) నష్టపోయి రూ.299.70ల వద్ద ముగిసింది. ఇదే గ్రూప్‌నకు చెందిన డిష్ టివి 38 శాతం పతనమై రూ. 20.70 వద్ద ఇంట్రాడే కనిష్టస్థాయిని తాకింది. చివరకు 33 శాతం తగ్గుదలతో రూ. 22.50 వద్ద ముగిసింది. జీ మీడియా కార్పోరేషన్ 12శాతం నష్టపోయి రూ. 21.30 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని చేరింది.ఆఖరికి 11 శాతం నష్టపోయి రూ.21.45 వద్ద ముగిసింది. కంపెనీపై వచ్చిన ఆరోపణలపై ఎస్‌ఎఫ్‌ఐఒ దర్యాప్తు చేపట్టిందని వార్తలు వెలువడ‌డంతో జీ షేర్లలో గుబులు మొదలైంది.

వచ్చే సంవత్సరాల్లో భారత్ వృద్ధి 7.5 శాతం

పిఎం సలహా మండలి

న్యూఢిల్లీ : వచ్చే సంవత్సరాల్లో భారత్ ఆర్థిక వృద్ధి 7 శాతం నుంచి 7.5 శాతం వరకు ఉండనుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అంచనా వేసింది. సంస్కరణల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపితే వృద్ధి రేటు సులభంగా 1 శాతం పెరుగుందని మండలి భావించింది. శుక్రవారం పిఎం సలహా మండలి సమావేశమై పలు అంశాలపై చర్చించింది. అయితే ఇటీవల కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్‌ఒ) 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను 7.2 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. ఆర్థిక స్థిరీకరణ లక్ష్యం నుంచి తప్పుకునే పరిస్థితి ఉండబోదని, సామాజిక రంగాల జోక్యంపై ఉద్ఘాటించాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు.

బిఎస్‌ఎన్‌ఎల్ రూ.269 ఆఫర్



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికామ్ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త రూ.269 రీచార్జ్‌ను ప్రి–పెయిడ్ కస్టమర్ల కోసం ప్రవేశపెట్టింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బిఎస్‌ఎన్‌ఎల్ తమ వినియోగదారుల కోసం ఈ స్పెషల్ టారిఫ్ ఓచర్(ఎస్‌టివి)ని ప్రకటించింది. ఎస్‌టివి రూ.269 ఆఫర్ జనవరి 26 నుంచి 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్యాక్‌లో ఏ నెట్‌వర్క్‌కు అయినా 2600 నిమిషాల టాక్‌టైం, 260 మెసేజ్‌లు, 2.6 జిబి డేటా వంటి ప్రయోజనాలను అందిస్తోంది. ప్లాన్ వాలిడిటీ 26 రోజులు ఉంటుంది. 70వ రిపబ్లిక్ డే సందర్భంగా బిఎస్‌ఎన్‌ఎల్ ఛైర్మన్, ఎండి అనుపమ శ్రీవాస్తవ వినియోగదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విమాన సంస్థల రిపబ్లిక్ డే ఆఫర్లు



టికెట్లపై 50 శాతం డిస్కౌంట్ అందిస్తున్న జెట్ ఎయిర్‌వేస్

న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే సందర్భంగా విమాన సంస్థలు టికెట్ల బుకింగ్‌పై వినియోగదారులకు బంపర్ ఆఫర్లను ప్రకటించాయి. ప్రైవేటు విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ రిపబ్లిక్ డే సందర్భంగా సరికొత్త ఆఫర్లను ప్రకటించింది. నరేష్ గోయల్ నేతృత్వంలోని ఈ సంస్థ దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్ల బుకింగ్‌పై 50 శాతం డిస్కౌంట్‌ను అందిస్తోంది. 'జెట్ ఎయిర్‌వేస్ రిపబ్లిక్ డే 2019' ఆఫర్ కింద వినియోగదారులకు ఎంపిక చేసిన విమానాల్లో ప్రీమియర్, ఎకానమీలో 50 శాతం తగ్గింపును ఇస్తోంది. ఈ ఆఫర్ కోసం జనవరి 24 నుంచి 30వ తేదీలోగా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

గోఎయిర్ కూడా తగ్గింపు

మరో సంస్థ గోఎయిర్ కూడా తగ్గింపు ధరల్లో విమాన టికెట్లను ఆఫర్ చేస్తోంది. దేశంలోని 26 ప్రాంతాలకు రూ.999లకే టికెట్‌ను ఆఫర్ చేస్తోంది. జనవరి 26తో ఈ ఆఫర్ ముగియనుంది. ఆఫర్ కింద బుక్ చేసుకున్న వారు ఫిబ్రవరి 9 నుంచి సెప్టెంబర్ 30 మధ్య ప్రయాణించవచ్చు. హైదరాబాద్, కోల్‌కతా, గోవా, బెంగళూరు, భువనేశ్వర్, బెంగళూరు, ముంబై, కొచ్చి, ఢిల్లీ, గౌహతి, గోవా, బాగ్డోగ్రా, ఛండీగఢ్, రాంచీ, జైపూర్, లక్నో, చెన్నై, నాగపూర్, పుణె, పాట్నా, శ్రీనగర్ రూట్లలో గో ఎయిర్ టికెట్లు తక్కువ ధరకే లభించనున్నాయి. ఈ సంస్థ ప్రకటించిన ఆఫర్లలో కనిష్టంగా రూ.999కే విమాన ప్రయాణం చేయవచ్చు.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,025.54	–169.56	(–0.47%)
నిఫ్టీ	10,780.55	–69.25	(–0.64%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.99
యూరో	80.36
బ్రిటిష్ పౌండ్	93.14
ఆస్ట్రేలియన్ డాలర్	50.44
కెనెడియన్ డాలర్	53.27
సింగపూర్ డాలర్	52.23
స్విస్ ఫ్రాంక్	71.32
చైనీస్ యువాన్	10.48
మలేషియన్ రింగిట్	17.16
న్యూజిలాండ్ డాలర్	48.06
హాంకాంగ్ డాలర్	9.05
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	233.95
సౌతాఫ్రికన్ రాండ్	5.18

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30920	33069.52	0.1%
ముంబై	31720	33925.13	0%
ఢిల్లీ	31550	33743.32	0%
కోల్‌కతా	31850	34064.17	0.03%
కేరళ	30100	32192.51	0%
బెంగళూరు	30320	32427.81	0.07%
హైదరాబాద్	30920	33069.52	0.1%
గల్ఫ్	136.28	145.75	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42242.00
ముంబై	₹ 42242.00
ఢిల్లీ	₹ 42242.00
కోల్‌కతా	₹ 42242.00
హైదరాబాద్	₹ 42242.00



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
భారతీ ఇన్‌ఫ్రాటెల్	282.45	264.10	279.75	263.00	16.75	6.37
హెచ్‌సిఎల్	975.70	946.10	969.40	946.45	22.95	2.42
యస్ బ్యాంక్	245.00	218.00	219.60	215.40	4.20	1.95
భారతీ ఎయిర్‌టెల్	312.00	302.00	307.50	301.65	5.85	1.94
సిప్లా	508.60	501.35	507.65	500.70	6.95	1.39
టిసిఎస్	1,935.00	1,901.00	1,920.80	1,901.55	19.25	1.01
బిపిసిఎల్	360.35	355.00	357.45	353.95	3.50	0.99
యాక్సిస్ బ్యాంక్	676.85	665.20	669.75	663.65	6.10	0.92
టైటాన్ కంపెనీ	984.00	969.15	978.00	969.65	8.35	0.86
యుపిఎల్	767.10	747.00	753.10	747.35	5.75	0.77

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
జీ ఎంటర్‌టేన్	439.35	288.30	318.40	433.85	115.45	26.61
మారుతీ సుజుకీ	7,133.00	6,410.00	6,513.40	7,040.60	527.20	7.49
అల్ట్రాటెక్ సిమెంట్	3,800.00	3,480.05	3,510.80	3,790.70	279.90	7.38
హీరో మోటోకార్ప్	2,788.75	2,652.70	2,670.15	2,790.20	120.05	4.30
ఇండియాబుల్స్	793.00	733.15	744.50	773.50	29.00	3.75
గ్రాసిమ్	794.60	757.05	759.60	785.80	26.20	3.33
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	285.50	273.25	274.65	283.65	9.00	3.17
ఏసియన్ పేయింట్స్	1,413.70	1,353.30	1,372.15	1,401.85	29.70	2.12
ఐసిఐసిఐ బ్యాంక్	364.65	354.55	357.20	364.80	7.60	2.08
ఎం అండ్ ఎం	703.50	681.00	683.50	697.30	13.80	1.98

ప్రియాంక అందం చూసి ఓట్లేస్తారా?
బీహార్ బిజెపి మంత్రి వ్యాఖ్యలు



పాట్నా : అందం తప్ప ప్రియాంక గాంధీ గురించి మాట్లాడుకోవడానికి ఏమీ లేదని బీహార్ మంత్రి, బిజెపి సీనియర్ నేత వినోద్ నారాయణ్ జా వ్యాఖ్యానించారు. ప్రియాంక అందమైన బొమ్మ, అయితే అందం చూసి జనం ఓట్లేస్తాదని కాంగ్రెస్ పార్టీ వారు ఆశలు పెట్టుకోవద్దని అన్నారు. రాష్ట్ర ప్రజారోగ్య మంత్రిగా ఉన్న జా మాటలపై నిరసన వ్యక్తం అయింది. ఈ వ్యాఖ్యలను తాను సమ్మతించడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రియాంకపై వ్యాఖ్యలకు దిగిన మంత్రిని బర్తరఫ్ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు డిమాండ్ చేశారు. మహిళల పట్ల ఏహ్యాభావం ఉన్న వారే ఇటువంటి మాటలకు దిగుతారని విమర్శించారు. 'అవును ప్రియాంక అందమైనది, చాలా బాగా ఉంటుంది. ఆమెకు ఇతరత్రా ఎటువంటి చతురత నైపుణ్యపు లక్షణాలు లేవు. ప్రకృతి ఆమెకు అందాన్ని ప్రసాదించింది. అయితే ప్రియాంకను బొమ్మగా చూపి ఓట్ల వేటకు దిగాలనే కాంగ్రెస్ తాపత్రయం ఫలించబోదని, అందం చూసి ప్రజలు ఓట్లు వేయబోరని ఈ మంత్రి చెప్పారు. ప్రభావితం చేసే లక్షణాలు ఏమీలేవని, పైగా భర్త రాబర్ట్ వాద్రా తీవ్రస్థాయి అవినీతి ఆరోపణలలో నిండామునిగి ఉన్నాడని, ప్రియాంకను ఇందిరతో పోలుస్తూ కాంగ్రెస్ నేతలు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

అయోధ్య బెంచ్‌కు జస్టిస్ భూషణ్, నజీర్

న్యూఢిల్లీ : అయోధ్య కేసుపై కీలక విచారణ జరిపే ధర్మాసనాన్ని సుప్రీం కోర్టు పునర్వ్యస్థీకరించింది. ఈ నెల 29వ తేదీ నుంచి ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారిస్తుంది. అయోధ్య వ్యాజ్యంపై ధర్మాసనంలోకి ఇప్పుడు జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లను తీసుకున్నారు. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ధర్మాసనాన్ని పునర్వ్యస్తీకరించారు. ప్రధాన న్యాయమూర్తి గొగోయ్, న్యాయమూర్తులు ఎస్ఎ బొడే , జస్టిస్ డివై చంద్రచూడ్‌లు ఇప్పటికే ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ నెల 29 నుంచి అయోధ్య వ్యాజ్యాన్ని విస్తృత స్థాయిలో విచారించడం జరుగుతుందని సుప్రీంకోర్టు వెల్లడించింది. వ్యాజ్యం వివిధ కారణాలతో పెండింగ్‌లో పడటం వల్ల నానాటికి ఇది జటిలం అవుతోందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. కేసు విచారణకు నూతన ధర్మాసనం ఏర్పాటు చేస్తామని ఈ నెల 4వ తేదననే ప్రధాన నాయమూర్తి తెలిపారు. ఇక అయోధ్య వ్యాజ్యంపై విచారణను ప్రాధాన్యతాక్రమంలో ఎందుకు ముందుగా చేపట్టడం లేదని దీనిపై కారణాలు తెలియచేయాలని తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయింది. అయితే దీనిని సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది.

మలయాళ దర్శకుడిపై ఆవుపేడతో దాడి



తిరువనంతపురం: జాతీయ అవార్డు గ్రహీత, మలయాళ దర్శకుడు ప్రియనందనన్‌పై కొందరు వ్యక్తులు ఆవు పేడతో దాడి చేశారు. తనపై దాడి చేసింది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలేనని 53 ఏళ్ల ప్రియనందనన్ ఆరోపించారు. త్రిసూర్‌లోని ఆయన ఇంటి సమీపంలో ఈ దాడి జరిగింది. ఈ దాడిలో చెవికి గాయమైన ఆయనను ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రియనందనన్‌పై జరిగిన దాడిని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. ఈ రాష్ట్రంలో ఈ రకమైన దాడులను సహించేది లేదని ఆయన హెచ్చరించారు. దీనికి ముందు తనపై సంఘ పరివార్ సైబర్ దాడి జరిపిందని ఆయన తెలిపారు. భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడిగా దీన్ని ఆయన అభివర్ణించారు. జనవరి 11న ప్రియనందనన్ శబరిమలలోని అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని సమర్థిస్తూ తన ఫేస్ బుక్ పేజీలో పెట్టిన ఒక పోస్టు తీవ్ర దుమారం రేపింది. దీనిపై బిజెపి నాయకులతో సహా సంఘ్ పరివార్ కార్యకర్తలు ధ్వజమెత్తారు. ఆయన ఇంటి ముందు ధర్నాలు కూడా చేశారు.

ఇద్దరు జైషే ఉగ్రవాదుల అరెస్ట్
మార్కెట్లు, గ్యాస్‌పైప్‌లైన్లు టార్గెట్

న్యూఢిల్లీ : గడచిన రెండు రోజుల్లో అరెస్టు చేసిన ఇద్దరు జైషె మొహమ్మద్(జెఇఎం) ఉగ్రవాదులు లజ్‌పత్ నగర్, తూర్పు ఢిల్లీలోని ఒక గ్యాసు పైపులైన్ పైన దాడి చేయడానికి కుట్ర పన్నినట్లు ఢిల్లీ పోలీసులు శుక్రవారం వెల్లడించారు. అబ్దుల్ లతీఫ్ గని అలియాస్ ఉమేర్ అలియాస్ దిలావర్, హిలాల్ అనే ఈ ఇద్దరు ఉగ్రవాదులు ఆ రెండు ప్రాంతాలలో రెక్కీ కూడా నిర్వహించినట్లు ఇంటరాగేషన్‌లో బయటపడిందని వారు చెప్పారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీ పోలీసుకు చెందిన ప్రత్యేక విభాగం ఉగ్రవాద కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టడంతో ఈ ఇద్దరు జెఇఎం ఉగ్రవాదులు చిక్కారు. అరెస్టయిన ఇద్దరిలో ఒక ఉగ్రవాది ఇటీవల జమ్మూ కశ్మీరులో జరిగిన గ్రెనేడ్ దాడులలో సూత్రధారి అయిన పోలీసులు చెప్పారు. గణతంత్ర దినోత్సవం నాడు దేశ రాజధానిలో ఇటువంటి దాడులే జరపాలని ఈ ఇద్దరు ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

'కొడనాడు' కేసులో పళనిస్వామికి ఊరట



చెన్నై: కొడనాడు ఎస్టేట్ హత్య కేసులో తమిళనాడు ముఖ్యమంత్రి పళని స్వామికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఎస్టేట్ హత్య కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని సామాజిక కార్యకర్త కేఆర్ రామస్వామి వేసిన పిటిషన్‌ను సుప్రీం శుక్రవారం తోసిపుచ్చింది. 2017లో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన ఎస్టేట్‌లో ఆమె గార్డ్ ఓమ్ బహదూర్(40) అనుమానాస్పద స్థితిలో హత్యకు గురయ్యాడు. ఈ హత్యతో సీఎం పళనిస్వామికి సంబంధాలున్నట్లు ఓ మ్యాగజైన్ మాజీ ఎడిటర్ విడుదల చేసిన వీడియో క్లిప్ ఆధారంగా ట్రాఫిక్ రామస్వామి(కేఈ రామస్వామి) సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు.

షట్‌డౌన్‌కు త్వరలో ముగింపు పలకాలి
అమెరికా సెనేటర్ కమలా హారిస్



వాషింగ్టన్: గతంలో ఎన్నడూ లేని విధంగా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు ముగింపు పలకాలని, వీలయినంత త్వరలో తిరిగి ఫెడరల్ ప్రభుత్వం పనిచేసేలా చూడాలని అమెరికాలో భారతీయ సంతతి తొలి సెనేటర్ అయిన కమలా హారిస్ అన్నారు. కాగా నెల రోజుల క్రితం ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లుపై గురువారం సెనేట్‌లో ఓటింగ్ జరగనున్నట్లు కాలిఫోర్నియా డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ అయిన కమలా హారిస్ చెప్పారు.' ప్రభుత్వ షట్‌డౌన్ ప్రారంభమై 34 రోజులైంది. ప్రభుత్వానికి నిధులు సమకూర్చడానికి ఉద్దేశించిన, నెల రోజుల క్రితం ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లుపై ఈ రోజు(గురువారం) సెనేట్‌లో ఓటింగ్ జరగబోతోంది. 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు మాపై ఆశలు పెట్టుకుని ఉన్నారు' అని ఆమె అన్నారు. అమెరికా–మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్ల నిధులు ఇవ్వాలని అధ్యక్షుడు ట్రంప్ కోరుతుండడం ఆర్థిక బిల్లు పార్లమెంటులో ఆమోదానికి ప్రధాన అడ్డంకిగా మారిన విషయం తెలిసిందే. మెక్సికో సరిహద్దులగుండా అక్రమ వలసదారులు అమెరికాలోకి రాకుండా అడ్డుకోవడానికి ఈ గోడ నిర్మాణం అవసరమని ట్రంప్ అంటుండగా, పన్ను చెల్లింపుదారుల సొమ్మును వృథా చేయడమేనని ప్రతిపక్ష డెమొక్రాట్లు వాదిస్తున్నారు. ఫలితంగా అమెరికా ప్రభుత్వం పాక్షికంగా మూతపడినట్లయింది. దాదాపు 8 లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు, వేతనాలు, పని లేకుండా ఇళ్లలో ఉండిపోవలసిన పరిస్థితి ఎదురైంది. కాగా 2020లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌పై పోటీ చేయడానికి డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేయడానికి తాను బరిలో దిగుతున్నట్లు మూడు రోజుల క్రితం హారిస్ ప్రకటించిన విషయం తెలిసిందే. సరిహద్దు గోడను నిర్మించినంతమాత్రాన దేశం భద్రంగా ఉంటుందని చెప్పడం అర్థం లేని మాట అని, నిజంగా దేశం భద్రంగా ఉండాలంటే దేశాన్ని కాపాడే వారికి జీతాలు చెల్లించాలని ఆమె అన్నారు.

10% కోటాపై స్టే కుదరదు

సుప్రీంకోర్టు రూలింగ్ ● రాజ్యాంగ సవరణపై పరిశీలన ● కేంద్రానికి నోటీసులు జారీ



న్యూఢిల్లీ : అగ్రవర్ణాల పేదలకు పదిశాతం కోటాపై స్టే మంజూరీకి సుప్రీం కోర్టు నిరాకరించింది. జనరల్ కేటగిరిలోని పేదలకు విద్యాసంస్థలు, ప్రభుత్వోద్యోగాలలో కోటా కల్పిస్తూ ఇటీవలే కేంద్రం చట్టం తీసుకువచ్చింది. అయితే దీనిని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు అయ్యాయి. వీటిని విచారించిన ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నాయకత్వపు ధర్మాసనం స్టే కుదరదని పేర్కొంది. అయితే ఈ కోటా కల్పనకు చేపట్టిన రాజ్యాంగ సవరణ చెల్లుబాటు గురించి పరిశీలిస్తామని ధర్మాసనం తెలియచేసింది. సార్వత్రిక కేటగిరిలో కోటా కల్పనపై దాఖలైన పిటిషన్లపై స్పందించిన సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు వెలువరించింది. రాజ్యాంగ సవరణకు దిగడం ఆమోదయోగ్యమా? కాదా? అనేది తేల్చుకోవల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా కూడా ఉన్నారు. తాము విషయాన్ని తరువాత పరిశీలిస్తామని, ముందుగా కేంద్రానికి నోటీసులు పంపిస్తున్నామని ధర్మాసనం వెల్లడించింది. కేంద్రం నిర్ణయంపై స్టే కుదరదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం తన వివరణలను మూడు వారాలలో తెలియచేసుకోవల్సి ఉంటుందని తెలిపింది. అయితే ఈ పిటిషన్లు విచారణకు అర్హం కావని, వీటిని కొట్టివేయాలని , కేంద్ర మంత్రి మండలి కోటా నిర్ణయాన్ని నిలిపివేయరాదని ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. కోటాను సమర్థిస్తూ ఆయన తీవ్ర స్థాయిలో తమ వాదన విన్పించారు. అయితే పిటిషన్లకు అనుగుణంగా స్టే ఇవ్వడం లేదని, కేంద్రం నుంచి తగు వివరణ రాబట్టేందుకు కేవలం నోటీసు వెలువరిస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ఈ దశలో పిటిషనర్ల తరఫున కొందరు లాయర్లు లేచి తమ వాదనలు ఒకేసారి విన్పించే యత్నం చేశారు. దీనిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గొడవల కోసం కోర్టులకు రావద్దని, ఇంతటితో ఈ కేసు విషయం పక్కనపెడుతున్నామని పేర్కొంటూ ధర్మాసనం మరో కేసు విచారణను చేపట్టింది. పది శాతం కోటాను జన్‌హిత్ అభియాన్, యూత్ ఫర్ ఈక్వాలిటీ స్వచ్ఛంద సంస్థ న్యాయస్థానంలో సవాలు చేశాయి. రిజర్వేషన్లకు కులాల వారి ఆర్థిక ప్రాతిపదికలను తీసుకోరాదని రాజ్యాంగం స్పష్టం చేసిందని యూత్ ఫర్ ఈక్వాలిటీ అధ్యక్షులు కౌశల్ కాంత్ మిశ్రా తమ పిటిషన్‌లో తెలిపారు. బిల్లు సమానతా కోణంలో చెల్లనేరదని దీనిని కొట్టివేయాలని అభ్యర్థించారు. ఇక రిజర్వేషన్ల కోటాలు 50 శాతం పరిమితి దాటరాదని రాజ్యాంగం చెబుతోంది. పైగా అగ్రవర్ణాల పేదలకు పది శాతం కోటాలు కల్పించడం రాజ్యాంగంలో లేదని తెలిపారు. కేంద్రం పదిశాతం కోటా కల్పనతో రిజర్వేషన్ల వాటా 60 శాతం మించిపోతుందని, ఇది సుప్రీం కోర్టు ఇంతకు ముందు వెలువరించిన తీర్పునకు వ్యతిరేకం కాదా? అని పిటిషనర్ ప్రశ్నించారు. ప్రస్తుతం రాజ్యాంగానికి చేసిన సవరణలను కేవలం అగ్రవర్ణాలలోని పేదలకు ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రాతిపదికగా చేసుకోవడంగా మారిందని పిటిషనర్ తెలిపారు. వీరికే దీనిని వర్తింపచేయడం ఇతరత్రా అనుమానాలకు దారితీస్తుందన్నారు. ఇక మొత్తం మీద చూస్తే కోటా కల్పనకు ఖరారు చేసిన అత్యధిక ఆదాయ పరిమితి (క్రీమీలేయర్) ఏడాదికి రూ 8 లక్షలు చేయడంతో ఒబిసిలు, ఎస్‌సి/ఎస్‌టి లలోని సంపన్న వర్గాలే పలు విధాలుగా కోటా ప్రయోజనాలు దక్కించుకుంటాయి. ఇదే క్రమంలో ఈ కేటగిరీలకు చెందిన అణగారిన వారికి పూర్తి స్థాయిలో అన్యాయం కొనసాగుతూ ఉంటుందని స్పష్టం చేశారు. ఇక ఈ కోటాను సవాలు చేస్తూ వ్యాపారవేత్త తెహసీన్ పూనావాల్లా దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు రాలేదు. రిజర్వేషన్లకు ఆర్థిక వెనుకబాటుతనాన్నే ప్రాతిపదికగా చేసుకోవడం కుదరదని ఈ పిటిషన్‌లో విన్నవించుకున్నారు.

1978 పూర్వ నివాసితులకే కోటా : గుజరాత్

అహ్మదాబాద్ : అగ్రవర్ణాల పేదలకు పదిశాతం కోటా వర్తింపుపై గుజరాత్ ప్రభుత్వం షరతులు పెట్టింది. నివాస కాలపరిమితిని 1978గా ఖరారు చేసింది. కేంద్రం తీసుకువచ్చిన తాజా కోటాను అమలులోకి తెస్తున్నట్లు తొలుత గుజరాత్ ప్రకటించింది. అయితే ఈ కోటాపై గుజరాత్ ప్రభుత్వం రాష్ట్రంలో నివాస సంబంధిత మెలిక పెట్టింది. రాష్ట్రంలో 1978 కన్నా ముందునుంచి ఉన్న అగ్రవర్ణాలలోని పేదలే ఈ కోటాకు అర్హులని గుజరాత్ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ శుక్రవారం వార్తా సంస్థలకు తెలిపారు. 1978 ముందు నుంచి రాష్ట్రంలో ఉన్నవారికి, ఈ సంవత్సరానికి ముందు రాష్ట్రానికి వలస వచ్చి స్థిరపడ్డ వారికి ఈ కోటా వర్తిస్తుందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. అగ్రవర్ణాలలోని పేదలకు వారి ఆర్థిక వెనుకబాటు తనం ప్రాతిపదికన కోటా వర్తింపచేస్తామని ఇటీవలే గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన వెలువరించింది. దీని మేరకు ప్రభుత్వోద్యోగాలు, ఉన్నత విద్యాసంస్థలలో పది శాతం కోటాను ఉత్తారాయణ ప్రారంభం అంటే జనవరి 14 నుంచే చేపడుతారని వివరించారు. అయితే దీనికి సంబంధించి ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి వెలువరించిన ప్రకటనతో కోటా కల్పనపై ప్రకంపనలు రెకెత్తాయి.

15 నెలల్లో కోటీ 80 లక్షల ఉద్యోగాలు



- ఇఎస్ఐసి అధ్యయనంలో వెల్లడి
- ఉపాధి అవకాశాలపై వివిధ కోణాల్లో అధ్యయనం
- ఇఎస్ఐలో కొత్తగా దాదాపు 2 కోట్ల సభ్యులు

న్యూఢిల్లీ: దేశంలో 15 నెలల కాలంలో అంటే 2017 సెప్టెంబర్ నుంచి ప్రారంభించి 2018 నవంబర్ వరకు ప్రభుత్వ రంగంలో కోటి 80 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించడం జరిగిందని పేరోల్ డాటా ఆఫ్ రిటైర్‌మెంట్ ఫండ్ సంస్థ ఇపిఎఫ్ఓ, పిఎఫ్ఆర్‌డిఎ, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) జరిపిన అధ్యయనం సూచించింది. 2018 నవంబర్ వర కు గడచిన 15 నెలల కాలంలో ఇఎస్ఐసి నిర్వహించే ఇఎస్ఐ పథకంలో 1,84,38,748 మం ది కొత్త సభ్యులు చేరారని కేంద్ర గణాంక కార్యాలయం (సిఎస్ఓ) జరిపిన అధ్యయనం తెలిపిం ది. వివిధ సామాజిక భద్రతా పథకాలలో పే రోల్ వివరాల ఆధారంగా ఈ అధ్యయనం జరిపారు. 15 నెలల కాలంలో... ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఓ) అమలుచేసే భద్రతా పథకాలలో 1,79,34,300 మంది కొత్తగా చేరినట్టు శుక్రవారం విడుదల చేసిన సిఎస్ఓ అధ్యయన నివేదిక పేర్కొంది. అయితే, ఈ పదిహేను నెలల కాలంలో 1,39,31,607 మం ది ఇపిఎఫ్ఓ పథకాల నుంచి తప్పుకొన్నారని, 33,48,093 మంది మళ్లీ సభ్యత్వం తీసుకున్నారని ఆ నివేదిక తెలిపింది. మొత్తానికి 73,50,786 మంది అదనంగా చేరినట్టు ఈ అధ్యయనం ద్వారా తెలిసింది. 2018లో కేవలం నవంబర్ నెలలోనే 10,31,484 మంది ఇఎస్ఐలో కొత్తగా చేరారు. 2017 నవంబర్‌లో 11,84,042 మంది చేరారు. ఆ గణాంకాలతో పోల్చుకుంటే 2018 నవంబర్‌లో చేరిన వారు 12.88 శాతం తక్కువ. 15నెలల కాలంలో మొత్తం చేరినవారితో చూసుకుంటే ఒక్క 2018 జూలైలోనే అధిక సంఖ్యలో 14,68,880 మంది ఇఎస్ఐ పథకంలో చేరారు. ఈ పదిహేను నెలల్లో అధికారిక రంగంలో ఉపాధి కల్పన 48 శాతం పెరిగింది.

ఒక్క 2018 నవంబర్‌లోనే 7.32 లక్షల మంది చేరారు. ఏడాది కిందట అంటే 2017లో ఇదే నెలలో 4.93 లక్షలమంది చేరారని ఈ నెలారంభంలో ఇపిఎఫ్ఓ విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. ఈ 15 నెలల్లో కొత్త పెన్షన్ పథకం కింద (ఎన్‌పిఎస్) 9,19,791 మంది సభ్యులవుతారని అంచనా వేశారు. ఎన్‌పిఎస్‌ను పెన్షన్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) నిర్వహిస్తోంది. అధికారిక రంగంలో ఉపాధి అవకాశాల గురించి వివిధ కోణాల్లో ప్రస్తుత నివేదిక పరిశీలించిందని, అయితే సంపూర్ణగా ఉపాధి అవకాశాల గురించి అంచనా వేయలేదని సిఎస్ఓ అధ్యయనం తెలిపింది. 2017తో ప్రారంభించి 2018 ఏప్రిల్ నుంచి గణాంకాలు ..ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ (ఎంఓఎస్‌పిఐ) శాఖ ఉపాధికి సంబంధించిన గణాంకాలను అప్పుడప్పుడూ వెల్లడిస్తోంది. ఇపిఎఫ్, ఇఎస్ఐ, ఎన్‌పిఎస్ వంటి ప్రధాన పథకాల కింద చేరిన సభ్యులసంఖ్యననుసరించి ఈ సమాచారాన్ని అందిస్తోంది. వివిధ ఆధారాలననుసరించి సభ్యుల గణన జరిగింది కనుక, అంచనాల్లో కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చని మంత్రిత్వశాఖకు అనుబంధంగా ఉన్న సిఎస్ఓ తెలిపింది.

స్పీకర్‌జీ... ఇది మీకు తగునా? : కాంగ్రెస్



న్యూఢిల్లీ: ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ నియామకంపై చేసిన వ్యాఖ్యలకు లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్ తీవ్ర విమర్శల పాలయ్యారు. గురువారం విలేకరులతో మహాజన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఒక్కరే తన బాధ్యతలను నిర్వర్తించలేకపోతున్నారని, అందుకే తన సోదరిని పార్టీలోకి తీసుకువచ్చారని వ్యాఖ్యానించారు. "ఆమె (ప్రియాంక) చాలా మంచి వ్యక్తి. తాను ఒక్కడే రాజకీయాలు చేయలేనని రాహుల్ అంగీకరిచాడు. అందుకే ప్రియాంక సాయం తీసుకుంటున్నాడు. ఇది మంచి పరిణామమే" అంటూ సుమిత్ర పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారీ మండిపడ్డారు. స్పీకర్ మహాజన్ తన దృష్టిని బిజెపి అంతర్గత విషయాలపై సారించాలని కోరుతున్నామని, కాంగ్రెస్ విషయానికి వస్తే ఆమె సలహా లేకుండానే బాగానే రాణిస్తున్నామని అన్నారు. ప్రియాంక రాజకీయ ప్రవేశం అధికార బిజెపిని వణికిస్తున్నదనడానికి ఇదే నిదర్శనమని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఇలా ఉండగా, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఓమర్ అబ్దుల్లా కూడా ప్రియాంకపై స్పీకర్ మహాజన్ వ్యాఖ్యలను తప్పుపట్టారు. "ఇటువంటి చవకబారు వ్యాఖ్యలు పదవి నుంచి వైదొలిగాక చేస్తే మంచిది" అంటూ స్పీకర్ మహాజన్‌పై ఆయన చురకలు అంటించారు.

బైక్‌లపై తగ్గించారు.. విస్కీపై అలాగే ఉంచారు

భారత్‌లో సుంకాలపై ట్రంప్ అసంతృప్తి



వాషింగ్టన్: అమెరికానుంచి దిగుమతి అయ్యే మోటారు సైకిళ్లపై దిగుమతి సంకాలను సగానికి తగ్గించాలని భారత్ గత ఏడాది తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సముచితమైన ఒప్పందంగా అభివర్ణించారు. కేవలం రెండే నిమిషాలు మాట్లాడి హార్లే డేవిడ్‌సన్‌లాంటి మోటారు సైకిళ్లపై సుంకాలను సగానికి తగ్గించేలా చేశానని ఆయన చెప్పుకున్నారు. అయితే అమెరికా విస్కీపై భారత్‌లో భారీ ఎత్తున సుంకాలు విధించడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేయడంతో భారత్ హార్లే డేవిడ్‌సన్‌లాంటి అమెరికా మోటారు సైకిళ్లపై సుంకాన్ని యాభై శాతానికి తగ్గించింది. అమెరికానుంచి దిగుమతి అయ్యే బైక్‌లపై సుంకాలు ఎక్కువగా ఉండడంతో భారత్‌నుంచి దిగుమతి అయ్యే బైకులపై కూడా సుంకాలు పెంచుతామని ట్రంప్ బెదిరించారు. పరస్పర వాణిజ్య చట్టంపై వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఇతర దేశాల్లో విధిస్తున్న పన్నులపై ఉదాహరణలు ఇచ్చారు.' మోటారు సైకిళ్ల నేఉదాహరణగా తీసుకుందాం. భారత్‌లో వీటిపై 100 శాతం పన్ను ఉండేది. కేవలం రెండే నిమిషాలు మాట్లాడి ఈ పన్నును 50 శాతానికి తగ్గించేలా చేయగలిగా. అయినప్పటికీ ఇది 50 శాతం వర్సెస్ 2.4 శాతం (అమెరికాకు దిగుమతి అయ్యే బైక్‌లపై విధించే సుంకం)గా ఉంది. మిగిలినవన్నీ పక్కన పెడితే ఆది సముచిత ఒప్పందమే' అని ట్రంప్ అన్నారు. అయితే అమెరికా నుంచి దిగుమతి చేసుకునే మద్యంపైనా భారత్ భారీగా సుంకాలు విధిస్తోందని ట్రంప్ అన్నారు.' భారత్‌లో పన్నులు అధికంగా ఉన్నాయి. అక్కడ వేర్వేరు సుంకాలు విధిస్తారు. విస్కీ విషయాన్నే చూడండి.. అక్కడ 150 శాతం పన్ను విధిస్తున్నారు. మనకుమాత్రం ఏమీ రావడం లేదు' అని ట్రంప్ అన్నారు.

నిర్మాణాత్మక చర్చలే పరిష్కారం

వెనిజులా సంక్షోభంపై భారత్

న్యూఢిల్లీ: వెనిజులాలో పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్నామని, అక్కడ తలెత్తిన రాజకీయ సంక్షోభాన్ని నిర్మాణాత్మక చర్చలద్వారా పరిష్కరించేకోవడం మంచిదని భారత్ అభిప్రాయపడింది. దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాలో శరవేగంగా చోటు చేసుకున్న పరిణామాల మధ్య ప్రతిపక్ష నాయకుడు, జాతీయ అసెంబ్లీ చీఫ్ జాన్ గైడో తాత్కాలిక దేశాధ్యక్షుడిగా ప్రకటించుకోవడంతో ఆ దేశం రాజకీయ సంక్షోభంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. వెనిజులా అధ్యక్షుడిగా నికోలస్ మదురో గత ఏడాది మేలో రెండో సారి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే మదురో పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చితికి పోయిందని, శాంతిభద్రతలు క్షీణించాయని పేర్కొంటూ గైడో తనను తాను తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. అమెరికా, బ్రెజిల్,అర్జెంటీనా, కొలంబియా సహా చాలా దేశాలు గైడోను దేశాధ్యక్షుడిగా గుర్తించగా, దీనికి ప్రతిగా మదురో 72 గంటల్లోగా అమెరికా దౌత్యవేత్తలందరినీ దేశం వదిలిపెట్టి వెళ్లాలని ఆదేశించడం తెలిసిందే. అంతేకాదు వెనిజులాలో రాజకీయ అస్థిరతను సృష్టించడానికి అమెరికా కుట్రపన్నుతోందని గురువారం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో మదురో ఆరోపించారు. 'నిర్మాణాత్మక చర్చల ద్వారా, హింసకు దిగుకుండా కేవలం చర్చలద్వారా మాత్రమే తమ విభేదాలను పరిష్కరించేకోవడానికి ఒక రాజకీయ పరిష్కారాన్ని కనుగొనాల్సింది వెనిజులా ప్రజలేననేది మా అభిప్రాయం' అని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్‌కుమార్ చెప్పారు. వెనిజులాలో పరిస్థితిని భారత్ జాగ్రత్తగా గమనిస్తోందని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్యంలో వెనిజులా ప్రజల అభివృద్ధి, సుఖసంతోషాలకు అక్కడ శాంతి భద్రతలు చాలా ముఖ్యమని తాము నమ్ముతున్నామని కూడా ఆయన అన్నారు. భారత్, వెనిజులాల మధ్య సుహృద్భావ సంబంధాలున్నాయని కూడా ఆయన చెప్పారు.

వాళ్ల తిట్లే నాకు గొప్ప బహుమతులు

మోడీ తిట్టిన ప్రతిసారి ఆలింగనం చేసుకోవాలనిపిస్తుంది : రాహుల్

భుబనేశ్వర్: రాజకీయ ప్రత్యర్థులు తిట్టే తిట్లే వారు తనకు ఇచ్చే గొప్ప బహుమతులని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. శుక్రవారం నాడిక్కడ మేధావులతో ఏర్పాటు చేసిన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడుతూ, "బిజెపి నుంచి, ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చే తిట్లే నాకు గొప్ప విషయాలు. వారు నాకు ఇచ్చిన గొప్ప బహుమతులు ఇవే. నన్ను తిట్టిన ప్రతిసారి మోడీ వైపు చూస్తుంటాను. తిట్టినందుకు ఆయనను ఆలింగనం చేసుకోవాలని నాకు అనిపిస్తుంటుంది" అంటూ రాహుల్ చమత్కరించారు. ప్రధాని మోడీకి కాంగ్రెస్ అంటే పడదని, అయినప్పటికీ ఆయనపై తమకెటువంటి కోపం లేదని, తాము ఎవరినీ ద్వేషించబోమని రాహుల్ చెప్పారు. తన నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీల హత్యలను ప్రస్తావిస్తూ "ద్వేషం వల్ల ఏమీ సాధించలేమని మాకు అర్థమైంది" అని రాహుల్ పేర్కొన్నారు.



ఫొటో జర్నలిస్టుకు రాహుల్ చేయూత

జెడ్ ప్లస్ క్యాటగిరి భద్రతలో ఉండే రాహుల్ తన భద్రతను పక్కనపెట్టి ఆపదలో ఉన్న ఒక వ్యక్తిని ఆదుకోవడానికి ముందుకు ఉరికిన అరుదైన దృశ్యం విమానాశ్రయంలో ఆవిష్కృతమైంది. ఒడిశాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం కోసం రాహుల్ శుక్రవారం హెలికాప్టర్‌లో ఇక్కడి విమానాశ్రయం చేరుకున్నారు. ఎయిర్‌పోర్ట్ వెలుపలకు వస్తున్న రాహుల్‌ను ఫొటో తీసేందుకు ప్రయత్నిస్తున్న ఒక ఫోటో జర్నలిస్టు అదుపు తప్పి మెట్ల పైనుంచి దొర్లి కింద పడిపోయాడు. తన కళ్ల ముందే జరిగిన ఈ దృశ్యాన్ని చూసిన రాహుల్ తన భద్రతను ఛేదించుకుని అతడిని చేరుకున్నారు. ఆ ఫొటో జర్నలిస్టును తానే స్వయంగా లేవనెత్తి సపర్యలు చేశారు. తనకేం ఫర్వాలేదని చెప్పేంతవరకు రాహుల్ అతని పక్కనే ఉన్నారు. ఆ తర్వాత వెళుతూ వెళుతూ అతని బాగోగులు చూసుకోండంటూ తన పార్టీ కార్యకర్తలకు ఆయన పురమాయించారు.

వరుణ్ ఎంట్రీ గురించి తెలియదు

న్యూఢిల్లీ : సోదరుడు, బిజెపి ఎంపి వరుణ్‌గాంధీ కాంగ్రెస్‌లో చేరుతారనే వార్తలపై రాహుల్ గాంధీ స్పందించారు. వరుణ్ తమ పార్టీలోకి వస్తున్నారనే ఊహాగానాలేవీ తన దృష్టికి రాలేదని రాహుల్ తెల్చిచెప్పారు. కేంద్ర మంత్రి మేనక గాంధీ కుమారుడైన వరుణ్ గాంధీ ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ బిజెపి ఎంపిగా ఉన్నారు. యుపిలో కాంగ్రెస్ బలోపేతం కీలకంగా ఇటీవలే రాహుల్ సోదరి ప్రియాంక కాంగ్రెస్ ప్రత్యక్ష రాజకీయాలలోకి దూసుకువచ్చారు. యుపిలోని కీలక ప్రాంతాల్లో పార్టీ బలం పెంచేందుకు వరుణ్‌ను కాంగ్రెస్‌లోకి వచ్చేలా ప్రియాంక యత్నిస్తారని కొన్ని పత్రికలలో వార్తలు వెలువడ్డాయి.

శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు పట్టు బిగించింది. శ్రీలంకపై భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకున్న ఆసీస్ పటిష్ట స్థితికి చేరుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 144 పరుగులకే ఆలౌటైన విషయం తెలిసిందే. మరోవైపు ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 323 పరుగులు చేసింది. 72/2 ఓవర్‌నైట్ స్కోరుతో శుక్రవారం రెండో రోజు బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాను లబుస్చంగే, ట్రావిస్ హెడ్ ఆదుకున్నారు.

మన తెలంగాణ
హైదరాబాద్
శనివారం 26, జనవరి 2019
www.manatelangana.news



సమరోత్సాహంతో భారత్

ప్రతీకారం కోసం కివీస్

నేడు రెండో వన్డే



మౌంట్ మాంగానూయ్: తొలి వన్డేలో ఘన విజయం సాధించిన టీమిండియా శనివారం న్యూజిలాండ్‌తో జరిగే రెండో మ్యాచ్‌కు సమరోత్సాహంతో సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌లో ఆధిక్యాన్ని మరింత పెంచుకోవాలనే పట్టుదలతో కోహ్లి సేన ఉంది. మరోవైపు తొలి వన్డేలో భారత్ చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో ఆతిథ్య కివీస్ జట్టు బరిలోకి దిగుతోంది. రెండు జట్లలోనూ ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు కొదవలేదు. దీంతో పోరు ఉత్కంఠభరితంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌లో కివీస్‌తో పోల్చితే భారత్‌కే గెలుపు అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో చాలా బలంగా ఉన్న టీమిండియాను ఓడించాలనే కివీస్ అసాధారణ ఆటను కనబరచక తప్పదు.

ఓపెనర్లే కీలకం

కిందటి మ్యాచ్‌లో భారత్ గెలిచినా ఓపెనర్ రోహిత్ శర్మ తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. అయితే ఈ మ్యాచ్‌లో మాత్రం రోహిత్ భారీ ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. తొలి వన్డేలో శిఖర్ కీలక ఇన్నింగ్స్ ఆడడం జట్టుకు కలిసి వచ్చే అంశం. కొంతకాలంగా భారీ స్కోర్లు సాధించడంలో విఫలమవుతున్న ధావన్ నేపియర్‌లో మాత్రం భారీ స్కోరు సాధించాడు. ఇది జట్టుకు శుభపరిణామంగా చెప్పొచ్చు. ఇక, భీకర ఫామ్‌లో ఉన్న రోహిత్ తొలి మ్యాచ్‌లో చేజేతులా వికెట్‌ను పారేసుకున్నాడు. ఈసారి మాత్రం మెరుగైన ఇన్నింగ్స్ ఆడాలనే లక్ష్యంతో పోరుకు సిద్ధమయ్యాడు.

జోరుమీదున్నాడు

ఇక, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి తొలి వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈసారి కూడా జట్టుకు అండగా నిలువాలని భావిస్తున్నాడు. ప్రపంచ క్రికెట్‌లో ఎదురులేని బ్యాట్స్‌మన్‌గా మారిన కోహ్లి కొంత కాలంగా పరుగుల వరద పారిస్తున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌లో నిలకడగా రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఫార్మాట్ ఏదైనా కోహ్లి ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. కివీస్ సిరీస్‌లో కోహ్లి మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడుతున్నాడు. ఈ పరిస్థితుల్లో మిగిలిన రెండు వన్డేల్లోనూ రాణించి జట్టుకు సిరీస్ అందించాలనే పట్టుదలతో ఉన్నాడు.

భారీ స్కోరు ఖాయం

ఈ మ్యాచ్‌లో కూడా భారత్ బ్యాట్స్‌మెన్ పరుగుల వరద పారించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, కెప్టెన్ కోహ్లితో పాటు మహేంద్ర సింగ్ ధోని, రాయుడు, జాదవ్, విజయ్, భువనేశ్వర్‌లతో భారత బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. తొలి మ్యాచ్‌లో భారత్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈసారి అవకాశం లభిస్తే మిగిలిన బ్యాట్స్‌మెన్‌లు కూడా సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. జాదవ్, కార్తీక్, ధోని, శంకర్ తదితరులతో బ్యాటింగ్ పటిష్టంగా మారింది. వీరు రాణిస్తే భారీ స్కోరు సాధించడం భారత్‌కు కష్టం కాదు. అంతేగాక భారీ లక్ష్యాన్ని సయితం ఛేదించే సత్తా టీమిండియాకు ఉంది. ఆస్ట్రేలియాపై కూడా భారీ లక్ష్యాలను భారత్ అలవోకగా ఛేదించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా భారత్‌కు బ్యాటింగ్ కీలకంగా మారింది.



ప్రతీకారం కోసం

మరోవైపు తొలి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని భావిస్తోంది. తొలి మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ విఫలయ్యారు. దీంతో జట్టు తక్కువ స్కోరుకే ఆలౌటైంది. కానీ, ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు సాధించాలని తహతహలాడుతోంది. ఓపెనర్ మార్టిన్ గుప్టిల్‌పై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన గుప్టిల్ చెలరేగితే టీమిండియా బౌలర్లకు కష్టాలు ఖాయం. ఇక, కొలిన్ మన్రో, నికోలస్, కెప్టెన్ విలియమ్సన్, గ్రాండోమ్, లాథమ్ తదితరులతో కివీస్ బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. అంతేగాక టిమ్ సౌథి, బ్రేస్‌వెల్, బౌల్ట్, సాంట్నర్ వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు ఉండనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ మ్యాచ్‌లో కివీస్‌ను ఓడించడం కోహ్లి సేనకు అంత సులువు కాదనే చెప్పాలి. రెండు జట్లు కూడా గెలుపే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు హోరాహోరీగా సాగడం తథ్యం.

బౌలింగే బలంగా

ఇక, తొలి వన్డేలో భారత బౌలర్లు అసాధారణ రీతిలో చెలరేగి పోయారు. మహ్మద్ షమీ అద్భుత బౌలింగ్‌తో ప్రారంభంలో కివీస్‌కు కోలుకోలేని దెబ్బతీశాడు. తొలి మ్యాచ్‌లో ఒక్క వికెట్ కూడా తీయని సీనియర్ బౌలర్ భువనేశ్వర్ ఈసారి మెరుగైన ప్రదర్శన ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నాడు. షమీ, భువనేశ్వర్ చెలరేగితే కివీస్ బ్యాట్స్‌మెన్‌కు కష్టాలు ఖాయమనే చెప్పాలి. ఇక, నేపియర్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన మ్యాచ్ విన్నర్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, చాహల్‌లు కూడా సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. తొలి వన్డేలో ఇద్దరు కలిసి ఏకంగా ఆరు వికెట్లు తీశారు. దీంతో కివీస్ బ్యాటింగ్ లైనప్ తక్కువ స్కోరుకే కుప్పకూలింది. ఆ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసిన కుల్దీప్ ఈసారి కూడా అలాంటి ప్రదర్శనే కనబరచాలని భావిస్తున్నాడు. ఇక, చాహల్ కూడా జోరుమీదున్నాడు. కేదార్, విజయ్ శంకర్‌లు కూడా పొదుపుగా బౌలింగ్ చేయడం జట్టుకు కలిసి వచ్చే అంశం. ఇలా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా ఉన్న భారత్ ఈ మ్యాచ్‌లో కూడా గెలుపే లక్ష్యంగా పెట్టుకుంది.









హారిక, ఛెత్రి, గంభీర్‌లకు పద్మశ్రీ పురస్కారాలు

న్యూఢిల్లీ: క్రీడల్లో అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించిన క్రీడా కుసుమాలకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత అవార్డు పద్మశ్రీలతో సత్కరించింది. భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రి, స్టార్ క్రికెటర్ గౌతం గంభీర్, చెస్ ఆణిముత్యం, తెలుగుతేజం ద్రోణవల్లి హారిక, టేబుల్ టెన్నిస్ స్టార్ శరత్ కమల్, ఆర్చరీ క్రీడాకారిణి బాంబల్యాదేవి లయిశ్రమ్, స్టార్ రెజ్లర్ భజరంగ్ పునియా, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి ప్రశాంతి సింగ్ తదితరులకు ప్రతిష్టాత్మకమైన పద్మశ్మీ అవార్డులు లభించాయి. మరోవైపు ప్రముఖ పర్వతారోహకురాలు బచేంద్రిపాల్‌కు పద్మభూషణ్ అవార్డు దక్కింది. కాగా, ఆయా రంగాల్లో విశిష్ఠ సేవలు అందించిన వారికి ప ద్మ అవార్డులతో సత్కరించడం అన వాయితీగా వస్తోంది. ఈసారి కూడా క్రీడాకారులకు వారి సేవలకు గుర్తింపుగా పద్మ అవార్డులు వరించాయి.





సెమీస్‌లో సైనా

జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ సైనా నెహ్వాల్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్‌ల పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ఒక్క సైనా మాత్రమే టైటిల్ రేసులో నిలిచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సైనా 21–7, 21–18 తేడాతో థాయిలాండ్ క్రీడాకారిణి పార్న్‌పావి చోచువాంగ్‌ను ఓడించింది. తొలి గేమ్‌లో సైనా చెలరేగి ఆడింది. చూడచక్కని షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తూ ముందుకు సాగింది. ఇదే క్రమంలో అలవోకగా సెట్‌ను గెలుచుకుంది. కానీ, రెండో గేమ్‌లో సైనాకు ప్రత్యర్థి నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. వాంగ్ అద్భుత ఆటతో సైనాను హడలెత్తించింది. కానీ, చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన సైనా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. మరోవైపు అగ్రశ్రేణి క్రీడాకారిణి సింధు పోరాటానికి క్వార్టర్ ఫైనల్లోనే తెరపడింది. చిరకాల ప్రత్యర్థి, స్పెయిన్ స్టార్ కరోలినా మారిన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో సింధు ఓటమి పాలైంది. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన మారిన్ 21–11, 21–12 తేడాతో రెండో సీడ్ సింధును చిత్తు చేసింది. ఈ ఏడాది ఆడిన తొలి టోర్నీలోనే సింధు పేలవమైన ఆటతో నిరాశ పరిచింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో కూడా భారత్‌కు చుక్కెదురైంది. స్టార్ ఆటగాడు శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి చవిచూశాడు. ర్యాంకింగ్స్‌లో తనకంటే కిందిస్థాయిలో ఉన్న జొనాథన్ క్రిస్టి (ఇండోనేషియా) చేతిలో శ్రీకాంత్ కంగుతున్నాడు. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో క్రిస్టి 21–18, 21–19 తేడాతో శ్రీకాంత్‌ను ఓడించాడు.

ఎదురులేని జకోవిచ్

రేపు నాదల్‌తో తుది పోరు



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) ఫైనల్‌కు చేరుకున్నాడు. ఆదివారం జరిగే తుది సమరంలో రెండో సీడ్, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్‌తో అమీతుమీ తేల్చుకుంటాడు. ఇక, మహిళల టైటిల్ పోరు శనివారం జరుగనుంది. ఫైనల్లో జపాన్ ఆశాకిరణం నవోమి ఒసాకా, చెక్ రిపబ్లిక్ స్టార్ పెట్రా క్విటోవా తలపడుతారు. మరోవైపు మహిళల డబుల్స్ విభాగంలో సమంత స్టోసర్ (ఆస్ట్రేలియా), జాంగ్ షువాయ్ (చైనా) జంట టైటిల్‌ను గెలుచుకుంది. కాగా, శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో సెమీ ఫైనల్లో అగ్రశ్రేణి ఆటగాడు జకోవిచ్ అలవోకగా విజయం సాధించాడు. ఫ్రాన్స్‌కు చెందిన 28వ సీడ్ లుకాస్ పౌలీతో జరిగిన పోరులో జకోవిచ్ 6–0, 6–2, 6–2తో జయభేరి మోగించాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన జకోవిచ్ ఏదశలోనూ ప్రత్యర్థిక కోలుకునే అవకాశం ఇవ్వలేదు. సెమీస్ చేరే క్రమంలో సంచలన విజయాలు సాధించి పౌలీ ఈ మ్యాచ్‌లో మాత్రం కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయాడు. జకోవిచ్ దూకుడు ముందు పౌలీ పూర్తిగా తేలి పోయాడు. తొలి సెట్‌లో అయితే జకోవిచ్ ఒక్క కూడా కోల్పోకుండానే విజయం సాధించాడు. తన మార్క్ షాట్లతో అలరించిన జకోవిచ్ 6–0తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. తర్వాతి రెండు సెట్లలో కూడా జకోవిచ్ ఇదే జోరును కనబరిచాడు. అసాధారణ షాట్లతో చెలరేగిన ప్రపంచ నంబర్ వన్ జకోవిచ్ ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకున్నాడు. కిందటి ఏడాది వరుసగా రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీలు గెలుచుకున్న జకోవిచ్‌కు ఇది వరుసగా మూడో ఫైనల్ కావడం విశేషం. ఈ టోర్నీలో కూడా విజయం సాధిస్తే జకోవిచ్ ఖాతాలో హ్యాట్రిక్ ట్రోఫీలు చేరుతాయి. కానీ, స్పెయిన్ నాదల్‌ను ఓడించడం జకోవిచ్‌కు అనుకున్నంత తేలికకాదనే చెప్పాలి. ఇద్దరు దిగ్గజాల నడుమ జరిగే ఫైనల్ సమరం అందరిలోనూ ఆసక్తి ఆసక్తి రేకెత్తిస్తోంది.

స్టోసర్ జోడీకి టైటిల్

మహిళల డబుల్స్ విభాగంలో సమంతా స్టోసర్, జాంగ్ షువాయ్ జోడీ టైటిల్ గెలుచుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో స్టోసర్ జంట 6–3, 6–4తో రెండో సీడ్ క్రిస్టియానా మ్లాదెనొవిక్ (ఫ్రాన్స్), టైమియా బాబస్ (హంగేరి) జోడీని ఓడించింది. స్టోసర్ జంట ప్రారంభం నుంచే దూకుడును ప్రదర్శించింది. అద్భుత సమన్వయంతో ఆడిన ఆస్ట్రేలియా–చైనా జోడీ వరుసగా రెండు సెట్లు గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది.

వీరిద్దరూ చెలరేగి ఆడడంతో క్రిస్టియానా జోడీకి ఇబ్బందులు తప్పలేదు. రెండో సీడ్‌గా బరిలోకి దిగినా స్టోసర్–జాంగ్ దూకుడు ముందు ఎదురు నిలువలేక పోయింది. చివరి వరకు దూకుడును ప్రదర్శించిన స్టోసర్ జోడీ అలవోకగా మ్యాచ్‌ను గెలిచి ప్రతిష్టాత్మకమైన డబుల్స్ టైటిల్‌ను దక్కించుకుంది.

నేడు క్విటోవా–ఒసాకా టైటిల్ పోరు

మహిళల సింగిల్స్ ఫైనల్ సమరం శనివారం జరుగనుంది. ఈ పోరులో నాలుగో సీడ్ నవోవి ఒసాకా (జపాన్), 8వ సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) తలపడుతారు. ఎవరూ గెలిచినా వారి ఖాతాలో ఇదే ఆస్ట్రేలియా ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ అవుతుంది. కాగా, ఒసాకా కిందటి ఏడాది జరిగిన చివరి గ్రాండ్‌స్లామ్ అమెరికా ఓపెన్‌లో టైటిల్ గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్ గెలిచిన తొలి ఆసియా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టిస్తోంది. కాగా, క్విటోవా గెలిస్తే ఆమె ఖాతాలో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరుతుంది. క్విటోవా ఇంతకుముందు రెండు సార్లు వింబుల్డన్ సింగిల్స్ టైటిల్స్ గెలుచుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఇటు ఒసాకా, అటు క్విటోవా అసాధారణ ఆటను కనబరిచి టైటిల్ పోరుకు చేరుకున్నాయి. టైటిల్ ఎవరికి దక్కుతుందో ముందే ఊహించడం కష్టంగా మారింది. ఇద్దరు కూడా ప్రతిభావంతులే కావడంతో తుది పోరు ఉత్కంఠభరితంగా సాగడం ఖాయం.

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని రెండు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల ఆశయాల సాధనకు మనందరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నిరంతర కృషి, అనేక సంక్షేమ పథకాల అమలు ద్వారా తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాల వారికి సమానంగా అందాలన్నారు.

విశాల



శుక్రవారంనాడు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలో ఓ యువతికి ఓటరు కార్డు అందజేస్తున్న రాష్ట్రపతి

ఇవిఎంల పనితీరు భేష్ : రవిశంకర్

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎంలు) పనితీరును కేంద్ర న్యాయశాఖామంత్రి రవిశంకర్ ప్రసాద్ శుక్రవారం సమర్థించారు. ఎన్నికల సంఘాన్ని విశ్వసించి, ఆ వ్యవస్థ పవిత్రతను గౌరవించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. బెదిరింపులకు లొంగి ఎన్నికల సంఘం ఇవిఎంలను వదులుకోదని, మళ్లీ బ్యాలెట్ పత్రాల పద్ధతిని అనుసరించే ప్రశ్నే లేదని ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరా స్పష్టంచేసిన ఒక రోజు తర్వాత రవిశంకర్ ప్రసాద్ ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ నిపుణుడిని అని చెప్పుకొన్న సయ్యద్ షుజా గత సోమవారం ఇవిఎంలను హ్యాక్ చేయవచ్చని, 2014 ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. ఆ ఆరోపణల నేపథ్యంలో అనేక ప్రతిపక్షాలు రాబోయే ఎన్నికల్లో ఇవిఎంల బదులు బ్యాలెట్ పత్రాల్ని ఉపయోగించాలని డిమాండ్ చేశాయి. 'నేను రాజకీయ వ్యాఖ్య చేయదలుచుకోలేదు. ఇదే ఇవిఎం మా పార్టీకి విజయాన్ని, ఓటమిని కూడా తెచ్చిపెట్టింది. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు ఇదే ఇవిఎంతో గెలిచారు' అని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. ఎన్నికల సంఘం ఇవిఎంలను సమర్థించడం వింతగా ఉందని, ఈ విషయంలో అన్ని వర్గాలవారి అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాతే ఒక నిర్ణయానికి రావాలని గురువారంనాడు కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది.

జైట్లీ త్వరగా కోలుకుంటున్నారు



న్యూఢిల్లీ : వైద్య చికిత్స కోసం అమెరికాలో ఉన్న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఆరోగ్యంగా ఉన్నారని, ఆయన త్వరగా కోలుకుంటున్నారని తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అరుణ్‌జైట్లీ అనారోగ్యంతో ఉన్నందున ఈ వారు గోయల్‌ను తాత్కాలిక ఆర్థికమంత్రిగా నియమించారు. జైట్లీ ఏ రకమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు, ఎప్పుడు తిరిగి వచ్చేదీ గోయల్ చెప్పలేదు. శుక్రవారం జరిగిన ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే ఫంక్షన్‌లో గోయల్ పాల్గొన్నారు. 'గత రాత్రి పొద్దుపోయాక జైట్లీతో మాట్లాడే అవకాశం చిక్కింది. ఆయన త్వరగా కోలుకుంటున్నారు. ఆరోగ్యంగా ఉండాలని నాతోపాటు మీరూ కోరుకుంటున్నారని తెలుసు. అవార్డు గ్రహీతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గతవారం అనుకోకుండా జైట్లీ మెడికల్ చెకప్ కోసం అమెరికా వెళ్లారని ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. జనవరి 13న అమెరికా వెళ్లిన జైట్లీకి సాఫ్ట్ టిష్యూ కేన్సర్ టెస్ట్ చేసి, అనంతరం గత మంగళవారం సర్జరీ చేశారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ముగ్గురు భారత రత్నాలు

ప్రణబ్, భూపెన్, నానాజీలకు అత్యున్నత పౌర పురస్కారం

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత పౌర గౌరవ పురస్కారం భారత రత్న ఈ ఏడాది ముగ్గురికి దక్కింది. ఈ విశిష్టమైన అవార్డుకు ఈసారి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రముఖ గాయకులు, కవి, సాహితీవేత్త భూపెన్ హజారికా, సామాజిక కార్యకర్త నానాజీ దేశ్‌ముఖ్‌లను ఎంపిక చేసినట్లు రాష్ట్రపతి భవన్ వర్గాలు ఒక ప్రకటన వెలువరించాయి. .దేశ 70వ గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో భారత రత్న పురస్కారాలతో పాటు పద్మ పురస్కారాకు ఎంపిక చేసిన వారి పేర్లను కూడా శుక్రవారం వెల్లడించారు. భారతరత్నకు ఎంపికైన వారిలో నానాజీ దేశ్‌ముఖ్, హజారికాలకు వారి మరణానంతరం ఈ అత్యున్నత పురస్కారం ప్రకటించారు. కాంగ్రెస్‌లో కురువృద్ధ నేతగా, తరతరాల రాజకీయ అనుభవజ్ఞుడిగా, రాష్ట్రపతిగా విశేషానుభవం ఉన్న ప్రణబ్ ముఖర్జీ సమకాలీన నేతల్లో అత్యంత ప్రముఖులుగా నిలిచారు.పూర్వపు భారతీయ జనసంఘ్ నేత అయిన దివంగత నానాజీ దేశ్‌ముఖ్ సంఘ్ పరివార్ సంవిధానాల ఆచరణపరుడైన సామాజిక కార్యకర్తగా నిలిచారు. ఇక ఈశాన్య ప్రాంతపు అసోంకు చెందిన భూపెన్ హజారికాకు బహుముఖ వ్యక్తిత్వ ప్రతిభ ఉంది, కవిగా, గాయకుడిగా, గేయ రచయితగా, సంగీత దర్శకుడిగా పేరొందిన హజారికా సినిమాలు కూడా నిర్మించారు. దేశ 13వ రాష్ట్రపతిగా వ్యవహరించిన ప్రణబ్ ముఖర్జీ ప్రణబ్ దాగా చిరపరిచితులు, వివిధ స్థాయిలలో తాను కలిసి పనిచేసిన ప్రముఖ నేతలతో తన అనుభవాలను పంచుకుంటూ ఆయన ఇటీవల పుస్తకం వెలువరించారు. స్వాతంత్ర్యానంతర రాజకీయ గమనానికి ఈ పుస్తకం అద్దం పట్టింది. ప్రణబ్ ముఖర్జీ 2012 – 2017 వరకూ దేశ ప్రథమ పౌరుడిగా సేవలు అందించారు. కాంగ్రెస్ నేతగా ఆయన తన ప్రజా జీవిత ఘట్టం ఆరంభం అయింది. కాంగ్రెస్ హయాంలో ఆయన పలు కీలక మంత్రిత్వశాఖలను నిర్వర్తించారు. ప్రత్యేకించి ఆర్థిక మంత్రిగా, విదేశాంగ మంత్రిగా విశేష అనుభవం గడించారు. గాయకుడిగా పేరొందిన భూపెన్ హజారికా ఈశాన్య ప్రాంతంలోని వివిధ తెగలను తన కళారూపాలతో ఏకం చేసేందుకు గళమెత్తిన వ్యక్తిగా, సంగీతంతో అందరిని ఏకం చేసిన శక్తిగా మారారు. స్వాతంత్ర్యానంతర భారతంలో తమకంటూ గుర్తింపును దక్కించుకునేందుకు, తమ అస్తిత్వం కాపాడుకునేందుకు పోరాడుతూ వచ్చిన పలు బృందాలకు కేంద్ర బిందువుగా మారారు. ఆయన విశిష్ట ప్రజాజీవితంలో పలు అవార్డులు దక్కించుకున్నారు. 1987 సంగీత నాటక అకాడమీ అవార్డు, 1977లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. నానాజీ దేశ్‌ముఖ్ విద్యా, ఆరోగ్య, గ్రామీణ స్వయం సమృద్ధి రంగాలలో ఎనలేని సేవలు అందించారు. భారతీయ జనసంఘ్ సభ్యులుగా ఉంటూ రాజ్యసభ సభ్యులు అయ్యారు. 1999లో పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు.





ప్రజలకు రుణపడి ఉంటా

భాతరదేశ అత్యున్నత పురస్కారానికి నన్ను ఎంపిక చేయడాన్ని సవినయంగా స్వాగతిస్తున్నాం. దేశ ప్రజానీకానికి కృతజ్ఞతలు. ఈ దేశానికి తాను ఇచ్చినదాని కన్నా, ప్రజలు నాకు ఇచ్చిందే ఎక్కువ

– ట్విట్టర్‌లో ప్రణబ్

సిఎం కెసిఆర్ హర్షం



మన తెలంగాణ / హైదరాబాద్ : మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రతిష్ఠాత్మక భారతరత్న పురస్కారం లభించడంపట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ పురస్కారానికి ప్రణబ్ ముఖర్జీ అన్ని విధాలా అర్హులని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టపర్చడానికి, రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలుచేయడానికి ప్రణబ్ ముఖర్జీ ఎంతో చొరవ చూపారని ముఖ్యమంత్రి కొనియాడారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక పదవులు నిర్వహించి దేశానికి ఎంతో సేవ చేశారని ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ సందర్భంగా ఒక ప్రకటనలో గుర్తుచేశారు.





పద్మ విభూషణ్‌లు నలుగురు

ఈ ఏడాది పద్మ విభూషణ్ పురస్కారాలకు నలుగురు ఎంపికయ్యారు. వీరిలో జానపద గాయకులుగా ఉన్న తీజన్ బాయి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు. ప్రజా సంబంధాల్లో ప్రముఖులుగా నిలచిన ఇస్మాయిల్ ఉమర్ గులెహ్ విదేశీయులు, మహారాష్ట్రకు చెందిన అనిల్‌కుమార్ మణిభాయ్ నాయక్‌కు వ్యాపార, పరిశ్రమ మౌలిక నిర్మాణ రంగాలకు సంబంధించిన సేవలకు ఈ పురస్కారం దక్కింది. ఇక రంగ స్థల నాటకంలో విశిష్ట ఖ్యాతి గడించిన మహారాష్ట్రకు చెందిన బల్వంత్ మోరేశ్వర్‌కు కూడా పద్మ విభూషణ్ దక్కింది.

పద్మ భూషణ్‌లు 14 మంది

ఈ సారి పద్మభూషణ్ పురస్కారానికి మొత్తం 14 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. జర్నలిస్టు , విద్యావేత్త కులదీప్ నయ్యర్‌కు ఈ పురస్కారం దక్కింది. సామాజిక కార్యకర్త హర్యానాకు చెందిన దర్శన్ లాల్ జైన్‌ను పద్మ భూషణ్‌కు ఎంపిక చేశారు. ఇక ప్రజాసంబంధాలకు సంబంధించి విశిష్ట సేవలు అందించిన హకుందేవ్ నారాయణ్ యాదవ్‌కు కూడా ఈ పురస్కారం ప్రకటించారు. ఆయన బీహార్‌కు చెందిన వారు. ఇక కేరళకు చెందిన ఎస్ నంబి నారాయణ్‌కు శాస్త్ర అంతరిక్ష, ఇంజనీరింగ్ రంగాలలో సేవలకు గుర్తింపుగా పద్మభూషణ్‌కు ఎంపిక చేశారు. జార్ఖండ్‌కు చెందిన కరియా ముండాకు ప్రజా సంబంధాలలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వచ్చింది.

94 మందితో పద్మశ్రీల జాబితా

తెలంగాణ కోటాలో ఛత్రి, సిరివెన్నెల

ఈ ఏటి పద్మశ్రీల పురస్కారాలకు మొత్త 94 మందిని ఎంపిక చేశారు. వీరిలో తెలంగాణ కోటాలో ఫుల్‌బాల్ క్రీడాకారుడు సునీల్ ఛత్రి ఉన్నారు. మహారాష్ట్రకు చెందిన ఉత్తమ నటుడు మనోజ్ బాజ్‌పాయ్‌కి, కర్నాటక కోటా నుంచి నటుడు , నృత్య దర్శకులు ప్రభు దేవాకు, తెలంగాణ కోటాలోనే ప్రముఖ గేయరచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి, ఇక అమెరికాలో ఉంటున్న వ్యాపార, పరిశ్రమల దిగ్గజం శంతను నారాయణ్, ప్రముఖ గాయకలు శంకర్ మహాదేవన్, తమిళనాడుకు చెందిన కళాకారుడు ఆనందన్ శివమణి, వ్యవసాయ రంగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యడ్లపల్లి వెంకటేశ్వర రావు వంటి ప్రముఖులు పద్మశ్రీ పురస్కారాల జాబితాలో ఉన్నారు.





పద్మవిభూషణ్‌లు వీరే

ముగ్గురూ ముగ్గురే



ఈయేడు భారతరత్న పురస్కారాలకు ఎంపికైన వారు తమతమ రంగాలలో ఆణిముత్యాలే. ప్రణబ్ దా సమకాలీన నేతలలో విశిష్ట రాజనీతిజ్ఞుడు. దేశానికి దశాబ్దాలుగా అలుపెరగకుండా సేవలు అందిచారు. దేశ ప్రగతి పథంలో ఆయన ముద్రను మిగిల్చారు. ఆయన విజ్ఞత, మేధాసంపత్తి అసమాన్యం. ప్రణబ్‌కు భారతరత్న దక్కడం ఆనందదాయకం. ఇక నానాజీ దేశ్‌ముఖ్ నిరాడంబరుడు. ఎంతో సహనం ఆయనకు వివిధ రంగాలలో విశిష్ట స్థానాన్ని తెచ్చిపెట్టింది. గ్రామీణ చైతన్యం దిశలో విశిష్ట పాత్రను పోషించారు. గాయకులు హజారికా భారతీయ శాస్త్రీయ సంగీతానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకువచ్చారు. మారుమూల గానానికి ఎల్లలు దాటిన ఖ్యాతిని తెచ్చిపెట్టారు. తరాలతో సంబంధం లేకుండా ఆయన పాటలను అంతా మెచ్చుకున్నారు. భూపెన్ దాకు భారతరత్న దక్కడం హర్షదాయకం.

– నరేంద్ర మోడీ, ప్రధాని

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666